నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015 11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 42 | శుక్రవారం | 09-01-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## 500 శాతం సుంకాల బిల్లు

రష్యా నుంచి చమురు కొనకుండా ప్రోత్సాహకాలు

సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రకటన

02




పురపాలక సంస్థలకు

## రూ.10 కోట్లు

నిధులు విడుదలచేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం పరిధిలో పురపాలక సంస్థలకు సహాయం అందించేందుకు రూ.10 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (యుఎల్‌బి) శాఖ గురువారం జి.ఓ ఆర్‌టి నెంబర్. 33ను జారీ చేసింది. ఇప్పటికే తరువాయి 12లో

అదానీ, అంబానీలకు ప్రజలను

# కూలీలుగా మార్చేందుకే...

## మహాత్మాగాంధీ ఉపాధి హామీ రద్దు

● వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్ ● అధికారం ఉందికదా అని ప్రజలను అణచివేస్తామంటే కుదరదు ● ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాలి ● రైతు చట్టాలు, ఉపాధి హామీ చట్టాలపై ప్రధాని క్షమాపణ చెప్పాలి ● టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ ● సామ్రాజ్యవాదులకంటే బిజెపి ప్రమాదకరం : డిప్యూటీ సిఎం భట్టి ● జి రామ్ జికి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేస్తాం : మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ, అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. వికసిత్ భారత్ కాదు, సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి రోజు రాష్ట్ర ఎంపిలు నిరసన తెలపాలన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) విస్తృతస్థాయి సమావేశం గురువారం గాంధీభవన్‌లో జరిగింది. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, మహ్మద్ అజారుద్దీన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, నాయకులు ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పిఎసి) సభ్యులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి తరువాయి 2లో

### ములుగులో సభకు సోనియాగాంధీ

సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలి. ఈ నెల 20 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలి. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. ఫిబ్రవరి 3 నుంచి తొమ్మిది జిల్లాల్లో భారీ బహిరంగ సభలుఏర్పాటు చేస్తున్నాం. ములుగులో ఏర్పాటు చేసే బహిరంగ సభకు సోనియా, రాహుల్ , ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తున్నాం.

– సిఎం రేవంత్‌రెడ్డి

### అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం

02

విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ధాన్యం నిల్వలకు

## సైలో వ్యవస్థ

● అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం యోచన
● ఈ పద్ధతితో ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల ఆదాయం
● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు చేతికి అందిన ధాన్యం నష్ట పోకుండా ఉండేందుకు ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోనికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మనుషుల జోక్యం లేకుండానే సైలో పద్ధతిలో ఉండే ఇంటిగ్రేటెడ్ క్లీనర్లు, డ్రైయర్లతో రెండు సంవత్సరాల వరకు ధాన్యాన్ని నిలువ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తరువాయి 2లో



## ఎసిబికి చిక్కిన ఎస్ఐ

రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ ఎసిబి అధికారుల వలకు చిక్కాడు. పేకాట కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటున్న సమయంలో హన్మకొండ ఎసిబి అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ తరువాయి 2లో



రవాణా వ్యవస్థలో

## విప్లవాత్మక మార్పులు

తెలంగాణలో తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వివరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ రాజధానిలోని భారత మండపంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన ‘రవాణా అభివృద్ధి మండలి (టిడిసి) 43వ సమావేశం’లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో రవాణా రంగ ప్రక్షాళన, రహదారి భద్రత, మౌలిక వసతుల కల్పనపై తరువాయి 2లో

మేడారం జాతరకు రండి..

## కెసిఆర్‌కు ఆహ్వానం

ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేసిన మంత్రులు సీతక్క, సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావును రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖలు ఆహ్వానించారు. కెసిఆర్‌ను ఆహ్వానించేందుకు వారు ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి గురువారం వెళ్లారు. ఇంటికి వచ్చిన మంత్రులను కెసిఆర్ తరువాయి 2లో





ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త

## మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

**న్యూఢిల్లీ :** ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, పశ్చిమ కనుమల పరిరక్షణ యోధుడు, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మాధవ్ గాడ్గిల్ (83)కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పుణెలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు మాధవ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. కాగా, ప్రపంచంలోనే అత్యంత జీవ వైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన ఎనలేని కృషి తరువాయి 2లో

## సమస్యల్లో యూనివర్సిటీలు

● విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి ● విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు
● రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నూతన జాతీయ విద్యావిధానం
● ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్



ప్రజాపక్షం/కెయు క్యాంపస్

ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధనం విద్య అని, ఆ విద్యనే నేటి పాలకులు భ్రష్టుపట్టిస్తున్నారని, సమస్యల సుడిగుండంలో యూనివర్సిటీలు ఉన్నాయని, విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ అన్నారు. సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేని నిస్సహాయ స్థితిలో పాలక వర్గాలున్నాయని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని దానిలో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానంను తీసుకువచ్చి పార్లమెంట్‌లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ) బిల్లు 2025ని ప్రవేశపెట్టిందని, రాష్ట్ర సర్కారు విద్యా సంవత్సరం ముగింపులో కూడా పెండింగ్ ఫీజులు చెల్లింపులు చెయ్యకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని, ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని ఆయన విమర్శించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో తరువాయి 12లో



మున్సిపల్‌లో పొత్తుకు

## కలిసొస్తే స్వాగతిస్తాం..

### లేదంటే ఒంటరి పోరే!

సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మున్సిపల్ ఎన్నికల్లో పొత్తులతో కలిసి వచ్చే వారిని స్వాగతిస్తామని, లేదంటే పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే ఒంటరి పోరుకైనా సిద్ధమే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చెప్పారు. సిపిఐపై కొందరు విమర్శలకు తరువాయి 12లో

66 యుఎన్ సంస్థల నుండి

## వైదొలగిన అమెరికా



ఇది స్వార్థపూరిత చర్య : పర్యావరణవేత్తల ఖండన

**వాషింగ్టన్:** వాతావరణ మార్పుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి తరపున కృషి చేస్తున్న ‘కాప్’ సహా అనేక సంస్థల నుండి వైదొలగుతున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ సంస్థలలో 31 సంస్థలు ఐక్యరాజ్యసమితికి చెందినవికాగా, మరో 35 ఇతర సేవాసంస్థలున్నాయి. ఈ సంస్థలవల్ల అమెరికాకు ఎలాంటి ప్రయోజనం లేదని, ఈ సంస్థల పనితీరు అసమర్థంగా ఉండటమే కాకుండా శత్రు ఎజెండాను ప్రోత్సహించేవిగా ఉన్నాయని వైట్‌హౌస్ అధికారయంత్రాంగం ప్రకటించింది. ట్రంప్ ఇప్పటికే అనేక బహుళపాక్షిక సంస్థలకు అమెరికా నిధులను నిలిపివేశారు. భూగోళంపై మానవనిర్మాణాల వల్ల సంభవించిన, సర్వత్రా ఏకాభిప్రాయం ప్రకటించిన వాతావరణ మార్పుల శాస్త్రీయ ఆలోచన కూడా బూటకమైదని ట్రంప్ తిరస్కరించారు. ఐక్యరాజ్యసమితి వాతావరణ సమస్య పరిష్కారానికి కృషి చేసే అంగీకృత సంస్థ యుఎన్ఎఫ్‌సిసిసి (యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్) సహా 66 అంతర్జాతీయ సంస్థల నుండి అమెరికా తరువాయి 12లో

ఐప్యాక్ ఆఫీస్‌పై

## ఇడి దాడులు

● సంస్థ డైరెక్టర్ ప్రతీక్‌జైన్ నివాసంలోనూ సోదాలు ● బొగ్గు అక్రమ రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థ చర్యలు ● హుటాహుటిన ఐ ప్యాక్ కార్యాలయానికి వెళ్లిన సిఎం మమతా బెనర్జీ ● రాజకీయ పార్టీల డేటాను సేకరించే పనికూడా ఇడిదేనా అంటూ మండిపాటు



**కోల్‌కతా :** వందల కోట్ల రూపాయల బొగ్గు అక్రమ రవాణా కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం కోల్‌కతాలోని రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయం, సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు నిర్వహించింది. అయితే ఇడి దాడులు జరుగుతున్న సమయంలోనే నాటకీయంగా తరువాయి 2లో

## అమెరికా దాడిలో 100 మంది మృతి

వెనిజులా మంత్రి అధికారిక ప్రకటన



**కారకస్:** అమెరికా చేసిన దాడిలో 100 మంది మరణించారని వెనిజులా దేశీయాంగమంత్రి డియోస్డాడో కాబెల్లో ప్రకటించారు. మరణించిన వారికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఫొటోలను కూడా విడుదల చేశారు. జనవరి మూడో తేదీ అర్ధరాత్రి వెనిజులా అధ్యక్ష భవనంపై అమెరికా డెల్టా ప్రత్యేక దళం దాడిచేసి ఆయన భద్రతా బృందాలను నిర్మూలించింది. వారితో పాటే అనేకమంది కూడా మరణించారు. వీరిలో క్యూబా దేశానికి చెందిన జాతీయులు 32 మంది నికొలస్ మదురోకు ప్రత్యేక రక్షణబృందంగా ఉన్నారు. ఈ దాడిలో వారు కూడా మరణించారు. వెనిజులాకు చెందిన 23 మంది సైనికులు కాల్పుల్లో మరణించారు. చాలా నిర్దాక్షిణ్యంగా, అమానవీయ పద్ధతులలో అందరినీ అమెరికా సైన్యం చంపిందని మంత్రి చెప్పారు. రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకు వెనిజులా మంత్రి కాబెల్లా గురువారం అధికారికంగా ఈ విషయం ప్రకటించారు. తొలుత సైనిక అధికారులు 56 మంది మరణించారని ప్రకటించారు. ఐతే చికిత్సపొందుతూ మరణించినవారు, మృతదేహాల సేకరణ తర్వాత తుది లెక్కలు తేల్చారు. ప్రస్తుతం నికొలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్ న్యూయార్క్ జైలులో ఉన్నారు. వారిపై మార్చి 17వ తేదీన రెండో విడత కోర్టు విచారణ ప్రారంభం అవుతుంది.


## గ్రీన్‌లాండ్ కొనుగోలుపై వచ్చే వారం చర్చలు

**న్యూయార్క్ :** గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసే విషయంపై డేనిష్ వర్గాలతో వచ్చేవారం చర్చలు జరిపేందుకు అమెరికా ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్దదైన అత్యంత ప్రకృతి సంపదగల ఆ దీవిని స్వాధీనం చేసుకోవడానికి అవసరమైతే సైనిక చర్యకైనా సిద్ధపడే ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తాని కొద్ది గంటల క్రితమే ప్రకటించిన వైట్‌హౌస్ తాజాగా ఆ విషయం పక్కనపెట్టి చర్చల మార్గం పట్టింది. ఆరు నూరైనా గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు మార్కో రుబియో గురువారం ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌ను ఏ విధంగా కొనుగోలు చేయాలనే విషయంపై డెన్మార్క్ నాయకులతో వచ్చే వారం సంభాషణలు చేస్తామని చెప్పారు. ఈ దిశగా వైట్‌హౌస్ ముమ్మర సన్నాహాలు చేస్తోంది. ఐతే డెన్మార్ ప్రభుత్వం మాత్రం ఒకేమాటపై నిలబడింది. డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతోపాటు యూరప్ నాయకులు కూడా అమెరికా ఆలోచనలను ప్రతిఘటించినప్పటికీ మార్కోరుబియో తాజాగా తెరమీదకు వచ్చారు. గ్రీన్‌లాండ్ చాలా వ్యూహాత్మకమైన ప్రాంతమని, చైనా, రష్యా, ఉత్తర కొరియా ప్రత్యర్థులను ప్రతిఘటించడానికి ఈ ప్రాంతం తమ అధీనంలో ఉండాల్సిందేనని రుబియో అన్నారు. ఈ విషయంలో ఇప్పటివరకూ ఎటూ తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్న యూరప్ దేశాల నాయకులలో చాలామంది ఇప్పుడు గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారాన్ని కాపాడాలనే ఆలోచనతో డెన్మార్క్‌కు మద్దతు ప్రకటించారు.

# 500 శాతం సుంకాల బిల్లు

రష్యా నుండి చమురు కొనకుండా ప్రోత్సాహకాలు

**సెనేటర్ లిండ్‌స్లే గ్రాహమ్ ప్రకటన**






**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్ సహా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు దేశాలపై భారీ ఎత్తున 500 శాతం వరకు సుంకాలు విధించే ఆంక్షల బిల్లును అమెరికా ప్రభుత్వం సిద్ధం చేసింది. వచ్చేవారంలో ఈ బిల్లు అక్కడి ఉభయసభల్లో ఆమోదం పొందితే రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోవడం భారత్‌కు అతిపెద్ద సమస్యగా మారుతుంది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే చైనా,భారత్,బ్రెజిల్ దేశాలు రష్యా చమురు కొనుగోలు చేయకుండా కట్టడి చేసేందుకు వైట్‌హౌస్ పాలనాయంత్రాంగానికి అపరిమిత అధికారాలు వస్తాయని అధికార రిపబ్లికన్‌పార్టీ సెనేటర్ లిండ్‌స్లే గ్రాహమ్ గురువారం ఎక్స్ వేదికగా చెప్పారు. ఈ దేశాలు రష్యా నుండి తక్కువ ధరకు చమరు కొనుగోలు చేయకుండా ప్రోత్సాహకాలు ఇవ్వడానికి వీలు కలుగుతుందని కూడా చెప్పారు. ఉక్రేన్‌లో శాంతి స్థాపనకు రష్యాను కట్టడి చేయాలంటే ఆ దేశంతో చమురు వ్యాపారంచేసే ఖాతాదారులను కూడా అదుపు చేయాల్సి ఉంటుందని, అందుకే ఈ బిల్లు తెస్తున్నామని లిండ్‌స్లే గ్రాహమ్ పేర్కొన్నారు. ''శాంతి సాధనకోసం ఉక్రేన్ కూడా రాయితీలు ఇస్తోంది, పుతిన్ మాటలతో కాలక్షేపం చేస్తూ ఉక్రేన్‌లో అమాయకులను చంపుతున్నారు, అందువల్ల ఇప్పుడు ఇదే సరైన తరుణం, ఈ ఆంక్షల బిల్లును ఆమోదిస్తే చైనా,భారత్,బ్రెజిల్ దేశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చు, రష్యా నుండి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేయకుండా వారిని అడ్డుకోవచ్చు'' అని చెప్పారు. అమెరికా కాంగ్రెస్‌లో అధికార ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేసి అందరి ఆమోదంతో బిల్లుకు చట్టరూపం తీసుకురాగలమన్న బలమైన ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుండి తాము చమురు కొనుగోళ్ళను బాగా తగ్గించేశామని, ఈ విషయం ట్రంప్‌కు తెలియజేసి భారత్‌పై విధించిన సుంకాల భారం తగ్గించాలని అమెరికాలో ఉన్న భారత రాయబారి వినయ్ కత్వా చెప్పారని వారం రోజులక్రితం గ్రాహం ప్రకటించారు. చైనా,భారత్,బ్రెజిల్ దేశాలే ప్రధానంగా రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగించడానికి పరోక్ష సహాయం చేస్తున్నాయని, ఈ దేశాలను కట్టడిచేసి రష్యా ఆర్థిక వనరుల మార్గాలను మూసివేస్తామని గడచిన ఆదివారం ఎయిర్‌ఫోర్స్–1లో వాషింగ్టన్‌కు వస్తూ ట్రంప్ పాత్రికేయులకు చెప్పారు. ఆ సమయంలోనే లిండ్‌స్లే గ్రాహం ఈ ఆంక్షల బిల్లు గురించి చెప్పారు. ఇప్పటికే ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ప్రపంచంలో ఏ దేశంపైనా ఇంత ఎక్కువ సుంకాలను అమెరికా వసూలు చేయడంలేదు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా 25 శాతం సుంకాలు భారత్‌పై వసూలు చేస్తోంది.

## కొలంబియా అధ్యక్షుడికి ట్రంప్ ఫోన్

చర్చలకు రావాలని ఆహ్వానం



**వాషింగ్టన్:** నిన్నటిదాకా కొలంబియాను బెదిరించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతలోనే స్వరం మార్చారు. చర్చలకు రావాలని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోకు గురువారం ఆహ్వానం పలికారు. ''చర్చిద్దాం వైట్‌హౌస్‌కు రండి'' అని పెట్రోను ఆహ్వానించి ప్రపంచదేశాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. కొలంబియా అధ్యక్షుడితో తాను ఫోన్‌లో మాట్లాడానని ట్రంప్ సోషల్ మీడియా వేదిక ''టూత్ సోషల్'' ద్వారా వెల్లడించారు. గడచిన వారం రోజులుగా ఉద్రిక్తతలకు దారితీసిన విషయాలు కూడా తమ ఫోన్ సంభాషణలో చోటు చేసుకున్నాయని ఆయన చెప్పారు. తమ మధ్య ఉన్న పరస్పర భిన్నాభిప్రాయాల గురించి కూడా మాట్లాడుకున్నామన్నారు. ''కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో ఫోన్‌లో సంభాషించడం తనకు ఒక గొప్ప గౌరవం, మాదక ద్రవ్యాల సమస్యవల్ల తలెత్తిన పరిస్థితులు, ఆ దేశంతో ఉన్న ఇతర భిన్నాభిప్రాయాల గురించి మాట్లాడా, సవివరంగా ఈ సమస్యపై చర్చించేందుకు వైట్‌హౌస్‌కు రావాలని ఆహ్వానించా'' అని చెప్పారు. ''అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, కొలంబియా విదేశీమంత్రిత్వశాఖాధికారులు వైట్‌హౌస్‌లో త్వరలో జరిగే చర్చలకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తారు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

వెనిజులాపై దాడి చేశాక తదుపరి లక్ష్యం కొలంబియా, మెక్సికో,క్యూబా దేశాలేనని ట్రంప్ ప్రకటించిన తర్వాత గుస్తావో పెట్రో కూడా ట్రంప్‌కు ప్రతిసవాలు చేశారు. దేశకోసం, దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడంకోసం తాను తిరిగి ఆయుధాలు చేపడతానని ఒకనాటి గెరిల్లా పోరాట యోధుడు పెట్రో ప్రకటించారు. ఈ పరస్పర విమర్శల ఉద్రిక్త వాతావరణం మధ్య మాదక ద్రవ్యాల సమస్యపై చర్చిద్దాం రండి'' అని ఆహ్వానించారు. ''కొలంబియా ఆర్థికంగా మంచానపడిన దేశం, ఆ దేశానికి ఒక రోగిష్ఠి పాలకుడు అధ్యక్షుడుగా ఉన్నాడు, ఆ దేశాధ్యక్షుడు స్వయంగా కొకైన్ అక్రమ వ్యాపారం చేస్తున్నాడు'' అని వెనిజులాపై దాడి ఘటన తర్వాత గుస్తావో పెట్రోపై ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు.
65 ఏళ్ళు వయసుగల గుస్తావో పెట్రో కొలంబియాకు 2022నుండి అధ్యక్షుడుగా ఉన్నారు. లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా పన్నాగాలను ఆయన ఎండగడుతూనే ఉంటారు. వెనిజులాపై దాడి జరిగిన తర్వాత ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసి తక్షణం భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేయించారు. ఆయన నాస్తికవాది. 17 ఏళ్ళ చిరుప్రాయంలోనే ఆయుధాలు చేపట్టిన గెరిల్లా యోధుడు.

## కూలీలుగా మారాలా? (మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తూ నిబంధనల మార్పు ముసుగులో మహాత్మా నరేగా పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. 'అధికారం ఉందని ప్రధాని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిది. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది' అన్నారు. పేదలపై కక్షతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా? అని సిఎం ప్రశ్నించారు. కేంద్రం తెచ్చిన నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదలలేదని, ఇప్పుడు ఉపాధి హామీ చట్టం విషయంలోనూ ప్రధాని క్షమాపణ చెప్పాల్సిందేనని సిఎం డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని బిజెపి నేతలు ప్రచారం చేశారని, అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారని, తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారని, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారని, విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో బిజెపి 240 సీట్ల వద్ద ఆగిపోయిందని, దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని సిఎం హెచ్చరించారు.

**సామ్రాజ్యవాదుల కంటే బిజెపి ప్రమాదకరం: డిప్యూటీ సిఎం**

''భారతదేశ స్వాతంత్రం కోసం గాంధీజీ నాయకత్వంలో దేశంలో అనేక పోరాటాలు, ఆందోళన జరిగితే సామ్రాజ్యవాదులైన బ్రిటిష్ పాలకులు ఏ ఒక్క రోజు గాంధీజీ పై లాఠీ కూడా ఎత్తలేదు. అలాంటిది స్వాతంత్రం వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే పట్టపగలు ఆర్‌ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు గాంధీజీని కాల్చి చంపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కంటే ఆర్‌ఎస్ఎస్ భావజలం కలిగిన బిజెపి ఈ దేశానికి అత్యంత ప్రమాదకరం''అని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఉపాధి చట్టం దానివల్ల జరిగే నష్టాలు గ్రామ గ్రామాన వివరించాలి, కొత్త ఉపాధి హామీ చట్టం రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలి కొత్త ఉపాధి హామీ పథకం రద్దు ఉద్యమంలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలందరూ పాల్గొంటారని డిప్యూటీ సీఎం చెప్పారు.

రాష్ట్రంలోని ప్రజలందరికి వివరించాలన్నారు. కొత్త ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్న మొట్టమొదటి ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎఐసిసి సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30 వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని, కరపత్రాలు నిర్వహించాలన్నారు.

## ఎసిబికి చిక్కిన ఎస్ఐ

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లో ఎస్ఐని ఎసిబి అధికారులు పట్టుకున్నారు. పేకాట కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని వేధిస్తూ కేసును తేలిక చేయాలంటే డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ శ్రీకాంత్ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ట్రాప్ నిర్వహించారు.

## మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అభివృద్ధి పేరిట అక్కడ జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై అలుపెరగని పోరాటం చేశారు. పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికిగానూ 2024 ఏడాదికి సంబంధించి ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్' ఆయనకు వరించింది. ఇప్పుడు ఆయన మృతితో దేశ పర్యావరణ రంగంలో ఓ శకం ముగిసిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## కెసిఆర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు కెసిఆర్‌కు 'జాతర ఆహ్వాన పత్రిక' ను అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అయిన మేడారం మహా జాతరకు తప్పనిసరిగా రావాలని వారు కెసిఆర్, ఆయన సతీమణి శోభమ్మను ఆహ్వానించారు. అలాగే ఆలయ ప్రసాదమైన బంగారం, నూతన వస్త్రాలను వారు కెసిఆర్ దంపతులకు బహుకరించారు. కాగా మంత్రులు సీతక్క, కొండాసురేఖకు కెసిఆర్, శోభ దంపతులు పసుపు, కుంకుమ, వస్త్రాలు, తలంబ్రాలతో సంప్రదాయ రీతిలో సత్కరించారు. కొద్దిసేపు పరస్పర యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కెసిఆర్‌ను కలిసిన తర్వాత మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా భక్తుల కోరికలు తీర్చే తల్లుల జాతర మేడారమని, ఈ మహాజాతరకు కెసిఆర్‌ను సతీసమేతంగా రావాలని ఆహ్వానించామని, తమ ఆహ్వానాన్ని స్వీకరించి, జాతరకు వస్తానని కెసిఆర్ చెప్పినట్లు వెల్లడించారు.

## అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందజేత

'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' లో బాలికలకు ప్రాధాన్యం

**విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున వైఐఐఆర్ఎస్‌ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం విద్యా శాఖపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వైఐఐఆర్సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని సిఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సిఎం అధికారులకు సూచించారు. వైఐఐఆర్ఎస్‌ల నిర్మాణాలకు సంబం ధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సిఎం ఆదేశించారు.

ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సిఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సిఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సిఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాల నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సిఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరంన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరంన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సిఎం ఆదేశించారు.

ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం పనులు వేగవంతం చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నందున దానిని త్వరగా అమలయ్యేలా చూడాలని సిఎం ఆదేశించారు.

పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవ రావు, పి.సుదర్శన్ రెడ్డి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సిఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సెలో వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత సన్న బియ్యం పంపిణీ, సన్నాలకు రూ 500 బోనస్ వంటి సంస్కరణలతో దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిందన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో భారత ఆహార సంస్థ,రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వంపైన నెట్టేసి మిల్లింగ్ అయిన బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేయడంతో కొనుగోలుకు మిల్లింగ్ కు మధ్యన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.5 వేల కోట్లు నష్ట పోతుందని వివరించారు. సైలో పద్ధతిని అమలులోకి తెస్తే రూ 5 వేల కోట్ల భారాన్ని అధిగమించడంతో పాటు రూ. 1,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పద్ధతిని అమలులోకి తీసుకువాలని యోచిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సైలో పద్దతిలో బియ్యం ,మొక్క జొన్న, సోయాబీన్ వంటి పంటలను కూడా నిల్వ చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. చేతికొచ్చిన పంట భద్రతకోసం ఆధునిక పరిజ్ఞానంతో నిలువ చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందిస్తున్నామని. తద్వారా రైతుకు భరోసా కల్పించడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించడం సులభమవుతుందని వివరించారు. యావత్ భారత దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలువడంతో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు పంపడంతో మిల్లింగ్‌లో జరుగుతున్న జాప్యంతో ధాన్యం చెడి పోయి నష్టం వాటిల్లుతుందని,మిల్లులలో శాస్త్రీయ పద్దతిలో నిల్వ చేసే అవకాశం లేక పోవడంతోటే ఈ నష్టం జరుగుతుందన్నాని వివరించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో పద్దతిలో ఉండే డ్రైయర్ల ద్వారా తేమను తొలగించడంతో పాటు దాన్యన్ని దీర్ఘకలికాంగ పరిరక్షించుకోవచ్చన్నారు. పాత బియ్యానికి మార్కెట్ లో అధిక ధర లభిస్తుందని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పుల ప్రభావం దేశ వ్యాప్తంగా చూపుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రికి ఆయన సమగ్ర నివేదికను సమర్పించారు. తెలంగాణలో రవాణా రంగాన్ని బలోపేతం చేసేందుకు మంత్రి ప్రభాకర్ ప్రధానంగా మూడు విజ్ఞప్తులను కేంద్రానికి సమర్పించారు. రాష్ట్రంలో అత్యాధునిక డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐడిటిఆర్) ఏర్పాటు, రవాణా మౌలిక వసతుల కోసం రూ.175 కోట్ల ఎస్ఎఎస్‌సి నిధుల మంజూరు, మోటార్ వాహనాల చట్టంలో ప్రతిపాదిత సవరణలపై చర్చ. ఈ అంశాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.

**భవిష్యత్ ప్రణాళికలు – విజన్ 2047**

రాష్ట్రంలో రోడ్ సేఫ్టీ క్లబ్‌లు, చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. విజన్ 2047 లో భాగంగా 5 లక్షల మంది నైపుణ్యం కలిగిన హెవీ వెహికల్ డ్రైవర్లను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ చుట్టూ ట్రక్ టెర్మినల్స్, అత్యాధునిక బస్ టెర్మినల్స్, పాస్‌పోర్ట్ ఆఫీసుల తరహాలో ఆధునిక ఆర్‌టిఓ కార్యాలయాలను నిర్మించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాల స్క్రాపింగ్ తప్పనిసరి చేస్తూ, పాత వాహనాల స్క్రాపింగ్‌పై పన్ను మినహాయింపులు ఇస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో 100 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే లక్ష్యం

కాలుష్యనివారణకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో దశలవారీగా కేవలం ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే తిరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మొదట ఆర్‌టిసి బస్సులను, ఆ తర్వాత టాక్సీలు, ఆటోలను ఈ విధానంలోకి మారుస్తారన్నారు. 2020లో రాష్ట్రంలో కేవలం 4,376 (0.03 శాతం) ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలు, 2024లో తెచ్చిన కొత్త ఈవీ పాలసీతో 2025 నాటికి 2,58,325 (1.42 శాతం) కి పెరిగాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇడి దాడులు (మొదటి పేజీ తరువాయి)

ఐప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ నివాసానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేరుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ టిఎంసికి సంబంధించిన అంతర్గత పత్రాలు, హార్డ్ డిస్కులు, ఎన్నికల వ్యూహానికి సంబంధించిన సున్నితమైన డేటాను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. తన ఐటి సెల్ ఇన్‌ఛార్జ్ అయిన జైన్ నివాసం, కార్యాలయాలపై జరిగిన ఈ దాడి రాజకీయ ప్రేరేపితం, రాజ్యాంగ విరుద్ధమన్నారు. టిఎంసి అధినేత్రి కూడా అయిన బెనర్జీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ అక్కడికి చేరుకున్న కొద్ది నిమిషాలకే మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో జైన్ నివాసానికి చేరుకున్నారు. ఆమె 20–25 నిమిషాల పాటు అక్కడే ఉండి, చేతిలో ఆకుపచ్చ ఫోల్డర్‌తో బయటకు వచ్చారు. ఇడి అధికారులు తమ ఐటి సెల్ ఇన్‌ఛార్జ్ నివాసం, కార్యాలయాలపై దాడి చేశారని, తమ పార్టీ పత్రాలు, హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకుంటున్నారు, వాటిలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పార్టీ అభ్యర్థుల వివరాలు ఉన్నాయని, తాను వాటిని తిరిగి తీసుకువచ్చానని మమతా బెనర్జీ విలేకరులతో చెప్పారు. అధికార పార్టీకి చెందిన హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, అభ్యర్థుల జాబితాలు, అంతర్గత వ్యూహాత్మక పత్రాలను ఇడి అధికారులు తీసుకువెళ్లారని ఆమె ఆరోపించారు. రాజకీయ పార్టీల డేటాను సేకరించడం ఇడి విధినా? అని ఆమె ప్రశ్నించారు. టిఎంసికి రాజకీయ సలహాలు ఇవ్వడంతో పాటు, ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) పార్టీ ఐటి, మీడియా కార్యకలాపాలను కూడా నిర్వహిస్తుంది. కాగా, నాయకత్వంపై తీవ్ర స్థాయిలో మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సోదాలను రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. ప్రతిపక్ష పార్టీలను బెదిరించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 'ఇది చట్టాన్ని అమలు చేయడం కాదు. దేశాన్ని రక్షించలేని, ఎన్నికలకు ముందు వేధించడానికి ఏజెన్సీలను పంపుతున్న ఈ అత్యంత నీచమైన, దుష్ట హోంమంత్రి ఇలాగేనా పనిచేసేది? అని ఆమె మండిపడ్డారు. సాల్ట్ లేక్‌లోని సెక్టార్ 5లో ఉన్న ఐప్యాక్ కార్యాలయంలో కూడా తెల్లవారుజాము నుండి ఇడి సోదాలు నిర్వహించింది. కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో ఉదయం 6 గంటల ప్రాంతంలో దాడులు ప్రారంభమయ్యాయని బెనర్జీ ఆరోపించారు. లోపల ఎవరూ లేనప్పుడు వారు సోదాలు ప్రారంభించారని, వారు మా డేటా, ఎన్నికల వ్యూహాలు, సమాచారాన్ని వారి సిస్టమ్‌లోకి బదిలీ చేశారని, ఇది ఒక నేరం అని, సెక్టార్ 5 కార్యాలయాన్ని సందర్శించిన తర్వాత ఆమె ఆరోపించారు. 'కార్యాలయం నుండి అన్ని పత్రాలను తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ పత్రాలను మళ్లీ తయారు చేయాలంటే చాలా సమయం పడుతుంది. అప్పటికి ఎన్నికలు కూడా ముగిసిపోతాయి. వారు ఇలా చేయడం న్యాయమేనా? అని ఆమె ప్రశ్నించారు. టిఎంసి ఒక రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ అని, క్రమం తప్పకుండా ఆదాయపు పన్ను చెల్లిస్తుందని బెనర్జీ అన్నారు. తమకు ఎన్నికైన ప్రతినిధులు ఉన్నారని, ఇడికి ఏదైనా అవసరమైతే, వారు ఆదాయపు పన్ను శాఖ నుండి వివరాలు తీసుకోవచ్చని సూచించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపినాయకులకు నోటీసులు ఎందుకు పంపడం లేదని టిఎంసి అధినేత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'బిజెపి అతిపెద్ద దొంగల పార్టీ. బెంగాల్‌లోని బిజెపి పార్టీ కార్యాలయాలపై దాడులు చేసి ఇడి సోదాలకు మేము ప్రతీకారం తీర్చుకుంటే ఏం జరుగుతుంది; మేము సంయమనం పాటిస్తున్నాము. కానీ, మా సంయమనాన్ని మా బలహీనతగా భావించకూడదు' అని ఆమె అన్నారు. తమ ఎన్నికల వ్యూహం, ఎస్ఐఆర్ డేటా, ఇతర వివరాలను తీసుకున్నారని, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోయి, తాము మళ్లీ కొత్తగా ఎన్నికల ప్రణాళికలు రూపొందించాల్సి వస్తే, దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పద్ధతి ప్రకారం బలహీనపరుస్తోందని బిజెపిపై ఆరోపించిన బెనర్జీ, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుండి పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా 15 లక్షల మందికి పైగా పేర్లను తొలగించారని, ఓటర్లను తొలగించి, రాజకీయ పార్టీల ఐటి సెల్ కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా రాష్ట్రాన్ని స్వాధీనం చేసుకోవచ్చని వారు భావిస్తున్నారా? అని ఆమె అన్నారు. బెంగాల్‌ను గెలవాలనుకుంటే, మాతో రాజకీయంగా పోరాడాలని బిజెపికి సవాల్ విసురుతున్నానన్నారు. జైన్ వచ్చి తిరిగి పని ప్రారంభించే వరకు తాను ఐప్యాక్ కార్యాలయంలోనే ఉంటానని కూడా ఆమె తెలిపారు.
ఇడి దాడులకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతి బ్లాక్‌లో నిరసనలు తెలియజేయాలని బెనర్జీ పార్టీ కార్యకర్తలను కోరారు. జైన్ తన కార్యాలయానికి వచ్చిన తర్వాత, ఆమె సాయంత్రం 4:14 గంటల ప్రాంతంలో ఐప్యాక్ కార్యాలయం నుండి బయలుదేరారు.

# త్యాగాల చరితకు వందేళ్లు

### ఖమ్మంలో ముగింపు ఉత్సవాలు
### ట్రంప్‌కు భయపడుతున్న మోదీ
### పోలవరం నిర్వాసితుల కోసం పోరాటం
### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ త్యాగాల చరితకు వందేళ్లు నిండాయని, ఆవిర్భాల నుంచి నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు కె.రామకృష్ణ తెలిపారు. భూమి భుక్తి ప్రజల కోసం పోరాడిందని తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది కార్యకర్తలు రక్తతర్పణం చేశారని ఆయన తెలిపారు. పోరాటాల పురిటిగడ్డ ఖమ్మంలో సిపిఐ శత వసంతాల ముగింపు వేడుకలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయని జనవరి 18న గొప్ప బహిరంగ సభ జరుగుతుందని 19న సిపిఐ జాతీయ కార్యవర్గం, 20న జాతీయ స్థాయి సెమినార్ జరుగుతుందని రామకృష్ణ తెలిపారు. గురువారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులు వామపక్షం ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జనవరి 20న జరిగే సెమినార్‌లో ప్రధాన వామపక్షాల కార్యదర్శులు ఎంఏ బేబీ, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య సహా ప్రధాన వామపక్షాల నేతలు పాల్గొంటారన్నారు. ట్రంప్ బెదిరింపులకు మోదీ భయపడుతున్నాడని ఆయన ఏమి చెప్పినా సరే ఆనడం తప్ప సమాధానం చెప్పలేని స్థితిలో మోదీ ఉండడంతో భారతదేశ విలువలు ప్రపంచ వ్యాప్తంగా పడిపోతున్నాయని రామకృష్ణ తెలిపారు. అలీన దేశంగా కీర్తిగడించిన భారత్ మోదీ నాయకత్వంలో ట్రంప్‌కు తలవంచే పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. వెనిజులా అధ్యక్షుడు మధురో ఆయన భార్యను బంధిస్తే కనీసం నోరు విప్పలేని స్థితిలో దేశ ప్రధాని ఉన్నారని భవిష్యత్తులో ట్రంప్‌తో భారతదేశం సైతం ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి వస్తుందని రామకృష్ణ హెచ్చరించారు. చర్చల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవచ్చునని రెండు ప్రభుత్వాలు కూర్చుని చర్చించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. వివాదాలకు పోవడం వల్ల రెండు రాష్ట్రాలు నష్టపోతాయని, ఇప్పటికే సముద్రంలో రెండువేల టిఎంసిలు కలుస్తున్నాయని బేషజాలకు పోకుండా పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా జల వివాదాలను పరిష్కరించుకోవాలని రెండు ప్రభుత్వాలు ఇందుకు పూనుకోవాలని రామకృష్ణ సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తానని చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పరిహారం ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. 72 శాతం ప్రాజెక్టు పూర్తయిందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని, కానీ పరిహారం చెల్లింపు మాత్రం 21 శాతం మాత్రమే జరిగిందని ఇలా ఎందుకు జరుగుతుందని రామకృష్ణ ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. పోలవరం ముంపు మండలాల్లో పర్యటించి త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.




**కార్పొరేట్ల కోసమే కగార్ :**
కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపదను కట్టబెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తీసుకువచ్చిందని రామకృష్ణ ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను కాల్చి చంపుతున్నారని ఈ క్రమంలోనే హిడ్మాను కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాల్చి చంపారని ఆయన తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మావోయిస్టుల కారణంగా రక్షించబడిన అటవీ సంపదను ఇప్పుడు కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్ల పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. బిజెపి నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడాల్సిన బాధ్యత వామపక్షాలతో పాటు అన్ని ప్రజాతంత్ర శక్తులపై ఉందని రామకృష్ణ తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, బిజి క్లెమెంట్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు ఇసి సన్నాహాలు పూర్తి

### వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా షెడ్యూల్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసి) సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా ప్రచురణకు సంబంధించి కీలక షెడ్యూల్‌ను ఎస్ఈసి ఖరారు చేసింది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 6 మున్సిపల్ కార్పొరేషన్లు (366 వార్డులు), 117 మున్సిపాలిటీలు (2,630 వార్డులు) పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలకు ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు ఎస్ఈసి ప్రకటించింది. ఈమేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి వివరాలను వెల్లడించారు.

**వేడెక్కుతున్న రాజకీయం..** మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో ఎన్నికల సంఘం సమావేశాలు నిర్వహించింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి వంటి ప్రధాన పార్టీలన్నీ ఈ ఎన్నికలను ప్రతిష్మాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో ప్రచారానికి దిగారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పరిధిలో బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 124 మున్సిపాలిటీలు, 9 గ్రేటర్ కార్పొరేషన్లు ఉండగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగియనుంది. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూర్, అచ్చంపేట, నకిరేకల్ మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు వచ్చే ఏడాది మే వరకు ఉంది. ఈ పది ప్రాంతాలను మినహాయిస్తే, మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈ ఏడాది జనవరిలోనే ముగియడంతో ప్రస్తుతం అక్కడ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. మొత్తం కలిపి 52.71 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా ఓటర్ల జాబితాను ఇప్పటికే ఎస్ఈసి విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తోంది.

**జనవరి 12, 2026 :** మున్సిపాలిటీ చట్టం–2019 (సెక్షన్ 195ఏ) ప్రకారం వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా ప్రచురణ.
**జనవరి 13, 2026 :** పోలింగ్ స్టేషన్‌ల వివరాల ముసాయిదా జాబితా విడుదల చేసి, టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్.
**జనవరి 16, 2026 :** ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ స్టేషన్‌ల వారీగా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు అధికారికంగా ప్రచురిస్తారు.

## సిపిఐ వంద సంవత్సరాల చరిత్ర మహోన్నతమైనది



సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా 'జనసేవాదళ్ భారీ కవాతు'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసమానత, దోపిడీ, మతతత్వం, కార్పొరేట్ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా 'జనసేవాదళ్ భారీ కవాతు' నిర్వహించనున్న నేపథ్యంలో హైదరాబాద్, నారాయణగూడలో 'సిపిఐ జనసేవా దళ్ శిక్షణ కార్యక్రమాన్ని' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని ఈ.టి.నరసింహ గురువారం ఆవిష్కరించి, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
అనంతరం ఈ.టి నరిసంహ మాట్లాడుతూ వలసవాద వ్యతిరేక ప్రతిఘటన, రాజీలేకుండా కార్మికులు, రైతుల చేపట్టిన పోరాటాల ద్వారా నిర్మించిన సిపిఐ వంద సంవత్సరాల చరిత్ర మహోన్నతమైనదని వివరించారు. శతాబ్ది అంటే కేవలం ఒక చరిత్ర గురించి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు, సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని మరింతగా పెంచుకునేందుకు, మతతత్వం, ఫాసిజం, అసమానత శక్తులను ప్రతిఘటించేందుకని ఆయన చెప్పారు. కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల గొంతుకగా ఎర్ర జెండా సమానత్వం, లౌకికవాదం, గౌరవం కోసం నిలుస్తుందన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం, ప్రజల జీవనోపాధి కోసం బలమైన పోరాటాలు కొనసాగిస్తూనే ఉండాలని సూచించారు.
సిపిఐ శతాబ్ది ముగింపు సందర్భంగా ఈనెల 18న ఖమ్మం నగరంలో లక్షలాదిమందితో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నరసింహ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నెర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, షంషుద్దీన్, హైదరాబాద్ జిల్లా సమితి శక్రి భాయ్, ఆరుట్ల రాజ్ కుమార్, జనసేవాదళ్ శిక్షకులు మేకల శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులా అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలి




### కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను అమెరికా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే వారిని విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.బాల్‌రాజ్(ఎఐటియుసి), పాలడుగు భాస్కర్(సిఐటియు), జె.వెంకటేష్, విజయ్‌కుమార్ యాదవ్(ఐఎన్‌టియుసి), అంజాద్(హెచ్ఎమ్‌జె), అనురాధ(ఐఎఫ్‌టియు), ప్రవీణ్(టియుసిఐ), శ్రీనివాస్(బిఆర్‌టియు) తదితరులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా తదితర అభియోగాలు మోపి, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అమెరికా సైన్యం వెనిజులా భూభాగంలోకి చొరబడి మదురోతో పాటు ఆయన భార్యను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెనిజులాలో ఉన్న చమురు నిక్షేపాలను దోచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విధమైన చర్యలు అవలంభించడం తగదని హెచ్చరించారు. కొలంబియా, వియత్నాం, క్యూబా, నికరగువ్వా, మెక్సికో దేశాలపై కూడా ఇలాగే దాడులు కొనసాగించిందని, ప్రపంచ దేశాలు అమెరికా సామ్రాజ్యవాద విదానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాని మోదీ మౌనం వీడి, వెనిజులాకు మద్దతు తెలిపాలని, మధ్యవర్తిత్వం వహించి వెంటనే మదురోతో పాటు ఆయన భార్యను విడుదల చేసేలా ప్రయత్నాలు జరపాలని సూచించారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!

## 1933–1943 పార్టీ చరిత్రలో మైలు రాళ్ళు

1925 డిసెంబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక మహాసభ కాన్పూర్‌లో జరిగి అఖిలభారత పార్టీ ఏర్పడినా బ్రిటీష్ వలసపాలన సాగుతున్న ఆ రోజుల్లో పార్టీ లీగల్, సెమీలీగల్ పరిస్థితుల్లో పనిచేయాల్సి వచ్చింది. అంటే పార్టీపై నిషేధం పూర్తిగా, పాక్షికంగా ఉండేది. నిరంతరం పోలీసు నిఘా కింద పనిచేయాల్సి వచ్చేది. అందువల్ల 1942 జులైలో సిపిఐపై నిషేధం ఎత్తివేసిన తదుపరిగాని 1943 మే–జూన్‌లో బొంబాయిలో పార్టీ తొలి కాంగ్రెస్ (జాతీయ మహాసభ) జరుపుకునే అవకాశం లభించలేదు. అయితే పార్టీ అనుభవాల నుండి నేర్చుకుంటూ తప్పులు దిద్దుకుంటూ 1940వ దశకంనాటికి బలపడింది. తగినంత పరిపక్వత సాధించింది. పార్టీ చరిత్రలో అది చారిత్రక కాలం కూడా. ఆ కాలాన్ని అతి సూక్ష్మంగా అవలోకించుదాం.

మీరట్ కుట్ర కేసు (1929–33)లో 31మంది అత్యంత ప్రముఖ, అనుభవజ్ఞులైన కమ్యూనిస్టు – కార్మిక నాయకులను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధించింది. నెహ్రూ, ఇతర జాతీయవాద నాయకులు వారి తరఫున వాదించారు. మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన డిఫెన్స్ కమిటీ ఏర్పడింది. బోనులో నుంచి బ్రిటీష్ పాలకులను బోనులో నిలబెడుతూ కమ్యూనిస్టు నాయకులు చేసిన వాదనలు దేశంలో కమ్యూనిస్టు భావాల వ్యాప్తికి, పార్టీ నిర్మాణానికి దోహదం చేశాయి. గాంధీజీ సైతం ఖైదీలను కలుసుకున్నారు. మీరు కోరినట్లు సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానాన్ని లాహోర్ కాంగ్రెస్ సభలో ఆమోదించబోతున్నామని గాంధీ చెప్పారు. మనమధ్య ఇంకా భేదాభిప్రాయాలేమున్నాయి? అని ప్రశ్నించారు. ''రానున్న ఉద్యమం క్రమంలో మరో చౌరాచౌరీ జరిగితే మీరేం చేస్తారు? ఉద్యమం ఉపసంహరిస్తారా? అని డాంగే ప్రశ్నించగా, గాంధీజీ ఒక నిమిషం ఆలోచించి, ''లేదు'' అని సమాధాన మిచ్చారు. ఈ కుట్ర కేసు ఖైదీల్లో అత్యధికులు 1933 చివరకు విడుదలైనారు. ఈలోపు, కమ్యూనిస్టు గ్రూపుల మధ్య సంబంధాలు లేక, గైడ్ చేసే పరిపక్వ నాయకత్వం లేక సిపిఐ నిర్మాణం, రాజకీయ రీత్యా భారీ నష్టాలకు గురైంది. అనేక గ్రూపులు ఏర్పడి తమ సొంత త్రోవలో పనిచేయసాగాయి. మీరట్ ఖైదీల విడుదల తదుపరి 1933 డిసెంబర్‌లో కలకత్తాలో చెల్లాచెదురైన పార్టీ గ్రూపుల చిన్న సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తాత్కాలిక కేంద్ర కమిటీ ఎన్నుకున్నారు. ఘాటే జైల్లో ఉన్నందున డా.అధికారిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కొద్ది నెలలకే ప్రభుత్వం అధికారిని అరెస్టు చేయటంతో, మిరాజ్‌కార్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన్ను సింగపూర్‌లో అరెస్టు చేయటంతో, సోమనాథ్ లాహిరి బొంబాయి వెళ్లి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు.



డా.అధికారి | మిరాజ్‌కార్ | సోమనాథ్‌లాహిరి | పి.సి.జోషి

సంవత్సరం లోపు ఆయన్నూ అరెస్టు చేశారు. 1935 డిసెంబర్ – 1936 జనవరిలో సూరత్‌లో జరిగిన సమావేశంలో పి.సి.జోషిని ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

సిపిఐ బహుముఖ అభివృద్ధి, శీఘ్రతర వృద్ధికి అది నూతన దశను ప్రారంభించింది. జాతీయోద్యమంతో, కాంగ్రెస్‌తో సంబంధాలు ఎంతో మెరుగైనాయి. పార్టీ ముఖ్యమైన జాతీయ శక్తిగా అవతరించింది.

* కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) ఏర్పాటులో, కార్యకలాపాల్లో సిపిఐ కీలక భూమిక పోషించింది. సిఎస్‌పి 1934లో పాట్నాలో జాతీయోద్యమ వేదికగా ఉన్న కాంగ్రెస్‌లోపల ఏర్పాటైంది. అది కమ్యూనిస్టులు, సోషలిస్టులు, అతివాద కాంగ్రెస్‌వాదులు, ఇతర జాతీయవాదుల ఐక్యవేదికగా పనిచేసింది.

* 1936 'మరీ ముఖ్యమైన సంవత్సరం. ఎఐకెఎస్ (అఖిలభారత కిసాన్ సభ), ఎఐఎస్ఎఫ్ (అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్), పిడబ్ల్యుఎ (అభ్యుదయ రచయితల సంఘం) ఆ సంవత్సరంలో ఏర్పడ్డాయి. ఈ సమష్టి ప్రజాసంఘాల ఏర్పాటులో జోషీ కీలకపాత్ర పోషించారు. అదే కాలంలో కళాకారులు, రచయితలు, రంగస్థల, సినిమా వర్కర్స్, కళాకారులు, సాహితీవేత్తలు, చరిత్రకారులు, శాస్త్రవేత్త లు, మహిళలను కమ్యూనిస్టు భావాలు ఆకర్షించాయి. బాల సంఘాలు సైతం ఏర్పడ్డాయి.

* 1936 జులైలో ఆల్ ఇండియా స్టేట్స్ (రాజసంస్థానాల) పీపుల్స్ కాన్ఫరెన్స్ లక్నోలో నిర్వహించబడింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పార్టీ అనే ప్రతిష్టను సిపిఐ సంతరించుకుంది. ఎస్.ఎ.డాంగే, ఆర్‌డి భరద్వాజ్, అజయ్‌ఘోష్,

ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎస్.జి. సర్దేశాయి, పి.సుందరయ్య, సి.రాజేశ్వరరావు, భవానీసేన్, కల్పనాదత్, సింగారవేలు, ఎస్‌విఘాటే, అమీర్ హైదర్ ఖాన్, సోమనాథ్‌లాహిరి, ఇంకా అనేక మంది జాతీయ రాజకీయ రంగంలో వెలుగులోకి వచ్చారు.

* సిపిఐ స్వతంత్ర వైఖరిని, నిర్మాణాన్ని నిలుపుకుంటూనే కాంగ్రెస్‌లో చేరి పనిచేయాలన్న నిర్ణయం మంచి ఫలితాలనిచ్చింది. అనేక పిసిసిల్లో, ఎఐసిసిలో కమ్యూనిస్టులు ముఖ్యమైన పదవుల్లోకి వచ్చారు. వివిధ రాజకీయ సైద్ధాంతిక, సంస్థాగత అంశాలపై పి.సి.జోషీ–గాంధీజీ మధ్య సంవత్సరంపాటు (1943–44) మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు గాంధీ–జోషీ కరస్పాండెన్స్ ఈ సందర్భంగా ప్రసిద్ధం. మార్క్సిజం–గాంధీయిజం మధ్యనున్న తీవ్రమైన భేదాభిప్రాయాలను, అలాగే ఏకీభావాంశాలను అది ప్రతిబింబించింది.

* సోహన్‌సింగ్ జోష్ ప్రచురిస్తున్న కీర్తి (1926) పత్రికలో పనిచేస్తుండగా భగత్‌సింగ్ శాస్త్రీయ సోషలిజం ప్రభావంలోకి వచ్చారు. ఆయన ఆ తర్వాత ఎస్.జి.సర్దేశాయి తదితర కమ్యూనిస్టు నాయకులను కలుసుకున్నారు. అజయ్‌ఘోష్ ఆయనకు అత్యంత సన్నిహితుడు. భగత్‌సింగ్ ఏర్పాటు చేసిన హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ (అసోసియేషన్ కూడా) పేరులో ఆయన ఒత్తిడిపైన 'సోషలిస్టు' అనే పదం చేర్చారు.

* 1933–34 నాటికి, విప్లవకారులు, స్వాతంత్ర్య యోధులు, కమ్యూనిస్టులు పెద్ద సంఖ్యలో అండమాన్స్‌లోని సెల్యులార్ జైలుకు పంపబడ్డారు. వారిలో అత్యధికులు జుగాంతర్, అనుశీలన్ గ్రూపులకు చెందినవారు, కమ్యూనిస్టులు. దాదాపు 400 మంది ఖైదీలతో 1935లో అండమాన్స్ జైల్లో 'కమ్యూనిస్టు కన్సాలిడేషన్ కమిటీ' ఏర్పడింది.

బటుకేశ్వర్ దత్, విజయ్‌కుమార్ సిన్హా, శివ వర్మ, ధన్వంతరి, విశ్వనాథ్ మాధుర్, గణేశ్ ఘోష్ తదితర ప్రసిద్ధులు ఆ కమిటీలో ఉన్నారు. అక్కడ ఖైదీలకు కమ్యూనిజంలో శిక్షణా తరగతులు జరిగాయి. 1937లో ప్రధాన భూభాగంలోకి విడుదలైన ఖైదీల్లో చాలామంది ఆ తర్వాత సిపిఐలో చేరారు.

* రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం మరో మలుపు. 1939 సెప్టెంబర్ 1న పోలెండ్‌పై జర్మనీ దాడితో అది ప్రారంభమైంది. హిట్లర్ ఫాసిస్టు శక్తులు 1941 జూన్ 22న తొలి సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్‌పై పెద్ద ఎత్తున దాడిచేశాయి. దాంతో యుద్ధ స్వభావం మారిందన్న అంచనాకు వచ్చిన సిపిఐ ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధానికి పిలుపు ఇచ్చింది.

బ్రిటీష్‌వారు రష్యా, అమెరికా, ఫ్రాన్స్‌లతో మిత్ర రాజ్యకూటమి భాగస్వామిగా ఫాసిస్టు శక్తులతో పోరాటంలో ఉన్నందున ఇక్కడ మనదేశంలో బ్రిటీష్ యుద్ధ కృషికి ఎటువంటి ఆటంకం కలిగించరాదనేది ఆ పంథా. అయితే ఇది ఆచరణలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం మనదేశ ప్రజలు పోరాడుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టుల నిజాయితీపై అపార్థాలకు దారితీసింది. ఆవిధంగా పార్టీపై మితవాదులు నిందా ప్రచారం చేశారు.

ఆ పంథా పార్టీకి నష్టం చేసింది. ముందు ఫాసిస్టు శక్తులను ఓడిద్దాం, ఆ తర్వాత బ్రిటీష్ వారిని ఓడిద్దామన్న పంథాను పార్టీ 1942–43లో స్టాలిన్‌గ్రాడ్ పోరాటంలో హిట్లర్ సైన్యాలను ఎర్రసైన్యం ఓడించాక మార్చుకుంది. 1934లో నిషేధించబడిన సిపిఐపై బ్రిటీష్ వలసపాలకులు 1942 జులైలో ఎత్తివేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం యూరప్‌లో 1945 మే 8న ముగిసింది. కాగా హిరోషిమా, నాగసాకీలపై ఆగస్టు 6,9 తేదీల్లో అమెరికా అణుబాంబులు వేశాక– సెప్టెంబర్ 2న జపాన్ లొంగుబాటు ఒడంబడికపై సంతకం చేయటంతో ఆ యుద్ధం ముగిసినట్లైంది.

ఈలోపు మనదేశంలో 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమం సాగింది. కాంగ్రెస్ నాయకులందరినీ ప్రభుత్వం జైళ్ళలో పెట్టినా, సిపిఐ నాయకురాలు అరుణా అసఫాలీ ఆగస్టు 9న బొంబాయి ఆజాద్ మైదాన్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. అయినా కాంగ్రెస్‌లోని మితవాదులు సిపిఐపై దుష్ప్రచారం కొనసాగించారు.

* ఇదిలా వుండగా, సిపిఐ బహిరంగంగా పనిచేస్తున్న పరిస్థితుల్లో 1943 మే 23 నుంచి జూన్ 1వరకు తన తొలి కాంగ్రెస్‌ను కోలాహలంగా–ఒక సాంస్కృతికోత్సవంలాగా బొంబాయిలో జరుపు కుంది. ఈ సందర్భంగానే, మే నెలలో బొంబాయిలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా – ప్రజానాట్యమండలి) ఏర్పడింది. పార్టీని క్యాడర్ పార్టీ నుంచి మాస్ పార్టీగా అభివృద్ధి చేయాలని ఈ కాంగ్రెస్ తొలిసారి పిలుపునిచ్చింది.

పార్టీ కాంగ్రెస్ 22మందితో సెంట్రల్ కమిటీని, ముగ్గురితో (పిసి జోష్, డాక్టర్ అధికారి, బిటి రణదివె) పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. ప్రధాన కార్యదర్శిగా పి.సి.జోషిని ఎన్నుకుంది.

*1943–1948 మధ్యకాలంలో చరిత్రాత్మకమైన కయ్యూరు. తెలంగాణ, పున్నప్ప–వాయిలార్, తేభాగ పోరాటాలు చేబట్టి అనన్య త్యాగాలు చేసింది. వాటి గూర్చి రేపు తెలుసుకుందాం.*

— ఎమ్మెస్సార్

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రోజోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్–63
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ స్పేస్ No.eMZ-37, eMZ-38 and eMZ-39 of 2025-26
టెండర్ నోటీస్ No.33/25-26 (పేపర్ నోటిఫికేషన్)
ఇ-టెండర్ కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. ఓవర్‌లోడ్ యొక్క విభజన a) జనరల్ కేటగిరీ eMZ-37/25-26 కింద బంజారాహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ సర్కిల్ లోని 33/ KV కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 KV స్టేట్ హోమ్ ఫీడర్. b) eMZ-38/25-26 జనరల్ కేటగిరీ కింద 33/ KV అత్తాపూర్ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 KV హుడా కాలనీ ఫీడర్ మరియు c) హైదరాబాద్ సౌత్ సర్కిల్ చార్మినార్ డివిజన్‌లోని ఎస్‌టి రిజర్వ్ కేటగిరీ కింద eMZ 39/25-26 కింద 33/11 KV పేట్ల బురుజు SS నుండి వెలువడే 11/ KV హుస్సేనీఆలం ఫీడర్ T&D కింద అసలు పనులకు మెరుగుదలలు. దీనికి సంబంధించి ఏదైనా మరింత సమాచారం కోసం www.tender.telangan.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లను చూడగలరు.
సం/- చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 13301-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం
అమరచింత మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా, (టిఎస్)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
''ఇ'' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద 1 పని కొరకు టెండర్‌ను ఆహ్వానించడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.01.2026న ఉ.10:30గం.ల నుండి, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేది: 19.01.2026న సా.4:30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్స్ ఆహ్వానించే కార్యాలయం: కమిషనర్, అమరచింత మున్సిపాలిటీ, తెలంగాణ స్టేట్. ఫోన్: 9346048760, 7330690290.
సం/- కమిషనర్, అమరచింత మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 13316-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం
కీసరగుట్ట, కీసర (గ్రామం & మండలం), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
ఆర్.సి.నెం. 60/SLRSD/2025, తేదీ: 08.01.2026
మహాశివరాత్రి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కీసర (గ్రామం & మండలం), కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ క్రింది పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడమైనది. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 09.01.2026, బిడ్ డౌన్‌లోడ్ చివరి తేదీ (సమర్పణ): 23.01.2026.

| పని పేరు | అంచనా మొత్తం (లక్షలలో) |
|---|---|
| (05) రోజుల కాలానికి కొండ కింద తాత్కాలిక విద్యుత్ దీపాల ఏర్పాటు | 9.90 |
| (05) రోజుల కాలానికి కొండ పైన తాత్కాలిక విద్యుత్ దీపాల ఏర్పాటు | 9.90 |
| (05) రోజుల కాలానికి తాత్కాలిక పందిళ్ల (చలువ పందిళ్ల) ఏర్పాటు | 9.90 |

సం/- కార్యనిర్వహణాధికారి
సెల్ నెం: 9491000699
DIPR R.O. No. : 13332-PP/CL/ADVT/1/2025-26, Date: 08-01-2026



## పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి పట్టణంలో ఎంతో పురాతన ప్రసిద్ధి చెందిన పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చెయ్యడం జరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ పచ్చలకట్ట సోమేశ్వర ఆలయం రోడ్డు విస్తరణ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభిచారు. సోమేశ్వరాలయం ప్రధాన అర్చకులు కప్పగంతుల నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి.అవేస్ చిస్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తంగళ్ళపల్లి రవి కుమార్, కుక్కదువ్వ సోమయ్య, కూర వెంకటేష్ పాల్గొన్నారు.

## బహిరంగ సభను జయప్రదం చేద్దాం

### భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన



**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెరువు)** : ఈనెల 18న లక్షలాది మందితో ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన కోరారు. ఈ బహిరంగ సభను పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాలలో జిల్లా, మండల కేంద్రాలలో ప్రచారంలో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సిపిఐ నాయకుడు సోమగాని మల్లయ్య ఇంటి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమాన పనికోసం, సమాన వేతనం కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినటువంటి మహిళా నాయకురాళ్ళ వారి యొక్క సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ముగ్గులపోటీలలో పాల్గొన్న వారికి మేళ్లచెరువు గ్రామ సర్పంచ్ బచ్చు పద్మ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొంగరెడ్డి భద్రారెడ్డి, చీరాల ఎలమంద, సోమగాని మల్లయ్య, ఆడ శ్రీను, గంగారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు సిపిఐ పోరాటం



**ప్రజాపక్షం/చిట్యాల:** జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు జిల్లా సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో గురువారం రోజున బహిరంగ సభ గోడ పత్రికను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందు ఆవిర్భవించి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. గత 100 సంవత్సరాలుగా పేద ప్రజల అభ్యున్నతి కోసం, కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం చేసిన పార్టీ అని అన్నారు. ప్రపంచంలోని 40 దేశాల ప్రతినిధులు హాజరయ్యే బహిరంగ సభలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ శాఖ అధ్యక్షులు షేక్ షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ ఎస్‌పి రమేష్ హెచ్చరించారు.జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ, లేబర్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇటుకబట్టీల యాజమాన్యాలు, నిర్వహులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ ఇటుకబట్టీలలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు చదువు, ఆరోగ్యం, భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని పిల్లలను పనిలో పెట్టకుండా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.బాలకార్మికులను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందిన పక్షంలో పోలీస్ శాఖ,లేబర్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సంబంధిత యాజమాన్యాలపై చైల్డ్ లేబర్ యాక్ట్, జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ కృష్ణయ్య, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణ, వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారి హరిత, మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అరుంధతి, ఏ.హెచ్.టి.యూ ఎస్ఐ రంగారెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గణేష్,ఇటుకబట్టీల యాజమాన్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన 12, 50,000 రూపాయల విలువగ ల చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విద్యతో పాటు క్రీడలపై దృష్టి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ** : మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉండేందుకు విద్యతోపాటు,క్రీడలు ముఖ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.గురువారం ఆయనచర్లపల్లి వద్ద ఉన్న విపస్య పాఠశాలలో నిర్వహించనున్న 2రోజుల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మనిషి చురుకుగా ఉండడానికి క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. కొన్ని పాఠశాలలు అధిక జీపీఏలు సాధించాలన్న లక్ష్యంతో విద్య పైన దృష్టి సారిస్తున్నాయని, క్రీడల పట్ల కూడా దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో భాగంగా ఒక్కొక్కటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని,వచ్చే సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభం అవుతాయని మంత్రి తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటవుతున్నందున భవిష్యత్‌లో నల్లగొండను స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేస్తామని,ఆర్ అండ్‌బి ద్వారా 200 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని,రూ.700 కోట్లలతో పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తున్నామని,నల్లగొండను హైదరాబాద్ కు మోడల్ గా చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు మంత్రి తెలిపారు .ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 12 కోట్ల రూపాయలతో పట్టణంలోని బొట్టుగూడ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం జరిగిందని, త్వరలోనే ఈ పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో క్రీడలు చాలా అవసరమని, శారీరకంగా, మానసికంగా ఉండేందుకు క్రీడలు తోడ్పడతాయని అన్నారు. ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ , డిటిసి వాణి, పాఠశాల యాజమాన్యం, తదితరులు ఉన్నారు.

### సురక్షిత ప్రయాణమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/చిట్యాల:** జాతీయ రహదారిపై ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని, దానికి కావల్సిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎస్‌పి శరత్ చంద్రలతో కలిసి గురువారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పండుగకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే వారే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళే వారి కోసం పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకునేలా ప్రణాళికలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్న పలు ప్రదేశాలను ఆయన పరిశీలించి జిల్లా కలెక్టర్, ఎస్‌పికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నక్షా సర్వేకు ప్రజలు సహకరించాలి

### మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నక్షా అనేది భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మిర్యాలగూడ మున్సిపాలిటీలో చేపడుతున్న ఒక ఫ్లాగ్‌షిప్ పథకం అని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లోని భూములు, ఆస్తులపై భౌగోళిక సమాచార ఆధారిత కడాస్ట్రల్ సర్వే నిర్వహించి, వ్యవసాయ భూముల తరహాలోనే పట్టణ భూములకు కూడా హక్కుల రికార్డు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా పది మున్సిపాలిటీల్లో అమలు చేయడానికి ఎంపిక చేశారని, వాటిలో మిర్యాలగూడ మున్సిపాలిటి కూడా ఒకటన్నారు. ప్రాజెక్టు కింద మిర్యాలగూడ మున్సిపాలిటి పరిధిలోని అన్ని ఆస్తులపై వివరణాత్మక పట్టణ సర్వే నిర్వహించి కడాస్ట్రల్ రీసర్వే చేపడ్తారన్నారు. ఇందుకోసం సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ఫిబ్రవరి నెలలో విమాన సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణానికి సంబందించి 2డి ఆర్థో రెక్టిఫైడ్ చిత్రాలు, 3డి భౌగోళిక డేటా రూపొందించబడుతుందన్నారు. అనంతరం సర్వే డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు జీఎన్ఎస్ఈడీ రోవర్లు, డేటా సేకరణ టాబ్లెట్ల సహాయంతో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. పట్టణ ప్రజలు ఇంటికి సంబంధించిన వివరాలు తెలపాలన్నారు. కేంద్ర ప్రభు త్వం నిర్వహిస్తున్న నక్షాకి పట్టణ ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. సర్వేలో మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అధికారులు వస్తారన్నారు.

## జగన్ సాక్షిగా కెసిఆర్ 'నీళ్ల దొంగతనం' బహిర్గతం

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి** : రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. జగన్ మాటలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన నీళ్ల దోపిడీ, కేసీఆర్ జగన్ మధ్య సాగిన చీకటి ఒప్పందాలు బయటపడ్డాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు రాయలసీమ వెళ్లి జగన్ పెట్టిన రొయ్యల పులుసు విందులో పాల్గొన్న కేసీఆర్, ఆ సాన్నిహిత్యంతో తెలంగాణ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన మండిపడ్డారు. తాను సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ సహకారంతోనే కృష్ణా జలాలను అక్రమంగా తరలించానని జగన్ స్వయంగా అంగీకరించడం కేసీఆర్ చేసిన ద్రోహానికి నిదర్శనమని చామల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలకు జగన్ మాటలే సమాధానమని ఎంపీ స్పష్టం చేశారు. కృష్ణా నదీ జలాల విషయంలో, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో రేవంత్ రెడ్డిని కార్నర్ చేయాలని చూసిన బీఆర్ఎస్ కుట్రలు నేడు భగ్నమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రం కంటే ఎక్కువగా తెలంగాణ నీళ్లను బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ దోచుకుందని జగన్ బాహాటంగా చెప్పడం చూస్తుంటే, కేసీఆర్ ఆశీర్వాదంతోనే తెలంగాణ రైతులను జగన్ మోసం చేశారనేది స్పష్టమవుతోందని అన్నారు. నాడు జగన్ కోసం దక్షిణ తెలంగాణ రైతులను ఎండబెట్టిన కేసీఆర్ పాపం నేడు బహిర్గతమైందని చామల విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్ల విషయంలో గట్టిగా పట్టుబట్టడం వల్లే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు వెనకడుగు వేయాల్సి వచ్చిందని జగన్ స్వయంగా క్లారిటీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ నీళ్ల వాటాల విషయంలో ఏమాత్రం రాజీ పడబోమని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి గర్జించిన మాటలను జగన్ ఇప్పుడు అంగీకరించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన కొనియాడారు. కేసీఆర్, జగన్ లాలూచీ పడి చేసిన అక్రమ నీళ్ల తరలింపుపై తెలంగాణ సమాజం ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.



## రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్

**ప్రజాపక్షం/నల్లగొండ** : రైతుల ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఏ. సురేంద్రమోహన్ అన్నారు .గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి వ్యవసాయ , హార్టికల్చర్, మార్కెటింగ్ .సహకార శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.రైతులకు అదనపు ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.2047 విజన్ డాక్యుమెంటరీ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి, ఆదాయం పెంచదానికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ రంగంలో సాగు విస్తీర్ణం, పంటల దిగుబడి, నాణ్యమైన విత్తనాల సరఫరా, ఎరువులుపురుగుమందుల లభ్యతపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలను సమయానుకూలంగా అందించాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులదేనని అన్నారు.ఉద్యాన పంటల విస్తరణ, నర్సరీల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి పద్ధతుల అమలు, పంట అనంతర నిర్వహణపై ఉద్యాన శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రభుత్వం స్థలం ఉంటే ప్రతి 50 కిలోమీటర్ల కు ఒక ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు ఆదాయం పెరిగే విధంగా అవకాశం కల్పించాలని, అప్పుడే నల్లగొండ హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చెందుతుందన్నారు.జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు తో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో యూరియ ఇతర అన్ని పథకాలపై అధికారులతో సమీక్షించి రైతులకు పూర్తి స్థాయిలో అందేలా పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,డిసిఓ పత్య నాయక్ ,జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, హార్టికల్చర్ అధికారి సుభాషిని హాజరయ్యారు.

## భవిష్యత్ గురించి కలలు కనండి.. సాకారం చేసుకోండి

### సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి లక్ష్మిశారద



**ప్రజాపక్షం/సూర్యాపేట** : విద్యార్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకునేందుకు కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద అన్నారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలోని కోర్టు భవనం నుండి సంతోష్‌బాబు చౌరస్తా మీదుగా పిఎస్‌ఆర్ సెంటర్ నుండి పోస్టు ఆఫీస్ మీదుగా జూనియర్ కళాశాల వరకు డ్రగ్ ఫ్రీ ఇండియా అవగాహన ర్యాలీలో జిల్లా ఎస్‌పి కె నరసింహ, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌లతో కలిసి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మి శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి చాప కింద నీరులా వ్యాపించి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తుందని వాటిని సమాజం నుండి నిర్మూలించేందుకు జిల్లాలోని పరిపాలన, పోలీస్, న్యాయ శాఖలు కృషి చేస్తున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా భారతదేశంలో డ్రగ్స్‌ను దూరం చేయుటకు డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు, కుటుంబాలు ఆగమవుతున్నాయని డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు సమాజంలో కలహాలు సృష్టించి అభివృద్ధి చెందకుండా చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ యువత భారతదేశ గొప్ప వనరులని, బావి భారత పౌరులని సమాజం నుండి గంజాయి, డ్రగ్స్ తొలగించేందుకు విద్యార్థులే ప్రచారకర్తలుగా, అంబాసిడర్‌గా మారాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం జిల్లా ఎస్‌పి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీకి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సూర్యాపేట పట్టణ వీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమత, బార్ అసోసియేషన్ చైర్మన్ లింగయ్య, సెక్రటరీ రాజు, ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

**ప్రజాపక్షం/హాలియా:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దానికి అనుమానంగా కష్టపడి చదవాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి అన్నారు. గురువారం హాలియాలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో స్టోర్ రూములను, వంట గదులను, భోజనము తయారు చేసే విధానాన్ని పరిశీలించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను బాలికలు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంట మండల విద్యాధికారి ముచ్చర్ల శ్రీను, కేజీబీవీ ఎస్ ఓ హైమావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత తదితరులు ఉన్నారు.

## బిటి రోడ్డుకు నిధులు మంజూరుకు కృతజ్ఞతగా పాలాభిషేకం

**ప్రజాపక్షం/నల్లగొండ (శాలిగౌరారం):** శాలిగౌరారం మండలం భైరవునిబండ నుండి నక్కలపల్లి గ్రామం వరకు 7 కిలోమీటర్లు బిటి రోడ్డుకు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బి శాఖ సినిమా ఆటోగ్రఫీ శాఖ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,పంచాయతీరాజ్ ,గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ దనసరి సీతక్క, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ రోడ్డు వలన భైరవునిబండ, నక్కలపల్లి గ్రామాలతో పాటు ఈ రెండు గ్రామాల కింద ఉన్న మూడుకు గ్రామాలకు నూతనంగా బీటీ రోడ్డు ఏర్పడుతుంది. అలాగే మనం భైరవుని బండ నుండి నార్కట్‌పల్లి హైదరాబాదుకు పోవుటకు 15 కిలోమీటర్ల దూరం తగ్గి ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని సర్పంచ్ ఎన్. యాదయ్య సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి. రేణుక అశోక్ రెడ్డి,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పడాల శంకరయ్య, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు ఉన్నారు.



## ప్రతి అక్షరం ప్రజలపక్షమే : ఎమ్మెల్యే వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రతి అక్షరం ప్రజల పక్షాన రాస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.గురువారం పట్టణంలోని తననివాసంలో ప్రజాపక్షం దినపత్రిక ముద్రించిన నూతన సంవత్సర 2026క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ ప్రజాసమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న పత్రికగా ప్రజాపక్షం ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలాప్రజాపక్షం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుఫన్నాల రాఘవరెడ్డి, ప్రజాపక్షం నకిరేకల్ రిపోర్టర్ గడగోజు రవీంద్రాచారి,వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ చైర్మన్ మోపూరి చంద్రమౌళి,కార్పెంటర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గడగోజు విశ్వజ్ఞాచారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై 'ప్రజాపక్షం' కథనాలు 'భేష్'

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా సమస్యలపై ప్రజాపక్షం కథనాలు అద్భుతమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదొద్దిన్, ప్రముఖ వైద్యుడు జాడి రాజులు అన్నారు. ప్రజాపక్షం ముద్రించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రజలు, ప్రభుత్వానికి పత్రికలు వారధిగా ఉండి ప్రజాభిమానాన్ని చూరగొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం డివిజన్ ఇన్‌చార్జి పుప్పాల యాదగిరి, మిర్యాలగూడ, వేములపల్లి మండలాల పార్టీ కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ, మధ్యాహ్న భక్షజన సంఘం జిల్లా కార్యదర్శి బంటు రాజేశ్వరి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షమీం, బుచ్చయ్యలు పాల్గొన్నారు.



మధ్యంతర భరణం మంజూరు దశలో...

# భార్య సంపాదన పరిగణించలేము

డిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ :** మధ్యంతర భరణం మంజూరు దశలో భార్య సంపాదిస్తున్నట్లు లేదా తనను తాను పోషించుకునే సామర్థ్యం కలిగి ఉందని భావించలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ కోర్టు నెల వారీ మధ్యంతర నిర్వహణ రూ.2,500 మంజూరు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ వ్యాఖ్యలు చేశారు. పిటిషనర్ భర్త తన భార్య నర్సరీ టీచర్‌గా పనిచేస్తున్నదని , కాబట్టి ఆమె సంపాదిస్తున్నదని పేర్కొన్నప్పటికీ ఆయన త ఆమె సంపాదనకు సంబంధించిన ఎలాంటి డాక్యుమెంటరీ రుజువును రికార్డులో ఉంచలేదు. ఆ మహిళ కేవలం 11వ తరగతి వరకు మాత్రమే చదువుకుందని గుర్తించిన ధర్మాసనం అతని వాదనను తోసిపుచ్చింది. ఎలాంటి రుజువు చూపకుండా భర్త చేసిన 'బట్టతల వాదన' ఈ దశలో సహాయపడదని ధర్మాసనం తెలియజేసింది. 'దీనిప్రకారం మధ్యంతర భరణం మంజూరు కోసం పిటిషనర్‌భార్య సంపాదిస్తున్నట్లు లేదా తనను తాను పోషించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు భావించలేమని ఈ కోర్టు అభిప్రాయపడింది' అని జనవరి 5న వెలువరించిన తీర్పులో కోర్టు పేర్కొంది. తన భార్య పనిచేస్తున్నదని, సంపాదిస్తున్నదని కేవలం 'బట్టతల ప్రకటన' వెల్లడించడం ప్రాథమికంగా ఈ వాదనకు ఎలాంటి ఆధారాలు కూడా లేకుండా ఈ దశలో ప్రతివాదిభర్తకు ఏవిధంగానూ సహాయపడదని జోడించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 125 (భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల నిర్వహణ కోసం ఆర్డర్) కింద ఆ మహిళ చేసిన విజ్ఞప్తిపై ఫ్యామిలీ కోర్టు 2024 మార్చిలో ఆమెకు మధ్యంతర భరణంగా రూ.2,500 మంజూరు చేసింది.2021 జూన్‌లో ఈ జంట ముస్లిం ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే కట్నం కోసం తన ఇంటిలో తనను దారుణంగా హింసించారని భార్య ఆరోపించింది. 2022లో తనను వివాహ గృహంలోనుంచి బయటకు పంపించివేశారని ఆమె ఫిర్యాదు చేశారు. మధ్యంతర నిర్వహణ ఖర్చులను పెంచాలని కోరుతూ తన భర్త గ్రాడ్యుయేట్ అని, ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడని నెలకు సుమారు రూ.25,000 సంపాదిస్తున్నాడని బాధితురాలు వాదించారు. అంతేకాకుండా ఆయన ప్రైవేట్ ట్యూషన్లు చెబుతూ నెలకు రూ.15,000 అదనంగా సంపాదిస్తున్నాడని, దానికి తోడు కిరాణం దుకాణం నడుపుతున్నాడని, నెలకు దాదాపు రూ.33,000 రెంటల్ ఆదాయం పొందుతున్నాడని ఆరోపించింది. పిటిషనర్ మాట్లాడుతూ తనకు నెలకు రూ.2,500 అతితక్కువ మొత్తం అని, ఏమాత్రం సరిపోదని చెప్పారు. భర్త తాను ఒక ఎన్‌జిఒలో టీచర్/ స్పెషల్ ఎడ్యుకేటర్‌గా నెలకు రూ.10,000 శాలరీకి పనిచేస్తున్నానని మధ్యంతర భరణంగా నెలకు రూ.2,500 మొత్తాన్ని సమర్థించుకున్నాడు. అయితే భర్త గ్రాడ్యుయేట్ అని ఒప్పుకున్నప్పటికీ, క్లెయిమ్ చేసిన ఆదాయం నైపుణ్యం కలిగిన వ్యక్తికి చెల్లించాల్సిన కనీస వేతనం కంటే తక్కువగా ఉన్నదని కోర్టు గమనించింది. భర్త తన పూర్తి ఖాతా స్టేట్‌మెంట్‌లను దాఖలు చేయలేదని, ఒక పరిమిత కాలానికి మాత్రమే స్టేట్‌మెంట్‌లను సమర్పించాడని, ఆ కాలానికి నెలకు రూ.10,000 జీతం రశీదును హైలెట్ చేసే నిర్దిష్ట లావాదేవీలు లేవని కూడా అది పేర్కొంది. అందువల్ల భర్త ఆదాయాన్ని రూ.13,200 కనీస వేతనాల ప్రాతిపదికన అంచనా వేయాలని, తదనుగుణంగా మధ్యంతర భరణాన్ని పెంచాలని కోర్టు పేర్కొంది. ప్రతివాది (భర్త) ఉత్తర్ ప్రదేశ్‌లో నివసిస్తున్నారని, అక్కడ పనిచేస్తున్నారని, అంగీకరించబడిన స్థానం, సంబంధిత సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్రాడ్యుయేట్ / నైపుణ్యం కలిగిన కార్మికుడికి వర్తించే కనీస వేతనాలు నెలకు రూ. 13,200 అని కోర్టు పేర్కొంటూ భార్యకు ఇచ్చే తాత్కాలిక నిర్వహణను నెలకు రూ.3,500కు పెంచింది. మూడు నెలల వ్యవధిలో భార్యకు భరణం బకాయిలను చెల్లించాలని కోర్టు బాధితురాలి భర్తను ఆదేశించింది.

## వీధుల నుంచి ప్రతి కుక్కనూ తరలించాలని ఆదేశించలేదు: 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** వీధుల్లో ఉండే ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, జంతువుల జనన నియంత్రణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. కుక్కలు తమకు భయపడేవారిని లేదా గతంలో కుక్కకాటుకు గురైన వారిని వాసన చూసి వారిపై దాడి చేస్తాయని వీధికుక్కల కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. సున్నితమైన ప్రదేశాల్లో భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన సుప్రీం కోర్టు, ఆసుపత్రి వార్డుల్లో, రోగుల చుట్టూ కుక్కలు సంచరించడానికి అనుమతించాలా అని ప్రశ్నించింది. శునకాలను వీధుల నుంచి తరలించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వీధుల నుంచి ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని మాత్రమే ఆదేశించినట్లు జస్టిస్ మెహతా పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కుక్కకాటు వల్ల ముఖ్యంగా చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నట్లు మీడియా కథనాలు వెలువడటంతో గతేడాది జులై 28న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చేయాలని గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. జాతీయ రహదారులపై తిరుగుతున్న పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని గుర్తుచేసింది. కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యమని తేల్చి చెప్పింది. అంతకుముందు బుధవారం వీధి కుక్కల కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండటంపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీం, కేవలం శునకాలపై ఆలోచిస్తుంటే ఇతర జంతువుల సంగతేంటని ప్రశ్నించింది. కరిచేందుకు సిద్ధమైన కుక్కల ప్రవర్తనను ముందుగా ఎవరూ అంచనా వేయలేరని పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో చికిత్స కంటే నివారణే ముఖ్యమని స్పష్టంచేసింది.

8 ఏండ్ల తర్వాత తన మొదటి లైన్ ఫిట్ డ్రీమ్‌లైనర్...

## 787-9 ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎయిర్ ఇండియా డెలివరీ



**న్యూఢిల్లీ:**టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా ఫస్ట్ లైన్ ఫిట్ బోయింగ్ 7879 ఎయిర్‌క్రాఫ్ట్‌ను డెలివరీ తీసుకుంది. ఇది 8 సంవత్సరాలకు పైగా ఎయిర్‌లైన్ ఫ్లీట్‌లో చేరిన మొదటి డ్రీమ్‌లైనర్ కూడా. జనవరి 7న సియాటిల్ లోని బోయింగ్ ఎవరెట్ ఫ్యాక్టరీలో డ్రీమ్‌లైనర్ టైటిల్ బదిలీని ఎయిర్ ఇండియా పూర్తి చేసిందని గురువారం నాడు ఒక అధికారి తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) తనిఖీల తర్వాత 2022 జనవరిలో ప్రైవేటీకరణ తర్వాత ఎయిర్ ఇండియా తీసుకునే డ్రీమ్‌లైనర్‌కు సంబంధించిన మొదటి లైన్ విమానం కూడా రానున్న కొద్ది రోజుల్లో భారతదేశానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. కొత్త విమానంలో మూడు క్లాస్‌లు ఉన్నాయి. ఎకానమీ, ప్రీమియర్ ఎకానమీ, బిజినెస్ క్లాస్ సీట్స్ ఆ మూడు క్లాస్‌లుగా ఉన్నాయి. 2017 అక్టోబరులో ఆ క్యారియర్ ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నప్పుడు ఎయిర్ ఇండియా చివరిగా లాస్ట్ లైన్ ఫిట్ డ్రీమ్‌లైనర్‌ను కొనుగోలు చేసింది. సాధారణంగా లైన్ ఫిట్ అనేది ఒక నిర్దిష్ట విమానయాన సంస్థ కోసం ప్రత్యేకంగా తయారు చేయబడిన విమానాన్ని సూచిస్తుంది. ఒక అధికారి వెల్లడించిన ప్రకారం తాజా విమానం ఎయిర్‌లైన్ వైడ్‌బాడీ, 2023లో ఆర్డర్ చేసిన220 బోయింగ్ జెట్‌ల నుండి 52వ డెలివరీ. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే 51వ నారోబాడీ బోయింగ్ 7378s విమానాలను డెలివరీ చేసింది. వీటిలో గడిచిన డిసెంబర్ చివరలో ప్రవేశపెట్టబడిన మొదటి లైన్ ఫిట్ విమానం కూడా ఉంది. జనవరి 2022లో టాటాస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎయిర్ ఇండియా 350 ఎయిర్ బస్, 220 బోయింగ్ విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ఎయిర్ బస్ ఇచ్చిన 6 ఎ350ల ఆర్డర్‌లో ఇప్పటికే ఎయిర్ ఇండియా విమానంలో చేర్చబడ్డాయి. ఇదిలా ఉంటే ఎయిర్ ఇండియా వద్ద ఇప్పటికే 26 బి 787లు, 6బి 7879లు ఉన్నాయి. వీటిని ఎయిర్ లైన్‌లో విలీనం చేశారు. కాగా ప్రస్తుతం ఎయిర్ ఇండియా గ్రూప్ 300కు పైగా విమానాలను కలిగి ఉంది. వీటిలో 18విమానాలు ఎయిర్ ఇండియాతో మిగిలినవి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో ఉన్నాయి.

## 'సర్' విచారణ నోటీసు... 60 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్య



**కోల్‌కతా:** ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' కారణంగా పలువురు అధికాలతో పాటు జాబితాలో తన పేరు ఉంటుందో లేదా అన్న అనుమానంతో పలువురు మనస్తాపానికి గురై మత్యువాత పడుతున్నారు. కొందరు ఆత్మహత్య చేసుకుంటుండగా, మరి కొందరు గుండెపోటుకు గురవుతున్నారు. తాజాగా ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో గురువారం అరవై ఏళ్ల వయసున్న వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. 'సర్' విచారణకు సంబంధించిన నోటీసు అందిన తర్వాత అతను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని అతని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడిని రాయ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్‌పారా ప్రాంతానికి చెందిన 64 ఏళ్ల బబ్లూ పాల్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఈ రోజు తెల్లవారుజామున పాల్ తన ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందిన వెంటనే, అధికారులు అతని నివాసానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం పరీక్ష కోసం మృతదేహాన్ని రాయ్‌గంజ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు పంపించాం. దర్యాప్తు ప్రారంభించామని' అని పోలీసు అధికారి తెలిపారు. 'సర్' రెండవ దశకు సంబంధించిన విచారణ కోసం నోటీసు అందిన తర్వాత పాల్ మానసిక ఒత్తిడికి గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఓటర్ల జాబితా నుండి తన పేరు తొలగించబడుతుందేమోనని, తనను అక్రమ వలసదారుడిగా ప్రకటిస్తారేమోనని మృతుడు భయపడ్డాడని వారు పేర్కొన్నారు. గదిలో సూసైడ్ నోట్ లభించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే పోలీసులు అందులోని విషయాలను అధికారికంగా ధృవీకరించలేదు. వృత్తిరీత్యా స్క్రాప్ డీలర్ అయిన పాల్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అతని కుమార్తె ఫిబ్రవరి 2 నుండి ప్రారంభమయ్యే తన మాధ్యమిక్ (10వ తరగతి) పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ కళ్యాణి పాల్ నివాసానికి వెళ్లి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటనపై ఆయన ఎన్నికల సంఘాన్ని నిందించారు. సర్ ప్రక్రియ చుట్టూ ఉన్న భయం నివాసితులలో తీవ్ర ఆందోళనకు దారితీసిందని ఆయన ఆరోపించారు. పోస్ట్‌మార్టం నివేదిక అందిన తర్వాతే మరణానికి కచ్చితమైన కారణం నిర్ధారించబడుతుందని రాయ్‌గంజ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సోనోవానే కుల్దీప్ సురేష్ అన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చే వరకు మరణానికి గల కారణాన్ని నిశ్చయంగా చెప్పడం సాధ్యం కాదని ఎస్పీ అన్నారు.

## 2023లో 49 లక్షల మందికి టైఫాయిడ్

ఓ అధ్యయనం వెల్లడి




**న్యూఢిల్లీ:** దేశంలో 2023 సంవత్సరంలో సుమారు 49 లక్షల టైఫాయిడ్ జ్వ రం కేసులు నమోదు అయినట్లు ఓ నివేదికలో వెల్లడైంది. దీంట్లో 7850 మరణి ంచినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో టైఫాయిడ్ జ్వరం కే సులు అధికంగా ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సుమారు 30 శాతం కేసులు నమోదు అయినట్లు నివేదిక ద్వారా తెలిసింది. ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఏషియాలో ఆ రిపోర్టును ప్రచురించారు. ది లాన్సెట్ రీజినల్ హెల్త్ ఆగ్నేయాసియా లో ప్రచురించబడిన పరిశోధనల ప్రకారం, దేశవ్యాప్తంగా 7.3 లక్షల ఆసుపత్రి లో చేరిన వారిలో ఆరు లక్షల మంది ఫ్లోరోక్వినోలోన్–నిరోధకత ఒక రకమైన యాంటీబయాటిక్ లేదా యాంటీమైక్రోబయల్, నిరోధకత కారణంగా ఉన్నారు. టైఫాయిడ్ జ్వరం అనేది బాక్టీరియల్ ఇన్ఫెక్షన్. ఇది కలుషితమైన ఆహారం. నీటి ద్వారా వ్యాపిస్తుంది. లక్షణాలు బహిర్గతం అయిన ఒకటి నుండి మూడు వా రాల తర్వాత ప్రారంభమవుతాయి. అధిక జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి, అలసట ఉంటాయి. చికిత్సలో యాంటీబయాటిక్స్, సహాయక సంరక్షణ ఉంటుంది. భారతదేశంలోని వెల్లూరులోని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్, క్రిస్టియన్ మెడికల్ కాలేజీ పరిశోధకులు సహా, పది అత్యధిక భారం ఉన్న రాష్ట్రాలలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా ఫ్లోరోక్వినోలోన్–నిరోధక కేసులు, మరణాల రేటులో అత్యధికంగా ఉన్నాయని కనుగొన్నారు. '2023లో భారతదేశంలో 4.9 మిలియన్ టైఫాయిడ్ కేసులు, 7,850 మరణాలు సంభవించాయని రచయితలు అంచనా వేశారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక కలిసి జా తీయ భారంలో 29 శాతం వాటా కలిగి ఉన్నాయి. టైఫాయిడ్ జ్వరం సంభవం, మరణాలు, యాంటీబయాటిక్ నిరోధకతపై డేటాను కలిగి ఉన్న జూలై 2025 వరకు ప్రచురించబడిన అధ్యయనాలను పరిశోధకులు సమీక్షించారు.

## గ్రేటర్ నోయిడాలో తాగునీరు కలుషితం

పలువురికి అస్వస్థత




**నోయిడా:** ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కలుషిత నీరు తాగి పలువురు మృతి చెందగా అనేకమంది అనారోగ్యానికి గురైన ఘటన మరవకముందే గ్రేటర్ నోయిడాలోనూ ఇదే ఘటన చోటు చేసుకుంది. గ్రేటర్ నోయిడా డెల్టా 1 సెక్టార్‌లోని అనేక మంది నివాసితులు కలుషితమైన తాగునీటి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తగా, సరఫరా లైన్‌లో మురుగునీరు కలిసినట్లు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు, నివాసితులు తెలిపారు. మంగళ, బుధవారం సెక్టార్‌లోని కొన్ని ప్రాంతాల్లో కుళాయి నీటిని తాగిన తర్వాత వాంతులు, జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని బాధిత నివాసితులు నివేదించారు. అయితే, గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (గ్నిడా) అధికారులు తాగునీటి సరఫరాలో మురుగునీరు కలపడాన్ని ఖండించారు. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో నీరు శుభ్రంగా ఉందని తేలిందని పేర్కొన్నారు. స్థానిక నివాసితుల సంక్షేమ సంఘం (ఆర్‌డబ్ల్యుఎ) మాజీ అధ్యక్షుడు, నివాసి రిషిపాల్ భాటి పిటిఐతో మాట్లాడుతూ, ముఖ్యంగా సి బ్లాక్‌లో పైపులైన్లలో మురుగునీరు పొంగి ప్రవహించడం, లీకేజీ ఈ సమస్యకు దారితీసిందని చెప్పారు. కలుషితమైన నీటిని తాగడంతో ఆరు నుండి ఏడు కుటుంబాలు వాంతులు, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యారన్నారు. ఇతర బ్లాక్‌ల నుండి కూడా ఇలాంటి ఫిర్యాదులు గతంలోనే వచ్చాయని చెప్పారు. బుధవారం ఫిర్యాదులను అధికార యంత్రాంగం వెంటనే గమనించిందని, జలవనరుల శాఖ బృందం ప్రభావిత ఇళ్లను సందర్శించి నీటి నమూనాలను పరీక్షించిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీటి వినియోగం వల్ల అనేక మరణాలు సంభవించాయి.

బెంగాల్ వలస కార్మికుల కోసం

## ఆన్‌లైన్‌లో 'సర్' విచారణ

ఎన్నికల సంఘం వెల్లడి




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ వెలుపల పనిచేస్తున్న లేదా చదువుతున్న నివాసితులు ఇకపై ఓటర్ల జాబితా 'సర్' కింద విచారణలకు హాజరు కావాల్సిన అవసరం లేదని, త్వరలో ప్రారంభించబడే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పత్రాలను సమర్పించడానికి అనుమతిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. 'వారు స్వయంగా విచారణకు హాజరు కాలేకపోతే, వారి తరపున కుటుంబ సభ్యుడు వెళ్ళవచ్చు. ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలను కమిషన్ అంగీకరిస్తుంది' అని అధికారి పిటిఐకి తెలిపారు. రాష్ట్రం వెలుపల నివసిస్తున్న వలస కార్మికులు, విద్యార్థులు, నిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకే ఈ నిర్ణయమని వెసి వెల్లడిచింది. కాగా, కొంతమంది బూత్‌స్థాయి అధికారుల (బిఎల్‌ఒలు) ప్రవర్తనపై ఎన్నికల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక సందర్భాల్లో, వారు అధికారిక సూచనలను విస్మరించి స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించింది. బిఎల్‌ఒలు ఉద్దేశపూర్వకంగా చేసే ఏవైనా తప్పులు జరిగితే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల (ఇఆర్‌లు)పై బాధ్యతను బదిలీ చేయకుండా, ప్రత్యక్ష చట్టపరమైన చర్యలకు దారితీస్తాయని కమిషన్ హెచ్చరించింది. వారి రికార్డులలో వ్యత్యాసాల కారణంగా బుధవారం 9.4 మిలియన్ల మందికి ఇసి నోటీసులు జారీ చేయడం ప్రారంభించడంతో ఈ ప్రకటన చేసింది. పరిమిత కాలపరిమితిలో దాదాపు 10 మిలియన్ల విచారణలను నిర్వహించడం సాధ్యమేనా అనే దానిపై ఆ శాఖలోని అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

సిపిఐ(ఎం) నాయకుడి హత్య కేసులో...

ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కార్యకర్తల

## ఏడుగురి జీవిత ఖైదు

థలస్సేరి కోర్టు తీర్పు

**కన్నూర్ (కేరళ) :** 2008లో స్థానిక సిపిఐ(ఎం) నాయకుడి హత్య కేసుతో సంబంధం ఉన్న ఏడుగురు ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి కార్యకర్తలకు గురువారం థలస్సేరీ కోర్టు జీవిత ఖైదు విధించింది. సుమిత్ అలియాస్ కుట్టన్, కె.కె.ప్రజేష్ బాబు, బి.నిధిన్, కె.సనల్, స్మిజోష్, సంజీష్, వి.జయేష్‌లను అదనపు జిల్లా, సెషన్స్ కోరు జడ్జి విమల్.జె దోషులుగా నిర్ధారించారు. ఈ హత్యకేసులో కోర్టు సంతోష్‌కుమార్, బి.సరత్, ఇ.కె.సనీష్, కునుంప్రథ్ అజేష్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. కాగా 8వ నిందితుడిగా ఉన్న కె.అజిత్ విచారణ సమయంలో మరణించారు. నిందితులు, వారి న్యాయవాది, ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత కోర్టు మధ్యాహ్నం సమయంలో ఏడుగురు దోషులకు జీవిత ఖైదు విధించింది. 2008 డిసెంబర్ 31న థలస్సేరి సమీపంలోని తలాయి సమీపంలో జరిగిన సిపిఐ(ఎం) స్థానిక నాయకుడు లథీష్ హత్యకు సంబంధించిన కేసు ఇది. రాజకీయ వైరంలో భాగంగా జరిగిన ఈ దాడిలో లథీష్ స్నేహితుడు కూడా గాయపడ్డాడుకాగా నిందితులపై భారత శిక్షా స్మృతి (ఐపిసి)లోని అల్లర్లు, తప్పుడు నిర్బంధం, క్రిమినల్ బెదిరింపు, కుట్ర, హత్య, హత్యాయత్నానికి సంబంధించిన బహుళ సెక్షన్లు, అలాగే పేలుడు పదార్థాల చట్టం లోని 3, 5 కింద అభియోగాలు మోపబడ్డాయి. ఈ హత్య కేసుకు సంబంధించిన విచారణ 2020 జనవరి 7న పారంభమైంది. 30మంది ప్రాసిక్యూషన్ సాక్షులు, 90 డాక్యుమెంట్లు, 27 భౌతిక వస్తువులు పరిశీలించబడ్డాయి.

## 'అంబర్‌నాథ్'లో పొత్తుపై బిజెపి ద్వంద్వ వైఖరి

తమ కౌన్సిలర్లను సస్పెండ్ చేస్తే...
వారిని పార్టీలో చేర్చుకుందని
కాంగ్రెస్ ఫైర్



**ముంబయి :** మహారాష్ట్రలోని అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్‌లో బిజెపితో పొత్తు పెట్టుకున్నందుకు తమ కౌన్సిలర్లను సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ గురువారం తెలిపింది. అయితే ఈ పొత్తును ప్రారంభించిన తమ సొంత నాయకులపై చర్య తీసుకోవడంలో కాషాయ పార్టీ విఫలమై, ద్వంద్వ విధానాలను ప్రదర్శించిందని మండిపడింది. డిసెంబర్ 20న జరిగిన స్థానిక ఎన్నికల తర్వాత, బిజెపి తన బద్ధ శత్రువైన కాంగ్రెస్‌తో 'అంబర్‌నాథ్ వికాస్ అఘాడి' (ఎవిఎ) బ్యానర్‌పై చేతులు కలిపి, (థానే జిల్లాలోని) అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్ నాయకత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన మిత్రపక్షం శివసేనను పక్కన పెట్టింది. ఈ అఘాడీలో అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) కూడా ఉంది. ఈ ఇబ్బందికరమైన ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందికి గురైన కాంగ్రెస్, బుధవారం తన 12 మంది కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లను బ్లాక్ అధ్యక్షుడితో పాటు సస్పెండ్ చేసింది. సస్పెండ్ అయిన 12 మంది కౌన్సిలర్లు బుధవారం అర్ధరాత్రి బిజెపిలో చేరారని మహారాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రవీంద్ర చవాన్ తెలిపారు. 'కాంగ్రెస్ రహిత భారతదేశం' గురించి పదేపదే మాట్లాడే బిజెపి, ఎవిఎ ఏర్పాటుకు ప్రతిపాదన స్వయంగా కాషాయ పార్టీ నుంచే వచ్చిందని వెల్లడైనప్పటికీ, తమ కౌన్సిలర్లపై చర్య తీసుకోకుండా తన కపటత్వం, ద్వంద్వ ప్రమాణాలను బయటపెట్టిందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ అన్నారు. అకోలా జిల్లాలోని అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎంతో బిజెపి చేతులు కలపడంపై, స్వాతంత్ర్యానికి పూర్వం హిందూ మహాసభ అనేక ప్రాంతాలలో ముస్లిం లీగ్‌తో అధికారాన్ని పంచుకున్న కాలాన్ని సావంత్ ప్రస్తావించారు. 'ఇది మరోసారి తీవ్రవాద శక్తుల ఎజెండాలు ఒకదానికొకటి పూరకంగా ఉంటాయని రుజువు చేస్తుంది' అని ఆయన ఆరోపించా రు. బిజెపి, ఎఐఎంఐఎం తెరవెనుక కలిసి పనిచేస్తున్నాయని కాంగ్రెస్ చాలా కాలంగా చెబుతోందని, ఇప్పుడు వారి రాజకీయ సాన్నిహిత్యం బహిరంగమైందని సావంత్ అన్నారు. అధికారం కో సం బిజెపి సూత్రాలు, నైతికత, సిద్ధాంతాలపై రా జీ పడటానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ, ధ్రువీకరణ ఎలా ఉద్దేశపూర్వకంగా సృష్టించబడుతుం దో ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని ఆయన అన్నారు. అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో ఎఐఎంఐఎంతో పొత్తు పెట్టుకున్నందుకు అకోట్ ఎమ్మెల్యే ప్రకాష్ భర్సఖాలేకు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రవీంద్ర చవాన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలన్నీ కలవాల్సిందే

మరో ప్రత్యామ్నాయం లేదు : ఉద్ధవ్ థాక్రే



**ముంబయి :** కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవ్వాల్సిన అవసరం ఉందని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు. దీనికి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు.'ఇండియా' కూటమి ఉనికిలో ఉందా అనే దానిపై పిటిఐ అడిగిన ప్రశ్నకు థాక్రే సమాధానమిస్తూ, 'కొంచెం పరిశోధించి, ఇండియా కూటమి ఉందో లేదో తనిఖీ చేయండి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాహుల్ జీ (గాంధీ) నివాసంలో ఒక్కసారి మాత్రమే కలిశామన్నది నిజం' అని అన్నారు. శివసేన (యుబిటి)తో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ ఏకపక్షంగా ప్రకటించిందని, అయితే దానితో ఉన్నవారితో మాత్రం పొత్తు వద్దని చెప్పిందని ఆయన అన్నారు. అది వారి నిర్ణయం అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అన్నారు. '(శరద్) పవార్ సాహెబ్ (ఎన్‌సిపిఎస్‌పి) మాతో ఉన్నారు (బిఎంసి ఎన్నికలలో). కాంగ్రెస్ మాతో లేదు. జాతీయ స్థాయిలో అందరూ కలిసి ఉండాలని మేము కోరుకుంటున్నాము. మేము, ఇతర ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ కలిసి ఉండాలి. (కలిసి రావడానికి) ప్రయత్నం జరగాలి. దీనికి మరో ప్రత్యామ్నాయం నాకు కనిపించడం లేదు' అని థాక్రే నొక్కి చెప్పారు. మహారాష్ట్రలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, శివసేన (యుబిటి) మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్)తో పొత్తు పెట్టుకున్నందున, జనవరి 15న జరిగిన బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. అయితే, ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు కాంగ్రెస్‌ను కూడా పెద్ద కూటమిలో భాగం చేయాలని శివసేన (యుబిటి) ఆసక్తి చూపింది. భవిష్యత్తులో ఎంఎన్‌ఎస్ ఇండియా కూటమిలో భాగమవుతుందా అని అడిగినప్పుడు, థాక్రే కాంగ్రెస్‌ను పరోక్షంగా విమర్శిస్తూ, 'ప్రస్తుతం, శివసేన (యుబిటి), ఎంఎన్‌ఎస్ కలిసి వచ్చాయి. ఇంకా ఎవరైనా రావాలనుకుంటే మాతో చేరవచ్చు. అది వారి ఇష్టం. వారు మాతో రావాలనుకుంటున్నారా అని మేము వారిని అడగబోము' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమిని ఎదుర్కోవడానికి అనేక ప్రతిపక్ష పార్టీలు కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)ను ఏర్పాటు చేశాయి.

## మణిపూర్‌లో సాయుధ గ్రూపుల మధ్య కాల్పులు

**ఇంఫాల్:** మణిపూర్‌లోని కాంగ్పోక్పి జిల్లాలో గురువారం ఉదయం రెండు సాయుధ గ్రూపుల మధ్య కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. ఖారం వైఫేలో జరుగుతున్న అక్రమ గసగసాల సాగును ధ్వంసం చేయడానికి వెళ్లిన నిషేధిత జెలియాంగ్రాంగ్ యునైటెడ్ ఫ్రంట్ (ఎస్ కామ్సన్)కు చెందిన అనుమానిత కార్యకర్తలు, సాయుధ కుకీ భూగర్భ గ్రూపులతో కాల్పులకు దిగారని వారు చెప్పారు.ఈ కాల్పుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు, కాల్పులు ఆగిపోయాయని కూడా పేర్కొన్నారు. అదనపు భద్రతా బలగాలను పరిసర ప్రాంతాలకు పంపించారు. కాంగ్పోక్పి జిల్లాతో సరిహద్దులను పంచుకునే, 2023, 2024 సంవత్సరాలలో కుకీ, మెయిటీ గ్రూపుల మధ్య పెద్ద ఎత్తున కాల్పుల ఘటనలు జరిగిన ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని సరిహద్దు గ్రామాలలో కాల్పుల శబ్దం ఉద్రిక్తత, భయాందోళనలను సృష్టించింది. ఇదిలా ఉండగా, జెడ్‌యుఎఫ్ ఎస్ కామ్సన్ ఒక ప్రకటనలో, ఖారం వైఫేలో ఉదయం 7.40 గంటల ప్రాంతంలో సాయుధ కుకీ గ్రూపులతో కాల్పులు జరిగాయని, అక్కడ అక్రమ గసగసాల సాగు, కుకీ సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ గ్రూపుల భూగర్భ శిబిరాల ఏర్పాటుతో సహా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు నివేదికలు ఉన్నాయని పేర్కొంది. మే 2023 నుండి మణిపూర్‌లో జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించారు. మెయిటీ సమాజానికి షెడ్యూల్ తెగ (ఎస్‌టి) హోదా కల్పించాలనే డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర'కుకీ వర్గాల మధ్య హింస ప్రారంభమైంది.

# తెలంగాణ ప్రాజెక్టులకు మోకాలడ్డు!

తెలంగాణ నీటి ప్రాజెక్టులను ముందుకుసాగనీయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి ఆటంకాలు సృష్టిస్తున్నది. రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే, తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన నిర్లక్ష్యం ఇటీవల శాసనసభ సాక్షిగా 'పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం'పై జరిగిన చర్చ సందర్భంగా కళ్ళకు కట్టినట్లు స్పష్టమైంది. అదే అదనుగా తెలంగాణ వాటాను సైతం కబళించేలా శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ నుంచి నీటిని తరలించుకుపోయేలా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా చేపట్టింది. దాదాపు 90 శాతానికి పైగా పనులను పూర్తి చేసినట్లు సమాచారం. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ జోక్యంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా, పోలవరం నుంచి గోదావరి జలాలను సైతం మళ్ళించుకొని పోయేందుకు బనకచర్ల లింక్‌ను తలపెట్టింది. తెలంగాణ నుంచే అభ్యంతరాలే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రూటు మార్చి నల్లమల సాగర్ పేరుతో ఆ ప్రక్రియను కొనసాగించే ఎత్తుగడకు నాంది పలికింది. అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు చోట్ల నీటిని నికర,మిగులు, వరద జలాల పేర్లతో శరవేగంగా తీసుకెళ్ళే ఎత్తులువేస్తోం ది.

> తెలంగాణ ప్రాజెక్టులకు తాము అడ్డం కాదంటూ చెబుతున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరు 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించి'నట్లుగా ఉంది. ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అందిస్తున్న ఆక్సిజన్‌తో కొనసాగుతున్న కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అన్ని విధాలుగా ఎపికే అండగా నిలబడుతున్నదనేది కప్పిపుచ్చలేని వాస్తవం.

నిజానికి ఉభయ నదులు తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్నప్పటికీ, నీటిని ఒడిసిపట్టుకునే పెద్ద జలాశయాల నిర్మాణాన్ని ఉమ్మడి పాలకులు చేపట్టలేదు. ఇటు వైపు ఏవో సాకులతో ఆలస్యం చేస్తూ, తమ వైపు అనుమతులు లేకున్నా శరవేగంగా నీటిని భారీగా నింపుకునే రిజర్వాయర్లను వారు నిర్మించుకున్నారు. అత్యంత వెనుకబడిన రాయలసీమకు నీళ్ళు తరలించడం సబబే. అక్కడ 350 టిఎంసిలకు పైగా నీటిని నింపుకునే జలాశయాలు ఉన్నాయి. అదే సమయంలో, తలాపునే కృష్ణా నది జాలువారే నల్లగొండ జిల్లాలో ఫ్లోరిన్ భూతంతో తరాలు సతమతమైనప్పటికీ ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఇప్పటికీ పూర్తవలేదు. క్షామపీడిత పాలమూరులోని కల్వకుర్తి, నెట్టెంపాటు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలది అదే గతి. ఉమ్మడి పాలకులతో సమానంగా, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్ళైనా కృష్ణా నది ప్రాజెక్టులను పూర్తి చేయడంలో స్వరాష్ట్ర పాలకుల వైఫల్యం ప్రజల పాలిట శాపంగా మారింది. అన్నిటికి ఒకే మందు జిందా తిల్‌స్మాత్ అని ప్రచారం చేసుకొని, రూ.లక్ష కోట్లకుపైగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ పగుళ్ళుబారి పడావుపడి ఉంది. దాని దిగువన అన్నారం, సుందిళ్ళలది దాదాపు అదే పరిస్థితి. గతం నుంచి ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టే గోదావరి జలాలు కిందకు తీసుకెళ్ళేందుకు పెద్ద దిక్కుగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొన్ని రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు కొంత ఉపకరించినప్పటికీ, నల్లగొండ, పాలమూరు ప్రాజెక్టుల నిర్లక్ష్యం క్షమించరాని నేరమే.

కృష్ణా నది ప్రాజక్టులను దుమ్ము దులిపి, తిరిగి చేపట్టేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం నీటి కేటాయింపులు ఉన్న కల్వకుర్తి, కోయిల్ సాగర్, ఎస్ఎల్‌బిసి సహా 16 ప్రాజెక్టుల డిపిఆర్‌లను సిద్ధం చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో జిఒ నంబర్ 34ను జారీ చేసింది. ఆ ప్రాజెక్టులు కూడా అక్రమమైనవే నంటూ ఎపి ప్రభుత్వం అభ్యంతరపెడుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. తెలంగాణ ప్రాజెక్టులకు తాము అడ్డం కాదంటూ చెబుతున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరు నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది. ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అందిస్తున్న ఆక్సిజన్‌తో కొనసాగుతున్న కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అన్ని విధాలుగా ఎపికే అండగా నిలబడుతున్నదనేది కప్పిపుచ్చలేని వాస్తవం. ఇందుకు కృష్ణా జలాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు రెండవ విడత టెలిమెట్రీల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించడంతో వాటి ఏర్పాటు సాధ్యపడదని కృష్ణా నదీ జలాల నిర్వహణ బోర్డు తాజాగా నిరాకరించడమే ప్రత్యక్ష నిదర్శనం. ఎపి ప్రభుత్వం నిరాకరించినప్పటికీ, టెలీమెట్రీల ఏర్పాటుకు ఆ రాష్ట్రం వాటాను కూడా భరిస్తామని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే రూ.4.18 కోట్లు బోర్డుకు దఖలు చేసింది. ఇప్పుడు ఎపి ఒత్తిడితోనే కేంద్ర జలశక్తి ఆదేశాలతో కెఆర్‌డబ్ల్యుఎంబి మనసు మార్చుకున్నదనేది వాస్తవం. అక్రమంగా నీటిని తరలించకపోతే, నీటి విడుదలను కొలిచే టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఎందుకు అభ్యంతరం చెబుతుంది? చివరకు తెలంగాణ టెలిమెట్రీల ఏర్పాటుకు ఇచ్చిన నిధులను కూడా తిరిగి చెల్లించకుండా బోర్డు నిర్వహణ ఖర్చుల కోసం అట్టిపెట్టుకోవడం అత్యంత దారుణం.

కృష్ణా జలాలపై ప్రాజెక్టుల నిర్మాణాన్ని కొనసాగనీయకుండా, నీటి తరలింపు కొలత మీటర్లను ఏర్పాటు చేయనీయకుండా తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ మోకాలడ్డుతోంది. తాము మాత్రం కేంద్రం అండతో తమ ప్రాజెక్టుల విషయంలో ముందుకు సాగుతూనే ఉంది. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య సద్దుమణిగిన ఉద్రిక్తతలను తిరగదోడటానికి దారితీస్తుంది. కాకుండా, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వాస్తవిక, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో నీటి వినియోగ అంశాన్ని పరిష్కరించుకోవడం సబబు. ఆంధ్ర–తెలంగాణ మధ్య నదీజలాల పంపిణీని కేంద్రం సత్వరం తేల్చి ఇందుకు దోహదం చేయాలి. లేదంటే, ఇరు రాష్ట్రాల మధ్యే కాకుండా, ఎగువ రాష్ట్రాల మధ్య కూడా ఎడతెగని కయ్యాలు తప్పవు.

## కేంద్రం స్పందన బలహీనమైనది



వెనిజులాలో అమెరికా చర్యకు బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రతిస్పందన 'బలహీనమైనది, విధేయమైనది' గా ఉంది. ప్రపంచం అసాధారణమైన, ప్రమాదకరమైన పరిణామాలను చూస్తోంది. అమెరికా వెనిజులా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడం, ఆ దేశ అధిపతిని బందీగా తీసుకుంది. ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి, ఆర్థిక ఆంక్షల ద్వారా వెనిజులా ప్రజలను ఊపిరి ఆడకుండా చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. వెనిజులాలో జరిగినది రేపు ఏ దేశానికైనా జరగవచ్చు. పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గామ్‌పై దాడి చేసినప్పుడు, భారతదేశం ప్రపంచ మద్దతును కోరింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సంఘీభావాన్ని నిర్మించడానికి విదేశాలకు ప్రత్యేక ప్రతినిధులను పంపింది. భారతదేశం అప్పట్లో కోరిన అదే అంతర్జాతీయ మద్దతు నేడు వెనిజులా ప్రజలకు అర్హమైనది.

\- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్,



# సావిత్రిబాయి పూలే తోపాటు ఫాతిమా షేక్

మనదేశంలో ఆడపిల్ల చరిత్ర, వర్తమానం, భవిష్యత్ ను అక్షరాలతో వెలిగించిన జ్ఞానజ్యోతి సావిత్రిబాయి పూలే. ఆ జ్ఞానజ్యోతికి తోడైన మరో మహిళ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ 19వ శతాబ్దంలో మహారాష్ట్రలో మహిళల విద్యావ్యాప్తికి కృషి చేసిన తొలి మహిళా గురువులు. సావిత్రిబాయి భారతీయ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచింది. ఆమె విద్యా ఉద్యమంలో పాల్గొని ఆ కుటుంబానికి తోడుగా నిలిచిన దేశ తొలి ముస్లిం మహిళా టీచర్ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలేతో కలిసి దళిత, ముస్లిం, బాలికల విద్యావ్యాప్తికి కృషి చేసింది. ఫాతిమా షేక్ 1831 జనవరి 9న పుణెలో జన్మించారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలైనది. ఫాతిమా షేక్ ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో విద్యనభ్యసించింది. సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ అహ్మద్ నగర్‌లోని సింథియా ఫర్రార్ అమెరికన్ మిషనరీలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఫాతిమా సోదరుడు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే పూలే దంపతులు 1848లో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. ఆ దంపతులు స్థాపించిన పాఠశాలల్లో ఫాతిమా షేక్ విద్య బోధించింది. భవిష్యత్ తరాల కోసం అవమానాలను, దాడులను సైతం భరించారు.

ఫాతిమా షేక్ సహకారం లేకుండా పూలే దంపతుల స్త్రీ, దళిత విద్యా ఉద్యమం పరిపూర్ణం కాదు. ముస్లిం మహిళగా కుల, మత భేదాలు వీడి సమానత్వ ఆలోచనలకు అండగా నిలబడి, భారతీయ స్త్రీవాదానికి పునాది వేశారు. సావిత్రిబాయి పూలే స్త్రీలను చైతన్యపరచడానికి 1852 లో 'మహిళా సేవ మండల్' సంఘాన్ని స్థాపించింది. లింగ వివక్షతకు, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది.

కుల వ్యవస్థలో సామాజిక అణిచివేతను, మూఢత్వాన్ని పారద్రోలి 'సత్యాన్ని' శోధించడానికి 1873 లో భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించినది. ఈ సంస్థ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. బాల్యం లో వైధవ్యాన్ని అనుభవించే ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్ళు పోశారు. సత్యశోధక్ సమాజ్ లోని 'మహిళా విభాగం' సావిత్రిబాయి నేతృత్వంలో పురోహితులు లేకుండానే వివాహాలను నిర్వహించారు. కరువు బారిన పడి అనాథలైన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ రావు అనే అనాథ బాలుణ్ణి దత్తపుత్రుడిగా పెంచుకున్నారు. పూలే దంపతులు, ఫాతిమా షేక్ నుంచి అంబేద్కర్ వరకు బిసిలకు, దళితులకు, ముస్లింలకు చక్కటి అనుబంధం ఉండేదని స్పష్టమవుతుంది. నేడు ఆ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో బిసిల రిజర్వేషన్స్ కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో '42 శాతం రిజర్వేషన్ సాధన సమితి' పేరుతో ఉమ్మడి ఉద్యమం జరుగుతుంది.

**(మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి జనవరి 9)**

**సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతున్న కేంద్రం విధానాలు!



**ఉజ్జిని రత్నాకర్ రావు**
9490952646

కేంద్ర ప్రభుత్వం క్రమంగా ప్రాయోజిత పథకాల్లో తన వాటా నిధులను ఒక్కొక్క స్కీమ్ నుంచి మెల్లగా తగ్గించుకుంటున్నది. 2026 నూతన సంవత్సరమునుండి ఆ మేరకు రాష్ట్రాలపై పెను భారాలు మోపేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రాలకు అండగా నిలవాల్సిన కేంద్రం ప్రాయోజిత పథకాల్లో తన వాటా నిధులను భారీగా కోతలు పెట్టడం, నిబంధనల పేరుతో మొత్తం పథకాలను పక్కన పెట్టడం లాంటి చర్యలకు పూనుకుంటున్నది. గతంలో కొన్ని పథకాలకు ఉదారంగా నిధులు విడుదల చేసిన కేంద్రం ఇప్పుడు ప్రతి రూపాయికి లెక్కలు అడుగుతూ కఠిన నిబంధనలతో రాష్ట్రాల చేతులు కట్టేస్తున్నది. ఫలితంగా ఆయా పథకాల నిర్వహణ భారం అంతా రాష్ట్ర ప్రభుత్వాలపైనే పడుతున్నది. పలు సంక్షేమ అభివృద్ధి పథకాల్లో గతంలో 90:10 నిష్పత్తి, లేదంటే 75:25 నిష్పత్తిలో ఉన్న కేంద్రం, రాష్ట్రాల వాటాను.. ఇప్పుడు ఏకంగా 60:40 నిష్పత్తికి కేంద్రం మార్చేసింది. అంతేకాదు ఆయా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్రాలు తొలుత.. తన వాటా నిధులను చెల్లిస్తేనే ఆ తర్వాత కేంద్రం తాపీగా నిధులు ఇచ్చేలా రూల్స్ మార్చింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను, స్థానిక అవసరాలను ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో పథకాల స్వరూపాన్ని మార్చి వేయడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేంద్రం తీరువల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్‌లో తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ.3 వేల కోట్ల దాకా కోత పడే అవకాశం ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఉపాధి నిధులలో భారీ కోత!**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్'(వీబీ జీ రామ్ జీ)గా మార్చిన కేంద్ర ప్రభుత్వం.. కేవలం పేరులోనే కాదు పథకములోనూ సమూల మార్పులు చేసింది. గతంలో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 90% చెల్లిస్తే రాష్ట్రాలు కేవలం 10 శాతం దాకా భరించేవి. కూలీల వేతనాలు 100%, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు 100% పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే చెల్లించేది. కేవలం మెటీరియల్ ఖర్చుల్లో మాత్రమే రాష్ట్రం 25% పెట్టుకునేది. కానీ కొత్తగా తెచ్చిన విబిజీ రాంజీ స్కీం కింద వేతనాలు, మెటీరియల్, అడ్మినిస్ట్రేషన్ అనే తేడా లేకుండా మొత్తం ఖర్చులు కేంద్రం రాష్ట్ర వాటా 60:40 నిష్పత్తిలో భరించాలని స్పష్టం చేసింది. కేంద్రం తెచ్చిన ఈ కొత్త విధానంతో రాష్ట్రానికి ఏటా రూ.1,300 కోట్ల దాకా భారం పడనుందని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. నిజానికి ఏటా ఉపాధి హామీ పథకం కేటాయింపులను కేంద్రం తగ్గిస్తూ వస్తున్నది. కరోనా సమయంలో (2020–22) రాష్ట్రానికి ఏటా రూ.4,100 కోట్లకు పైగా నిధులు రాగా, ఆ తర్వాతికాలం లో ఇది రూ.2 వేల కోట్లకు పడిపోయింది. ఉపాధి నిధులను సరిగ్గా వినియోగించుకోవడంలేదని, పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొంటూ.. ఇలా రకరకాల సాకులతో కేంద్రం నిధులు నిలిపివేయడం రాష్ట్రానికి శాపంగా మారింది.

**ఆరోగ్య మిషన్ లోనూ అంతే..**

జాతీయ ఆరోగ్య మిషన్ అమలులోనూ కేంద్రం తీరు రాష్ట్రానికి శాపంగా మారింది. మొదట్లో ఈ పథకంలో కేంద్రం, రాష్ట్రాల నిధుల వాటా 75 : 25 ఉండగా ప్రస్తుతం 60:40 కి మార్చారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ హెచ్ ఎం కింద కేంద్రం నుంచి రూ.985.34 కోట్లు విడుదల కావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ. 176.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు సంబంధించిన బ్రాండింగ్, లోగోల విషయంలో కేంద్రం విధించిన నిబంధనలను రాష్ట్రం పాటించలేదని సాకుతో వందల కోట్ల నిధులను కేంద్రం నిలిపివేసింది. దీంతో ఆసుపత్రుల నిర్వహణ, సిబ్బంది వేతనాల భారం అంతా రాష్ట్రం పైనే పడుతుంది. వాస్తవానికి ప్రజారోగ్యం రాష్ట్ర పరిధిలోని అంశమైనప్పటికీ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం సూచించిన రంగులే వేయాలని, వాటికి 'ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్' అనే పేరు పెట్టాలని కేంద్రం జారీ చేసింది.

**అంగన్వాడీల భారం అంతా రాష్ట్రం పైనే:**

అంగన్వాడీ కేంద్రాల(ఐసిడిఎస్) పథకానికి వెన్నుదన్నుగా నిలిచిన కేంద్రం.. ఇప్పుడు నామమాత్రపు నిధులతో మమ అనిపిస్తోంది. గతంలో 90 శాతం నిధులను కేంద్రమే భరించగా, ఇప్పుడు ఆ వాటాను 60 శాతానికి తగ్గించుకుంది. కేంద్రం దృష్టిలో ఒక అంగన్వాడీ టీచర్ జీతం కేవలం రూ.4,500 మాత్రమే. ఇందులో కేంద్రము వాటా 60 శాతం అంటే రూ. 2,700 మాత్రమే. అంగన్వాడి హెల్పర్ కు కేంద్రం నిర్ణయించిన జీతం రూ.2,250లు. ఇందులో కేంద్రం ఇచ్చేది రూ.1,350 మాత్రమే. కానీ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు ప్రస్తుతం ప్రతినెల రూ.13,650 వేతనం ఇస్తుంది. ఇందులో కేంద్రం ఇచ్చేది రూ.2,700 మాత్రమే. మిగిలిన రూ.10,950 ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానా నుంచి చెల్లిస్తుంది. అంటే టీచర్ల జీతాల్లో కేంద్రం వాటా 20 శాతం కూడా లేదు.



**సర్వ శిక్ష అభియాన్ :**

విద్యారంగానికి సంబంధించి సర్వ శిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ వంటి పథకాలకు పూర్తిస్థాయి నిధులు కేంద్రం నుంచి వచ్చేవి. గతంలో ఆదర్శ పాఠశాలలు నిర్వహణకు కేంద్రమే చూసుకునేది. కానీ 2016 నుంచి కేంద్రం ఈ బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకోవడంతో రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్ ల నిర్వహణ టీచర్ల జీతాల భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం పైనే పడింది. అలాగే సర్వ శిక్ష అభియాన్ కింద నిధులు పొందాలంటే రాష్ట్రం తన 40% వాటాను సకాలంలో జమ చేయాలని నిబంధన ఉంది. దీనివల్ల ఏటారు రూ. 600 నుంచి రూ.800 కోట్ల మేర రావాల్సిన నిధులు తరచూ నిలిచిపోతున్నాయి.

**మధ్యాహ్న భోజన పథకం:**

ఈ పథకానికి నిధులు 75 శాతం కేంద్రం నుంచి వచ్చేవి. నేడు 60: 40 కి తగ్గించడంతో రాష్ట్రం పైన అదనపు భారం పడుతుంది.

**గ్రామీణ సడక్ యోజన:** 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' కింద గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి 90% నుంచి 100% నిధులను కేంద్రమే భరించేది. తాజా నిబంధనల ప్రకారం దీనిని 60:40 నిష్పత్తికి కుదించారు.

**'గ్రీన్ రెవల్యూషన్ కృషోన్నతి యోజన':** వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన ఈ పథకానికి గతంలో 100% నిధులు కేంద్రమే ఇచ్చేది. ఇప్పుడు అది 60 శాతానికి పడిపోయింది.

**'పీఎం ఫసల్ బీమా యోజన'** : ఈ పథకానికి గతంలో 50:50 గా ఉన్న నిష్పత్తిని మరి దారుణంగా మార్చి, ఇప్పుడు కేవలం 25 శాతం మాత్రమే ఇస్తామని తేల్చిచెప్పింది.

**వరదలు వచ్చిన ఆదుకుంటలే :**

వరదలు, కరువు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు ఇచ్చి రాష్ట్రాలకు అండగా నిలవాల్సిన కేంద్రం తీవ్ర వివక్షత చూపుతుంది. ఎస్‌టిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ నిధుల విడుదలలో రాజకీయ కోణంలో వ్యవహరిస్తూ, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మొండి చేయి చూపుతోంది.

**వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి :**

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులను కూడా కేంద్రం నిలిపివేసింది. తెలంగాణలోని 9 వెనుకబడిన జిల్లాలకు ఏటా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున కేంద్రం రూ 450 కోట్ల నిధులు ఇవ్వాలి. 2015–16 తర్వాత ఈ స్కీమును కేంద్రం రద్దు చేసింది. దీనివల్ల గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్రానికి రావలసిన నిధులు రూ. 2 వేలు కోట్లు నిలిచిపోయినవి.

**ఈ స్కీమ్స్ భారమంతా రాష్ట్రాలపైనే :**

దీనికి తోడు నేషనల్ ఈ గవర్నెన్స్ ప్లాన్, పోలీసుల ఆధునికీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్ వంటి కేంద్ర ప్రాయోజత పథకాలను కేంద్రం పక్కన పెట్టింది. వీటి నిర్వహణకు గతంలో కేంద్రం నుంచి నిధులు వచ్చేవి. కానీ ఇప్పుడు ఈ పథకాలను కొనసాగించాలంటే రాష్ట్రమే సొంత నిధులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**హౌసింగ్ స్కీమ్:**

కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూల లో భాగంగా ఒక ఇంటికి అర్బన్ హౌసింగ్ కు రూ. 1.50 లక్షలు, రూరల్ హౌసింగ్ స్కీమ్ క్రింద రూ 0.75 లక్ష ఇస్తున్న నిధులను.. మెటీరియల్ కాస్ట్ పెరిగినందున ఇంటికి రూ. 2.5 లక్షలకు పెంచాలని కోరుతున్నా పెంచడం లేదు.

**కేంద్రం ఇచ్చే నిధుల్లో రాష్ట్రానికి భారీ కోత**

మొత్తంగా చూస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు క్రమంగా పడిపోతున్నాయి.

ఒక్క సెంట్రల్ సెక్టార్ స్కీమును చూస్తేనే 2022–23లో రూ. 25,830 కోట్లు ఉండగా, అది 2024–25 నాటికి సుమారు రూ. 17,595 కోట్లకు తగ్గింది. అదే సమయంలో కేంద్ర ప్రాయోజిత పథకాల వాటా 60:40 కి మారడంతో రాష్ట్రం తన వాటా కింద ఏటా అదనంగా రూ.3 వేల కోట్ల నుంచి రూ. 4 వేల కోట్లు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇది రాష్ట్ర అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేంద్రం విధిస్తున్న ఈ ఆర్థిక ఆంక్షలు, నిధుల కోతలు రాష్ట్ర ప్రగతికి సంకెళ్లుగా మారుతున్నాయి.

ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న ఈ విధానాలను మార్చాలని రాష్ట్రం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడము అటుంచితే మొత్తం పథకాల తీరునే మార్చి వేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా పాలన సాగించాలి!

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన తెలంగాణ ప్రభుత్వం ఈ సవాళ్లన్నింటిని ఎలా అధిగమిస్తుంది అనేది కూడా పెద్ద సవాలే. ఒకవైపు నిధులు, విధులు, అధికారం కోసం కేంద్రంపై పోరాడటం, మరోవైపు తన పరిపాలనలోని వైఫల్యాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. తన పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంలో ఇంకా ఆత్మస్తుతి, పరనింద అనే మూస ధోరణిని పక్కనపెట్టి, ఇక నుంచైనా పాలనపై పూర్తి స్థాయిలో అది దృష్టి కేంద్రీకరించాలి.

# కవితకు ఏదీ రాజకీయ ప్రాతిపదిక?




**ఎస్.కె.జకీర్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకోనుంది. పార్టీ ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ అస్తిత్వం కోసం పనిచేసే పార్టీ అవసరం ఉందని, సామాజిక తెలంగాణ సాధన కోసం కలిసి నడుద్దామని కవిత పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నిరంతరం తన పోరాటం ఉంటుందని, ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే తనకు అందరూ మద్దతివ్వాలని ఆమె కోరారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు 12 ఏళ్లలో ఏ మేరకు సాకారమయ్యాయి? ఇంకా ఏమేం చేయాలి? అనేది నిర్ధారించడానికి వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేశారు.ఆయా కమిటీలు ఈ నెల 17న స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీ పదవికి కవిత చేసిన రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కవిత ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన రోజే ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. చైర్మన్ అనుమతితో తన రాజీనామాకు దారితీసిన పరిస్థితు లు, ఇతర అంశాలను ఆమె మండలిలో వివరించారు. ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశానని, దాన్ని ఆమోదించాలని కవిత కోరారు. కవిత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని ఆమె రాజీనామాను ఆమోదించారు.

ఏదో ఒకరోజు తాను సిఎం అవుతానని కవిత భావిస్తున్నారు. ముఖ్యమంత్రి కావాలంటే తెలంగాణలో 60 సీట్లు కావాలి. కవిత ఏ రాజకీయ పార్టీ తరఫున అధికారంలోకి రావాలనుకుంటున్నారో తెలియదు. ఆమె ఎత్తుగడలు, వ్యూహరచన అయోమయంగా ఉన్నాయి. సొంత రాజకీయ పార్టీని కవిత ఏర్పాటు చేయగలరా? అలా ఏర్పాటు చేసినా ఆ పార్టీకి తెలంగాణలో స్పేస్ ఉందా? ఏ రాజకీయ పార్టీ ఏర్పాటుకు అయినా తప్పనిసరిగా ఒక భూమిక ఉండాలి. రాజకీయ ప్రాతిపదిక ఉండాలి. ప్రజల్లో ఆదరాభిమానులు లభించాలి. ప్రజల ఆమోదం లభిస్తే తప్ప ఆ పార్టీ హిట్ కాదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంతో ఏర్పడినందువల్ల టిఆర్ఎస్ కు 2001 నుంచి ప్రజలు కెసిఆర్ వెంట నడిచారు.

తెలంగాణ ఉద్యమం విజయవంతమైంది. ఎపి విభజన, తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగింది. కెసిఆర్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని ప్రజలిచ్చారు. ఎమ్మెల్సీ కవిత ఎలా సిఎం కాగలుగుతారో ఎవరికీ అంతుచిక్కడం లేదు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన భూ బాగోతాలు, ఫోన్ ట్యాపింగ్ వంటి నేరాలు ఘోరాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు అసెంబ్లీ లోపలా, వెలుపలా రెండేండ్లుగా మాట్లాడుతూనే ఉన్నారు. ఇప్పుడు కొత్తగా కవిత గుప్పిస్తున్న ఆరోపణల గురించి మాట్లాడవలసి వస్తే,ఇక ఆమెకు బిఆర్ఎస్ దారులన్నీ మూసుకుపోతున్నట్లు కనిపిస్తోంది. ఇక ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించడమో లేదా ఇప్పటికే ఉన్న ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరిపోవడమో తప్ప ప్రత్యామ్నాయమేదీ కనిపించడం లేదన్న విశ్లేషణలు వస్తున్నాయి. హిల్ట్ పాలసీ తెచ్చి భూములను ధారాదత్తం చేయడానికి బీజం వేసింది ఎవరు? డిస్టిలరీ భూములను ప్రైవేటుకు ఇవ్వలేదా? పలు సంస్థలను ఎంపిక చేసుకొని చేంజ్ ఆఫ్ ల్యాండ్ పేరిట ప్రభుత్వ భూములను మీరు ప్రైవేటుకు ధారాదత్తం చేయలేదా? దానిమీద సంతకం పెట్టింది కెటిఆర్ కాదా? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను డిఫెన్సులో పడవేశారు కవిత.



ఉద్యమ సమయంలో బిఆర్ఎస్ నాయకులు భారీ దోపిడీకి పాల్పడ్డారా? అలాగే కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు భూ కబ్జాలకు, దోపిడీకి పాల్పడ్డారా? ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఆరోపణలు ప్రకంపన లు రేపుతున్నవి.'' ఇంకో అడుగు ముందుకు వేసి ''ఏదో రోజు సిఎం నవుతా..మీ పని పడతా'' అని కూడా ఆమె హెచ్చరించారు. ఏడెనిమిది నెలలుగా కవిత వార్తల్లో ప్రధాన శీర్షికలో ఉంటున్నారు. పబ్లిసిటీ కోసం ఆమె ఇలా చేస్తున్నట్టు అనుకోలేం. ఆమెది ధర్మాగ్రహం అనికూడా అనుకోలేం. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగాల పై కవితను బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు.

తెలంగాణ సాధించడంతోపాటు తొలిసారి తమ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పార్టీ నాయకులు పెద్దఎత్తున అక్రమ సంపాదనకు పూనుకున్నట్టు సమాచారం ఆమె దగ్గర ఉన్నది.అయితే అదే సమయంలో కవిత సంపద వివరాలు కూడా బిఆర్ఎస్ నాయకులు సేకరించి పెట్టుకున్నారు.

కొందరు నాయకుల అక్రమాల చిట్టాను బయటపెడుతున్నందుకే వారు తన భర్త అనిల్ పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కవిత తెలిపారు.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలను ప్రసారం చేసిన చానల్‌కు ఆమె లీగల్ నోటీస్ పంపించారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో బిఆర్ఎస్ పరువు బజారుకెక్కింది. కవిత ఎపిసోడ్ పై స్పందించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 'ప్రతి ఇంట్లో ఉండే పంచాయతే'నని సింపుల్ గా తేల్చి పారేశారు. అయితే ఇంటి ముసలం అంత సులభంగా పోదు!

## ప్రజల మన్ననలు పొందిన ‘ప్రజాపక్షం’



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజాసమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కారానికి వారధిగా పనిచేస్తున్న ప్రజాగొంతుక ప్రజాపక్షం దినపత్రిక అని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఎల్ల గురువారెడ్డి భవన్‌లో 2026 ప్రజాపక్షం క్యాలెండర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్ ఆకుల పాండురంగంతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లాకార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తు..అవినీతిని వెలికితీస్తూ ప్రజాపక్షం దినపత్రిక అనతి కాలంలో ప్రజాధరణ పొందిందన్నారు. భవిష్యత్తుల్లో ప్రజాపక్షం ప్రధాన పత్రికగా ఎదగాలని ఆకాంక్షించారు.ప్రజాపక్షం అభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తామని మంద పవన్ అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు బన్సిలాల్, జెర్రిపోతుల జనార్ధన్, ప్రజాపక్షం ఆర్‌సి మరుపల్లి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో డబ్ల్యుఒ తనిఖీ

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని ముత్యంపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను డిడబ్ల్యుఒ నరేష్ గురువారం తనిఖీ చేశారు. కాగా కేంద్రాలలోని పిల్లల సంఖ్య ,ఎదుగుదల, ఎఎల్ఎంఎస్,సి కమిటీ మీటింగ్, కేంద్రంలోని రిజిస్టర్ లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గర్భిణీలకు బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార రిజిస్టర్ తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు నరేష్ ,ఉపసర్పంచ్ వంగ పోతయ్య, అంగన్వాడి టీచర్లు ఆమెటి శ్రీలత దాసరి లక్ష్మి ,తదితరులు ఉన్నారు.

## క్రీడలపై దృష్టి సారిస్తే చెడు అలవాట్లు దరిచేరవు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రతి ఒక్క యువకుడు క్రీడల పట్ల దృష్టి సారిస్తే చెడు అలవాట్లే దరిచేరవని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అ న్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కెవిఎస్ఆర్ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న మల్లాపూర్ ప్రీమియర్ లీగ్ నాలుగవ సీజన్ టోర్నీని క్రీడాకారులతో కలిసి గురువారం ప్రారంభించారు. ప్రారంభనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే ప్రత్యేకంగా క్రీడలను అలవర్చుకోవాలని సూచించారు. వీరి వెంట , బి ఆర్ ఎస్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్లు చిట్యాల లక్ష్మ ణ్, జెల్ల రాజు, తీట్ల లహరి రాజేష్, ఉప సర్పంచ్ గద్దం సోమారెడ్డి, నాయకులు డీలర్ మల్లయ్య, లింగస్వామి ధ్యాగ గంగారెడ్డి ,కొంపల్లి రాజు, మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు క్రీడాకారులు ఉ న్నారు.

## 123 సీనియర్ సిటిజన్ కేసుల పరిష్కారం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో 123 సీనియర్ సిటిజన్ కేసులకు పరిష్కారం చూపడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వయో వృద్ధుల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులైన తల్లితండ్రులను వారి పిల్లలు పట్టించుకోని సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 152 మంది వయో వృద్ధులు తమ పోషణ గురించి పిల్లలు ఏ మాత్రం బాధ్యత వహించటం లేదని ఫిర్యాదు చేయగా, వాటిని పరిశీలించి ఇప్పటి వరకు 123 ఫిర్యాదులు పరిష్కరించామని, మరో 29 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వయోవృద్ధులు పిల్లలు సరిగ్గా చూడటం లేదనే ఫిర్యాదులను ముందస్తుగా సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి వద్ద నమోదు చేయాలని, ఆర్‌డిఒ వద్ద సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు నమోదు చేయాలని, నేరుగా జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు నమోదు చేయవద్దని,ఈ అంశాన్ని వయో వృద్ధులు గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత: ఎస్‌ఐ

**ప్రజాపక్షం/గంగాధర:** ప్రస్తుత డిజిటల్ యుగంలో యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగం చేసుకోవడంతో పాటు సైబర్ నేరాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని గంగాధర ఎస్‌ఐ వంశీకృష్ణ అన్నారు. గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో గురువారం సైబర్ కా ఫుల్‌స్టాప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రక్షణ, పిల్లల సంరక్షణ అంశాలపై విధ్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, యాంటీ క్రైమ్ చర్యలు, పోక్సో చట్టం, డేటింగ్ యాప్‌లు, మ్యాట్రిమోనియల్ మోసాలు, పిల్లలపై లైంగిక వేధింపులు, ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం రక్షణ వంటి అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు. అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ ప్రతిజ్ఞ చేయించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విధ్యార్థినిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా ఆన్‌లైన్ బుకింగ్



**ప్రజా పక్షం/సుల్తానాబాద్:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ప్రభుత్వం వారికి సులభతరం అయ్యే విధంగా యూరియా బస్తాలు అందించినందుకే యాప్ ద్వారా అమ్మకాలను ప్రారంభించిందని జిల్లా సహకార అధికారి శ్రీ మాల అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల సహకార సంఘంలో సహకార అధికారిణి శ్రీ మాల,యూరియా నిల్వను పరిశీలించిన అనంతరం ఆప్ ద్వారా అమ్మకాలను పై రైతు సోదరులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా సహకార అధికారిని శ్రీమాల మాట్లాడుతూ రైతు సోదరుల సౌలభ్యం కోసమే వారికి సులభతరం అయ్యే విధంగా ప్రభుత్వం యాప్ ద్వారా అమ్మకాలను కొనసాగిస్తుందని రైతులు వారికి యూరియా బస్తాలు అవసరమైన సమయంలో ఇంటి వద్దనే బుక్ చేసుకోవడం చాలా సులభం అని అన్నారు. దీనితో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమయం వృధా కాకుండా ఉంటుందని శ్రీ మాల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి ఇంతియాజ్ అలీ కేడీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కరీంనగర్ , సంఘ కార్యదర్శి రమేష్, సిబ్బంది పరశురాములు, సంపత్, సతీష్, శ్రవణ్ తో పాటు రైతు సోదరులు, హమాలీలు ఉన్నారు.

# కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ

**ఎఐటియుసి గౌరవాధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 47 వేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు డిమాండ్ చేశారు.గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణికి చెందిన బొగ్గు , విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వంకు చెందిన విద్యుత్ సంస్థలు వాడుకొని 47 వేల కోట్ల రూపాయలు బకాయిలు పడ్డారని, వాటిని ఇంత వరకు సింగరేణికి చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని వారు తెలిపారు. దీనివల్ల సంస్థలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోయాయని, ముఖ్యంగా కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లింపులకు సంస్థ బ్యాంకు నుండి అప్పులు చేసి ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సంస్థలో యంత్రాలు పాత బడి మూలకు పడుతున్నాయని, డబ్బులు లేక కొత్త మిషనరీ కొనుగోలు చేయడం లేదని, దీని వల్ల పాత యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి చేయడం వల్ల అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. సంస్థకు కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, లేకుంటే సంస్థ భవిష్యత్తులో కొనసాగడం కష్టమని, కొత్త గనులు ప్రైవేటుకు ఇవ్వకుండా సింగరేణి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు శాశ్వత మైన సి అండ్ ఎండిని, డెరెక్టర్ ఫైనాన్స్ ను నియమించక పోవడం వల్ల గుర్తింపు సంఘం ఎఐటియుసితో యాజమాన్యం అంగీకరించిన డిమాండ్‌లపై అమలు కోసం సర్క్యులర్ జారీగాక కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు పేర్కొన్నారు. సంస్థకు శాశ్వతమైన సి అండ్ ఎండిని, డైరెక్టర్ ఫైనాన్స్‌ను నియమించి సమస్యలను పరిష్కరించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మారుపేర్లు, విజిలెన్స్ కేసుల సమస్య, మెడికల్ బోర్డును నిర్వహించక పోవడం, సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చి నెలలు గడిచినా ఇంత వరకు పరిష్కారం చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం కోల్ బెల్ట్ శాసనసభ్యులు సిపిఐ ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు తప్ప ఇతర పార్టీల కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్ట సభల్లో మాట్లాడకపోవడం విచారకరమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ సంఘం ఐఎన్‌టియుసి సింగరేణి కి రా వాల్సిన 47 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి ఇప్పించడం చాతకాదు కానీ కార్మికుల సమస్యల పరిష్కారం లో ఎఐటియుసి వైఫల్యం చెందిందని ప్రచారం చేయడం సరైంది కాదని వారు మండి పడ్డారు. సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడేది ఎఐటియుసి మాత్రమేనని వారు పేర్కొన్నారు.ఇంకా ఈ సమావేశంలో అదనపు ప్ర ధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య,ఉప ప్రధాన కార్యదర్శులు కె.సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లా గౌడ్, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నా యకులు సంకె అశోక్, సిర్ర మల్లికార్జున్, ఎం.ఎ. గౌస్, ఆజీం పాషా, పర్లపెల్లి రామస్వామి, ఏ.వి.ఎస్ ప్రకాశ్, పెద్దెల్లి శంకర్, నంది నరేష్, మడ్డి కిరణ్, జనగామ జగదీశ్వర్, ఆఫీస్‌కార్యదర్శితొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

## పిల్లల్లో కనీస విద్యాప్రమాణాలు పెంచడంపై దృష్టి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యా శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యా నాణ్యత పెంపొందించేందుకు మండల విద్యా శాఖ అధికారి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, విద్యా శాఖ జిల్లా ఉన్నతాధికారులు నిర్వహించే తనిఖీలు, తీసుకునే రివ్యూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.పాఠశాలల తనిఖీ నిమిత్తం విద్యా శాఖ ఉన్నతాధికారులు వీక్లీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పాఠశాలల తనిఖీలను ప్రతి అధికారి కనీసం 80 శాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల తనిఖీ నాణ్యతతో ఉండాలని, చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలించి పాఠశాల పర్యటన సంబంధించి రిపోర్టు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండే విధంగా కృషి చేయాలని, పిల్లలు ప్రస్తుత విద్యా ప్రమాణాల స్థితిగతులను సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకున్నా అంతా బాగుందని చూపేట్టేందుకు తప్పుడు వివరాలు ఇవ్వవద్దని అన్నారు.ప్రాథమిక విద్య మిడ్ లైన్ చెకింగ్ లో పెద్దపల్లి జిల్లా ప్రస్తుతం 17వ స్థానంలో ఉందని, తెలుగు రాయడం, చదవడం లో విద్యార్థులు చాలా వెనుకబడి ఉన్నారని, క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా అధికారులు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల సిబ్బందికి తగు సూచనలు జారీ చేయాలని అన్నారు. జనవరి 31, ఫిబ్రవరి 5, ఫిబ్రవరి 23 నాడు 3 సార్లు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాల పై మాక్ టెస్ట్ నిర్వహించాలని, ప్రతి పరీక్షకు విద్యార్థులలో ఇంప్రూవ్మెంట్ ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు ఎఫ్ఆర్ఎస్ నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాల సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యూఐడిసిలో నమోదు చేయాలని అన్నారు. పిఎంశ్రీ పథకానికి ఎంపికైన 16 పాఠశాలలకు సంబంధించి 88 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం ఈ నిధులను హెడ్ మాస్టర్‌లు జనవరి 26 నాటికి వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పిఎం. షేక్ ,మల్లేశం ,జిసిడిఓ కవిత,మండల విద్యా ధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బాలుర ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తనిఖీ బృందం

**ప్రజాపక్షం/మల్యాల :** పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని నోడల్ అధికారి మానుపాటి బన్నా అన్నారు.జగిత్యాల జిల్లా మల్యాల మండల బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యేక తనిఖీ బృందం 3 గురువారం ఉదయం సందర్శించింది.ఈ సందర్భంగా తనిఖీ బృందం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స బ్జెక్టుల వారీగా సామర్థ్యాలను పరిశీలించారు.అనంతరం ఉపాధ్యాయుల బోధ న తీరు, రికార్డులు,సైన్స్ ల్యాబ్ నిర్వాహణ, క్రీడలు, ఆరోగ్య విద్య ,మధ్యాహ్న భోజన పథకం అమలు పనితీరును నోడల్ ఆఫీసర్ మానుపాటి బన్నా బృందం తనిఖీ చేసింది. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వాహణ తీరును పరిశీలించి విద్యార్థుల మార్కుల మూల్యాంకనం రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ బన్నా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మరింత మెరుగైన పనితీరుకై తద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గాను జిల్లా విద్యాధికారులు తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయగా ఆమేరకు జగిత్యాల జిల్లాలోని సుమారు 55 ప్రభుత్వ పాఠశాలలను (జడ్పి,టిజిఎంఎస్, కేజీబీవీ పాఠశాలలు) ఈ బృందం తనిఖీ చేస్తుందని బన్నా పేర్కొన్నారు. తనిఖీ బృందంలో నోడల్ అధికారి మానుపాటి బన్నా, రాజశేఖర్ (ఆంగ్ల ఉపాధ్యాయుడు), శ్రీధర్ (భౌతిక శాస్త్రం), వంగపల్లి సంపత్ కుమార్ (హిందీ), నారి మల్లారపు (గణితం) , బి.శేషగిరి(తెలుగు), బూట్ల రాజమల్లయ్య( ఆరోగ్యం, వ్యాయామ విద్య) వీరితో పాటుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుపమ , నాగభూషణం (ఆంగ్లం), రాంమోహన్ (జీవశాస్త్రం), రవిందర్ (గణితం), శారా (తెలుగు), అనిత (ఫిజికల్ సైన్స్), మేరాజ్ మీర్జా (హిందీ), విశ్వప్రసాద్ (ఫిజికల్ డైరెక్టర్), శ్రీధర్ (సోషల్) గంగలక్ష్మి (జూనియర్ అసిస్టెంట్), వెంకటేశ్ (ఆఫీస్ సబార్డినేట్)తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదరహిత జిల్లాగా కరీంనగర్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండి వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాదరహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ సిపి గౌష్ ఆలం అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం 2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు పోలీసు శాఖ తరపున ఒక బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యాశ, భయం, అవగాహన లేకపోవడం వల్ల అనేక సైబర్, ఫైనాన్సియల్ ఫ్రాడ్‌లు జరుగుతున్నాయని అన్నారు. ట్రైనీ ఐపిఎస్ సోహం సునీల్, కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపిలు విజయ కుమార్, రమేష్, ఇన్స్‌పెక్టర్ సదన్ కుమార్‌లతో పాటు పోలీసు అధికారులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు. మొదటగా కరీంనగర్ నగరంలోని ఆరెపల్లిలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు డిఎంఎఫ్‌టి నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. ఆరెపల్లి శివారులోని స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో గల కియాకార్ షోరూంలో నూతన మోడల్ సెల్టాస్ కార్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి కృష్ణానగర్ చేరుకుని నూతనంగా ఏర్పాటు చేసిన సొసైటీ టీ స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని 107 మందికి రూ.23 లక్షల 33 వేల ఐదు వందల సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులు చెక్కులను పంపిణీ చేశారు. దాంతో పాటు మేదరి సంఘం ఆద్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు.బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్, డివిజన్ మాజీ కార్పోరేటర్ తుల బాలయ్య, మూల ప్రభాకర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

**విశ్వబ్రాహ్మణులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తా**

**రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి**

**ప్రజా పక్షం/సుల్తానాబాద్:** విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి వారికి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి విశ్వబ్రాహ్మణులకు హామీ ఇచ్చారు.రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం రామగుండం శాసనసభ్యులు శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు.అంతేకాకుండా విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వపరంగా సహాయం అందేలా మరో ముందడుగు వేస్తూ, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు శ్రీ వేంనరేందర్ రెడ్డి ని హైదరాబాదులోని ఆయన నివాసంలో స్వయంగా కలిసి, విశ్వబ్రాహ్మణుల నాయకులను ఆయన వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అక్రమ రికవరీలు, కార్పొరేట్ వ్యవస్థ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, వెండి– బంగారం ధరలు విపరీతంగా పెరగడం కారణంగా స్వర్ణకారులకు పని లేకుండా పోవడం వంటి అనేక సమస్యలను విపులంగా విన్నవించారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, విశ్వబ్రాహ్మణులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి స్పందించిన శ్రీ వే వేం నరేందర్ రెడ్డి తప్పకుండా ఎమ్మెల్యే తో కలిసి ముఖ్యమంత్రి ద్వారా ఈ సమస్యల పరిష్కారానికి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ నాయకులు శ్రీ వేము నరేందర్ రెడ్డి ని సన్మానించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా విశ్వబ్రాహ్మణ నాయకులు శ్రీ వింజామూరి రాఘవ చారి, శ్రీ వడ్ల హనుమాండ్లు, శ్రీ కందుకూరి పూర్ణాచారి, శ్రీ కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), శ్రీ రంగు శ్రీనివాస్, శ్రీ దేవరకొండ రాజు, శ్రీ బానాల లక్ష్మ ణ్, శ్రీ కాకర్ల నర్సింహాచారి, శ్రీ దేవరకొండ చంద్రమౌళి, శ్రీ కట్ట సంజీవ్ ,తదితరులు పాల్గొన్నారు.

## అతి వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో “జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం – 2026” బైక్ ర్యాలీ కార్యక్రమంను గురువారం నిర్వహించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం – 2026 బైక్ ర్యాలీని జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఘనంగా ప్రారంభించారు.రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే మన లక్ష్యమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందని, మద్యం సేవించి వాహనం నడపరాదని జగిత్యాల కలెక్టర్ హెచ్చరించారు. అధిక వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణమని వారు తెలిపారు. లైసెన్స్ లేకుండా ఎవరు కూడా వాహనం నడపకూడదన్నారు. వాహనదారులు అందరు వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. బైక్ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. “హెల్మెట్ ధరించండి – ప్రాణాలు కాపాడుకోండి” అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)బి.ఎస్. లత, జిల్లా అధికారులు, రవాణా శాఖ, పోలీస్, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ స్థాయిల అధికారులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ‘అరైవ్ – అలైవ్’ ర్యాలీ

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ, రామగుండం ట్రాఫిక్ పోలీసు సంయుక్తంగా ‘అరైవ్ అలైవ్’ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల్లో చైతన్యం, అవగాహన కల్పించేందుకు గోదావరిఖని పట్టణంలో ర్యాలీ, సదస్సు చేపట్టారు. అడిషనల్ డిస్ట్రిక్టు కోర్టు అవరణలో నిర్వహించిన సదస్సులో జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు, గోదావరిఖని ఎసిపి మడత రమేష్‌లు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల సందర్భంలో చట్టపరమైన హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉందని, ప్రజలు ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించి మార్పుకు దోహదపడాలని కోరారు.సెషన్స్ న్యాయమూర్తి ఐ.సురత్‌రాజ్ సింగ్, ప్రధాన న్యాయమూర్తి ఎన్.వెంకటసచిన్‌రెడ్డి, ద్వితీయ అదనపు న్యాయమూర్తి ధ్రువ వెంకటేష్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్‌రావు, ఒకటో పట్టణ సిఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ. హరిశేఖర్, రామరాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రభుత్వ, శ్రీచైతన్య, మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకమెప్పుడు?



**ఊరిస్తున్న ఇన్‌చార్జి పదవి**
**కరీంనగర్ కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యతలెవరికి?**
**ఆశావహుల్లో తొలగని ఉత్కంఠ**
**మున్సిపల్ ఎన్నికలలోపు నియమిస్తారా..?**



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవీ బాధ్యతలపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిగో అదిగో అంటూ పార్టీ అధిష్టానం ఊరిస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. 2023 ఎన్నికల ముందు కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న పురుమల్ల శ్రీనివాస్‌ను క్రమశిక్షణ ఉల్లంఘన కింద సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి పదవి ఖాళీగా ఉండడంతో పలువురు సీనియర్ నేతలు అధిష్టానం వద్ద పైరవీలు మొదలుపెట్టారు. సమీకరణాలన్నీ పూర్తి చేసుకున్న అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకపోవడంలో అంతర్యమేమిటనేది ప్రశ్నార్ధకంగా మారింది.ఈ క్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇ న్‌చార్జి పదవిని ఆశిస్తున్న నాయకులు, వారి అనుచరులు ఉత్కంఠగా ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కాగా గత దశాబ్ద కాలంగా కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తన ప్రాభవాన్ని ఎక్కడా చూపలేకపోయింది. గత అసెం బ్లీ ఎన్నికల్లోపార్టీ అధికారంలోకి రావడంతో పూర్వవైభవాన్ని తీసుకురావాలని అధిష్టానం బలంగా సంకల్పిస్తోంది. ఈ నేపధ్యంలో కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బలమైన నేతను నియమించాలని నిర్ణయించింది. ఇన్‌చార్జిగా కొనసాగిన నాయకుడు సస్పెన్షన్ కు గురి కావడంతో ఆ పదవికై పలువురు నేతలుతమ ప్రయత్నాలను మొదలుపెట్టారు. ప్రధానంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గఇన్‌చార్జిగా కొనసాగుతున్న వెలిచాల రాజేందర్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు,ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ ఉట్కూ రి నరేందర్‌రెడ్డిలు ఇన్‌చార్జిపదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. కాగా వెలిచాల రాజేందర్‌రావుకు కాంగ్రెస్ ని యోజకవర్గ ఇన్‌చార్జిపదవిని దాదాపు ఖాయం చేసినట్లుగానే ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జ రిగిన నియోజక వర్గఇన్‌చార్జిల సమీక్ష సమావేశాల్లోనూ ఆయన పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే క్రమంలో దాదాపు రాజేందర్‌రావుకే పదవి ఖాయమైనట్లుగానే అందరూ భావించారు. కానీ ఇప్పటి వరకు అధిష్టానం మాత్రం అధికారిక ప్రకటన వెల్లడించలేదు.డిసిసి అధ్యక్షునిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను నియమించిన అధిష్టానం నగర అధ్యక్ష బాధ్యతలు అంజన్ కుమార్ కు అప్పగించారు. కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిపదవిలో మాత్రం ఎవరిని నియమించడం లేదు..అధిష్టానం మదిలో ఏమున్నది..? ఎందుకు ఈ పదవిని భర్తీ చేయడంలేదనేది పార్టీ శ్రేణులకు అంతుచిక్కడం లేదు..! గత నెలలో పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజక వర్గం పరిధిలో మంచి ఫలితాలనే సాధించింది. ఈ లోగా మున్సిపల్ ఎన్నికల నగరా మోగనుంది.. కరీంనగర్ నియోజక వర్గం పరిధిలోని ప్రతిష్టాత్మకమైన కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామనే ధీమాను డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ప్రకటించారు. అయితే నియోజక వర్గ ఇన్‌చార్జిని నియమించకుండా మున్సిపల్ లో మంచి ఫలితాలు సాధించడం కష్టసాధ్యమవుతుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతుంది. కనీసం రానున్న మున్సిపల్ ఎన్నికల లోగానైనా నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతుంది.



## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్ఐ మధుకర్



**ప్రజాపక్షం/కేరమేరి :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాపక్షం దినపత్రిక కీలక పాత్ర పోషిస్తోందని కేరమేరి ఎస్ఐ మధుకర్ అన్నారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరిమేరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో 'ప్రజాపక్షం' దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తాయని, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ భీంరావు, వాడై ప్రకాష్, పోలీస్ సిబ్బంది,'ప్రజాపక్షం'విలేకరి కూటికేల వెంకటస్వామి పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/జన్నారం :** గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాంపూర్ సర్పంచ్ నూతి రామయ్య పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామంలో మొదటి గ్రామసభ సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. మొదటి గ్రామసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఉప సర్పంచ్ ఒడ్డెటి వెంకటేష్, వార్డు సభ్యులు అలుగునూరి చెంద్రమోగిలి, ఏలేశ్వరి వెంకటేశ్, సత్యనారాయణ, దిలీప్ నాయక్, సోనిరమ్యశ్రీ, రాజయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం

### బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్



**ప్రజాపక్షం/కాసిపేట :** ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర గణనీయమైనదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండల పరిధిలోని సోమగూడెంలో ఉపసర్పంచ్ మాల్యాల స్రవంతితో కలిసి 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించారు. సమ సమాజ నిర్మాణంలో పత్రికల పాత్ర అద్వితీయమైనదని కొనియాడారు. సామాజిక బాధ్యతతో వార్తలను అందించడంలో ప్రజాపక్షం ముందుండటం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయాలను ప్రజలకు చేరవేయడంలో పత్రిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పాత్రికేయులు ఎండి నజీర్ పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/నేరడిగొండ :** కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సులో జిల్లా నుండి మండలంలోని బుగ్గారం గిరిజన గురుకుల పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థిని సమీరా,పాల్గొని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు,అధికారులు నాయకులు తదితరులు అభినందించారు.

## చైనా మాంజాపై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు వచ్చే సంక్రాంతి పండగ సందర్భంగా ఎగురవేసే గాలిపటలను చైనా మాంజాతో కాకుండా స్వదేశీ దారంతో ఎగురవేయాలని చైనా మాంజా ద్వారా జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు గురువారం చేయూత ఫౌండేషన్,తెలంగాణ హుమెన్ రైట్స్ నాయకులు డాక్టర్ అమృత్ కుమార్,డాక్టర్ ఎన్టీ రమణలు,అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రోడ్లపై వేగంగా ప్రయాణించే వాహనదారుల మెడ, చేతులు, ముఖానికి తీవ్ర గాయాలు జరిగిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్నాయి. పిల్లలను పర్యావరణహితమైన కాటన్ మంజ మాత్రమే ఉపయోగించాలి అని విజ్ఞప్తి చేసారు.ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా శిశుమందిర్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీనా,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ శారదకు ఒయు డాక్టరేట్

**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న ఇట్యూరి శారద ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందినట్లు ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రేమలత పర్యవేక్షణలో "డిజైన్, సింథసిస్ అండ్ కంప్యుటేషనల్ స్టడీస్ ఆఫ్ ఇండోల్‌ఆంటి క్యాన్సర్ ఏజెంట్స్" అనే అంశంపై పరిశోధన పూర్తి చేయగా ఇటీవల వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శారదను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్‌లక్ష్మి నరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్ధన్, అధ్యాపకులు రాజేశ్వర్, కృష్ణవేణి, డాక్టర్ దేవేందర్, రోజ్ మేరీ శాంభవి, సానియా పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ పాఠశాలలో గురువారం 2026టిఎస్ యుటిఎఫ్ డైరీ, అలాగే క్యాలెండర్ ను మోర్తాడ్ ఎంఈఓ సమ్మిరెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ.ప్రభాకర్ ఆవిష్కరించారు.జిల్లా ఉపాధ్యక్షురాలు బి.శకుంతల, మండల అధ్యక్షులు దండు గంగాధర్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఉపాధ్యాయులు మామిడి రవీందర్, నూతికట్టు అశోక్, జి.రవి, నరసింహమూర్తి, ఉపాధ్యాయినిలు దీప, జ్యోతి, పద్మ, సితర్పి సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

# 'టెన్త్' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాపక్షం/ మంచిర్యాల :** పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా విద్యాధికారి యాదయ్యతో కలిసి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పది పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026 మార్చి నెలలో జరిగే పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా పర్యవేక్షిస్తూ, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతికి చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషలలో చదవడం, మాట్లాడటం, రాయడం వచ్చేలా బోధించాలని తెలిపారు. నిర్ణీత గడువులో సిలబస్ పూర్తి చేయాలని, గత ఏడాది 96.4 శాతం ఫలితాలు రాగా ఈసారి వంద శాతం సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హోటల్ కుందనలో మంచిర్యాల, నిర్మల్ జిల్లాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, వార్డెన్ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు భద్రత, భరోసా కల్పించాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని కోరారు. అనంతరం బాలికా విద్యపై ప్రదర్శించిన నాటికను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏసిజిఇ మల్లేశం, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు భరత్, సత్యనారాయణమూర్తి, నిర్మల్ జిల్లా సమన్వయకర్త నవీన జ్యోతి, సహాయ సమన్వయకర్త రమాదేవి, మాస్టర్ ట్రైనర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# మెదక్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి

### మెదక్ ఎంపి రఘునందన్‌రావు డిమాండ్



**ప్రజాపక్షం/శివ్వంపేట :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మెదక్ అభివృద్ధి శూన్యమని, గత పాలకుల నిర్లక్ష్యంతో జిల్లా కేంద్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఉమ్మడి మెదక్ జిల్లాకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణాల కోసం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద రెండు దఫాలుగా నిధులు మంజూరు చేసినా ఇక్కడి పాలకుల వైఫల్యంతో మెదక్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షులు మల్లేశ్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఎంపీ రఘునందన్‌రావు హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాకు ఇంచార్జ్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మానం చేసి అభివృద్ధి చేశారని పట్టణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని, మెదక్ పట్టణానికి మొండిచెయ్యి చూపారని మండిపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులుగా పనిచేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చూస్తూ ఉండిపోయారు తప్ప అభివృద్ధి కోసం మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణ రూపురేఖలు మారాలంటే ఒక్క బీజేపీ పార్టీతోనే సాధ్యమన్నారు. మున్సిపల్ ఎన్నికల బరిలో బీజేపీ పార్టీలో నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు.

## పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని రూరల్ క్యాంపు కార్యాలయం లో గురువారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై నాలుగు మండలాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పేదలకు తోడుగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి తెలంగాణను దివాళా తీసిందని విమర్శించారు. వృద్ధులకు త్వరలోనే పెన్షన్ ఇవ్వనున్నట్లు సిఎం వెల్లడించారని గుర్తు చేశారు. బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, రైతుబీ మా, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలతో పేదలు ప్రయోజనం పొందుతున్నారన్నారు. ప్రజలు గమనించాలని, ఎన్నికల సమయంలో రాముడి పేరు తెరపైకి తెచ్చి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో ఆ స్తుల పంచాయతీ నడుస్తోందని, కుటుంబ విబేదాలు బయట పడటం దురదృష్టకరమని వ్యా ఖ్యానించారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత కన్నీరు కార్చటం కూడా ఆస్తి వివాదాలకే సంకేతమని ఎద్దేవా చేశారు.

## గురుకులంలో రోడ్డు భద్రతపై అవగాహన




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సోఫీనగర్‌లోని గురుకుల బాలికల పాఠశాలలో రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ రాజీనీకాంత్,అక్షయ్ పాల్గొని విద్యార్థినులకు రోడ్డు భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై వివరించారు.చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం,నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ వినియోగం వంటి అంశాలను సవివరంగా వివరించారు.నిర్లక్ష్యం,తొందరపాటు నిర్ణయాలు ఎలా ప్రమాదాలకు దారి తీస్తాయో ఉదాహరణలతో తెలియజేశారు.అలాగే పాఠశాల పరిసరాల్లో రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవడం,వాహనాల రాకపోకల సమయంలో అప్రమత్తంగా ఉండడం, ప్రమాదాలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

## ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ గురువారం సందర్శించారు. క్షేత్రస్థా యి సందర్శన జరిపారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన సీళ్ల ను పరిశీలించారు. కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగంపర్యవేక్షకులు బాలరాజు, సాత్విక్, విజయేందర్‌రెడ్డి ఉన్నారు.

## నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**ప్రజాపక్షం/రామాయంపేట:** ణ్యమైన ఎరువులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ వ్యాపారులకు సూచించారు. గురువారం రామాయంపేటలో పర్యటించిన ఆయన ఎరువుల దుఖాణాన్ని తనిఖీ చేసి ఎరువు బస్తాల నిలువ, బరువు, ధరల పట్టిక, బిల్లుల జారీ విదానం, స్టాక్ రిజిస్టర్ తదితర అంశాలను తనిఖీ చేశారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# భారత గడ్డపై సిపిఐ వందేళ్లు పూర్తి

### మండల కార్యదర్శి జోగుల మల్లయ్య పిలుపు




**ప్రజాపక్షం/ నస్పూర్ :** రామకృష్ణాపూర్‌లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సభను జయప్రదం చేయాలని సిపిఐ నస్పూర్ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లా నస్పూర్, శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఖమ్మం శతాబ్ది సభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని, బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తి కోసం రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. వెట్టి చాకిరి విముక్తి కోసం, కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి రక్షించడానికి పార్టీ ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణ త్యాగాలు చేశారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే శతాబ్ది మహాసభలకు జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రయ్య, నగేష్, లింగం రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిర్యాల రాజేశ్వరరావు, కొట్టే కిషన్ రావు, పూజారి రామన్న, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మోత్కూరీ కొమురయ్య, గునిగంటి నర్సింగరావు, ఆర్కె 5 పిట్ కార్యదర్శి, జోగులాంజనేయులు, అల్లాలచ్చిరెడ్డి, కోడి వెంకటేష్, రాచర్ల చంద్రమౌళి, మో గరం రాకేష్, సంఘ రాజయ్య, శ్రీకాంత్, భోగి మధునయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మాణ పనులు పూర్తి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / లక్సెట్టిపేట :** ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్సెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టుమార్టం గది నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ల్యాబ్, వార్డులు, పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఓపిలో నమోదు అవుతున్న అనారోగ్య సమస్యల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరిస్తూ సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా అధికంగా వచ్చే జలుబు, జ్వర పీడితులకు వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాల వేసుకుంటే తప్పేంటి..? ప్రిన్సిపాల్‌ను నిలదీసిన తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/రేగోడ్ :** మాల వేసుకుంటే స్కూలుకు రావద్దు అంటూ ప్రిన్సిపాల్ చెప్పడం పైవిద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు రేగోడ్ మోడల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు శివ మాల ధరించి ప్రత్యేక దుస్తులతో వచ్చిన విధ్యార్థుల ను ప్రిన్సిపాల్ విద్యార్థినిలకు సైతం గాజులు వేసుకుని బొట్టుపెట్టుకో వద్దని రావద్దని ఆదేశాలిస్తున్నా రంటూ వారు ప్రశ్నించారు మరోసారి జరగకుండా చూసుకుంటానని ప్రిన్సిపాల్ ప్రన్సిపాల్ ప్రవీణ తెలుపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లపోయారు.




# విద్యార్థులు సిఎం కప్ పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** విద్యార్థులంతా సీఎం కప్ పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం పట్టణంలోని శివాజీ చౌక్(మంచిర్యాల చౌరస్తా)నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు సీఎం కప్ భారీ క్రీడాజ్యోతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.జాతీయ జెండాను చేతబూని ర్యాలీ నిర్వహించారు.ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థులు తమ జీవితంలో చదువుతో పాటు క్రీడలకు సమప్రధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయి విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు,రూరల్ టు గ్లోబల్ అనే నినాదంతో సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలవడమే ముఖ్యం కాదని,క్రీడలోల పాల్గొనడమే అత్యంత ముఖ్యమని వివరించారు.ఈ పోటీలలో జిల్లా విద్యార్థులు అధిక సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకొని, పోటీలలో పాల్గొనాలని సూచించారు.రెండవ ఎడిషన్ సీఎం కప్ పోటీలను,ఈ నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గ్రామీణ స్థాయి,28 నుంచి 31 తేదీలలో మండల స్థాయి,ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నియోజకవర్గాల స్థాయి 10వ తేదీ నుండి 14వ తేదీలలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడంతో పాటు,రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 26వ తేదీల మధ్యలో నిర్వహించబడతాయని అన్నారు.44 క్రీడాంశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు.ప్రభుత్వం చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సాహిస్తుందని వివరించారు.గత సీఎం కప్ పోటీలలో జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరిచి ఎన్నో పతాకాలను సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు.క్రీడలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా శారీరక,మానసిక ఎదుగుదలతో పాటు,వ్యక్తిత్వ వికాసం అలవరుతుందని అన్నారు. సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని అధికారులను ఆ దేశించారు.రాజస్థాన్ లో జరిగిన ఖేలో ఇండియా పోటీలలో యోగ పోటీలలో కాంస్య పథకాన్ని సాధించిన దిలీప్ ను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి పతకం జ్ఞాపికలను బహుకరించారు.శుభాకాంక్షలు తెలియజేసి,భవిష్యత్తులో మరిన్ని మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భాగంగా,జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని,విద్యార్థులంతా చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడలకు కూడా సమానమైన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.సీఎం కప్ పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,డీఈఓ భోజన్న,సిపిఓ జీవరత్నం,మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్,ఎల్డీం రామ్ గోపాల్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,విద్యార్థులు,ఉపాధ్యాయులు,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న వ్యక్తి పట్టివేత

### కేసు నమోదు

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని చిట్టాపూర్ ఎక్స్ రోడ్డు సాయి దాబా వెనుక గంజాయి సిగరెట్ సేవిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న దాసరి ఉదయ్ కిరణ్‌పై మండల పోలీసు సి బ్బంది తనిఖీ చేసి పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.కాగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం మోహల్లాకు చెందిన బుజిగె లాలప్ప వద్ద కొన్నట్లుగా తెలుపగా పై అధికారుల అనుమతి మేరకు లాలప్ప ఇంట్లో పంచుల సమక్షంలో సోదా చేయగా 584 గ్రాముల ఎండు గంజాయి, పెరట్లో ఒక గంజాయి మొక్క దొరకడంతో సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.





## క్వార్టర్స్‌లో

# పివి. సింధు, సాత్విక్ జోడీ..

## లక్ష్యసేన్ ఇంటికి

కొత్త ఏడాదిలో భారత షట్లర్ పీవీ సింధు గొప్పగా ఆడుతోంది. మలేషియా ఓపెన్ సూపర్ 1000లో దూకుడు కనబరుస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అదిరే ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్స్ బెర్తు సాధించింది. అయితే.. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిల పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేతైన సింధు నిరుడు ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. కానీ, కొత్త ఏడాదిలో తను అనూహ్యంగా పుంజుకుంది. మలేషియా ఓపెన్‌లో చెలరేగిపోతున్న భారత స్టార్ గురువారం ప్రీ క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ తొమొక మియాజకీని చిత్తు చేసింది. టాప్ గేర్‌లో రెచ్చిపోయిన తెలుగుతేజం తొలి సెట్‌ను 21–8తో సునాయసంగా గెలుచుకుంది. రెండో సెట్‌లనూ సింధు ధాటికి ఎనిమిదో సీడ్ తొమొకను 21–13తో అలవోకగా మట్టికరిపించింది. సెమీస్ బెర్తు కోసం తను జపాన్‌కే చెందిన మూడో సీడ్ అకనె యమగుజితో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ ముందే ఇంటిదారి పట్టారు. డబుల్స్‌లో సాత్విక్ – చిరాగ్ జోడీ తిరుగులేని ఆటతో క్వార్టర్స్ చేరింది. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుపొందిన ఈ జంట మలేషియా ఓపెన్‌లోనూ పతకానికి మరింత చేరువైంది. గురువారం జరిగిన 39 నిమిషాల పోరులో జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్(మలేషియా) జంటను 2118, 2112తో ఓడించింది సాత్విక్ – చిరాగ్ ద్వయం.

# ఒకే ఓవర్‌లో 30 రన్స్ కొట్టిన సర్ఫరాజ్..

## అయినా... ఒక్క రన్ తేడాతో ఓడిన ముంబయి

**జైపూర్ :** విజయ్ హజారే ట్రోఫీలో గురువారం ముంబై, పంజాబ్ మధ్య వన్డే మ్యాచ్ రసవత్తరంగా జరిగింది. ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో ఒక్క రన్ తేడాతో పంజాబ్ విజయం సాధించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు కేవలం 216 పరుగులకే ఆలౌటైంది. అన్‌మోల్‌ప్రీత్, రమణ్‌దీప్ సింగ్‌లు హాఫ్ సెంచరీ చేశారు. అయితే స్వల్ప టార్గెట్‌తో బరిలోకి దిగిన ముంబై జట్టు అనూహ్య రీతిలో ఓటమి పాలైంది. ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. కానీ ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. విజయ్ హజారే ట్రోఫీ వన్డే చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డను సొంతం చేసుకున్నాడు. గతంలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా అతిత్ సేథ్ పేరిట ఉన్నది. ఆ బరోడా బ్యాటర్ 16 బంతుల్లో చత్తీస్‌ఘడ్‌పై అర్ధసెంచరీ చేశాడు. 2020–21 సీజన్‌లో ఆ రికార్డు నమోదు అయ్యింది.




గురువారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో టాప్‌గేర్‌లో ఉన్న సర్ఫరాజ్ బౌలర్లను వణికించాడు. అభిషేక్ శర్మ వేసిన ఓ ఓవర్‌లో సర్ఫరాజ్ 30 రన్స్ రాబట్టాడు. అయితే 20 బంతుల్లో 62 రన్స్ చేసి సర్ఫరాజ్ ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, అయిదు సిక్సర్లు ఉన్నాయి. కానీ ఆ తర్వాత పకడ్బందీగా బౌలింగ్ చేసిన పంజాబీ జట్టు ముంబైని కట్టడి చేసింది. పంజాబీ బౌలర్లలో గురునూర్ బ్రార్, మయాంక్ మార్కండేలు చెరి నాలుగేసి వికెట్లు తీసుకున్నారు.

## సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్లో

# నిఖత్ జరీన్



సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ దుమ్మురేపుతోంది. ప్రత్యర్థులపై పంచ్‌లు కురిపిస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.గ్రేటర్ నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్శిటీ వేదిక గా జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టూ టైమ్ వరల్డ్ ఛాంపియన్ నిఖ త్ జరీన్‌తో పాటు వరల్డ్‌ప్ గోల్డ్ మెడలిస్ట్ హితేష్ గులియా, వరల్డ్ ఛాంపియన్ మీనాక్షి హుడా విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. మహిళల 45–48 కేజీల విభాగంలో ఆలిండియా పోలీస్ తరపున బరిలోకి దిగిన మీనాక్షి 5–0తో పంజాబ్ బాక్సర్ కాశిష్ మెహతాను ఓడించింది. మహిళల 48–51 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 5–0తో మణిపూర్‌కు చెందిన లాంచెన్‌బీ చాను టోంగ్‌బ్రామ్‌ను చిత్తు చేసింది. మహిళల 51–54 కేజీల విభాగంలో ప్రీతి 5–0తో హర్మీత్ కౌర్‌పై, సాక్షి 4–1తో పూనమ్‌పై విజయం సాధించారు. పురుషుల 65–70 కేజీల కేటగిరిలో హితేష్ 5– 0 తో పంజాబ్ బాక్సర్ తేజస్విని ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 50–55 కేజీల విభాగంలో వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సిల్వర్ మెడలిస్ట్ పవన్ భార్త్వాల్, అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన టైసన్‌ను ఓడించగా, జదుమణి సింగ్ (50–55 కేజీలు) పంజాబ్ బాక్సర్ నిఖిల్ పై విజయం సాధించాడు. 55–60 కేజీల విభాగంలో సచిన్.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కరణ్‌ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది.




# వైకల్యంతోనూ సుఖమయ జీవితం సాధ్యం!

వైకల్యంతో జీవితం అలవాటు చేసుకోవడం ఎప్పుడూ సులభమైన పని కాదు. శరీరంలో లేదా మనస్సులో వచ్చిన మార్పు ఒక్కసారిగా మన దైనందిన జీవితాన్ని, మన కలలను, మన భవిష్యత్తు ఊహలను కుదిపేస్తుంది. ఆరోగ్యం సహజంగా ఉన్నంతకాలం దాని విలువ మనకు అంతగా అర్థం కాదు. అది కోల్పోయిన తర్వాతే, మనం కోల్పోయిన అవకాశాలు, అలవాట్లు, స్వేచ్ఛ గురించి ఎక్కువగా ఆలోచిస్తాము. అయితే గతాన్ని మార్చలేకపోయినా, ప్రస్తుతం ఎలా జీవించాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది. వైకల్యం ఉన్నప్పటికీ, అర్థవంతమైన, సంతృప్తికరమైన జీవితం నిర్మించుకోవడం పూర్తిగా సాధ్యమే. వైకల్యం ఎదురైనప్పుడు మొదట కలిగే అనుభూతి షాక్. ఆ తర్వాత కోపం, నిరాశ, భయం, అపనమ్మకం లాంటి భావాలు ఒకదాని వెంట ఒకటి వస్తాయి. ఇక నా జీవితం ఎలా ఉంటుంది? నేను మళ్లీ సంతోషంగా ఉండగలనా? అనే ప్రశ్నలు మనసును వెంటాడుతాయి. ఈ దశలో గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే,ఈ భావోద్వేగాలన్నీ సహజమైనవే. వైకల్యం ఒక పెద్ద నష్టం. కాబట్టి దానిపై దుఃఖించడానికి మనకు హక్కు ఉంది. ఆ దుఃఖాన్ని అణచివేయకుండా, దానిని అనుభవించడానికి మనకు మనమే అనుమతి ఇవ్వాలి. బాధను తప్పించుకోవాలని ప్రయత్నిస్తే, అది లోపలే నిలిచిపోతుంది. కానీ దానిని అంగీకరించి ఎదుర్కొంటేనే ముందుకు సాగడం సాధ్యమవుతుంది. వైకల్యాన్ని అంగీకరించడం అంటే జీవితాన్ని వదిలేయడం కాదు. అంగీకారం అంటే పరిమితుల వాస్తవాన్ని గుర్తించి, ఆ వాస్తవంలోనే కొత్త మార్గాలను వెతకడం. మనం కోల్పోయిన దానిపైనే దృష్టి పెట్టుకుంటూ ఉంటే, మనం చేయగలిగిన వాటిని చూడలేము. గతంలో ఉన్న సాధారణ జీవితం తిరిగి వస్తుందనే ఆశతో జీవించడం కన్నా, ప్రస్తుతం ఉన్న పరిస్థితిని స్వీకరించి దానిలోనే అర్థం వెతకడం ఆరోగ్యకరం. నడవలేకపోయినా, చూడలేకపోయినా, వినలేకపోయినా..సంతోషం పూర్తిగా మాయమవ్వాల్సిన అవసరం లేదు. వైకల్యంతోనే ఎదిగి, తమ జీవితాలను ఇష్టపడేలా మలచుకున్న అనేకమంది కథలు మనకు ప్రేరణగా నిలుస్తాయి. వారి అనుభవాలు కష్టకాలంలో మనకు వెలుగురేఖలుగా మారుతాయి. వైకల్యంతో జీవించడంలో మరో కీలక అంశం, మన పరిస్థితి గురించి అవగాహన. ప్రతికూల వైద్య సమాచారంలో మునిగిపోవడం అవసరం లేదు, కానీ మన శరీరంలో ఏమి జరుగుతుందో, మనకు ఎలాంటి పరిమితులు ఉండవచ్చో తెలుసుకోవడం అవసరం. ఆ అవగాహనే మనల్ని సిద్ధం చేస్తుంది, భయాన్ని కొంత తగ్గిస్తుంది, నిర్ణయాలు తీసుకునే శక్తిని ఇస్తుంది. తెలియని దానికంటే తెలిసిన సవాల్‌ను ఎదుర్కోవడం సులభం. వైకల్యం మన జీవితాన్ని మార్చిందనేది నిజం. కానీ అది మన జీవితాన్ని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం లేదు. సృజనాత్మకతతో, నిబద్ధతతో ఆ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఈ ప్రయాణంలో మనమే మనకు న్యాయవాదులుగా మారాలి. పని ప్రదేశాల్లో, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో, సమాజంలో.. మన హక్కులు ఏమిటో తెలుసుకుని వాటి కోసం నిలబడటం అవసరం. బాధ్యత తీసుకున్నప్పుడే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

# సంరక్షక సేవలకు పెరుగుతున్న ఆదరణ

చైనాలో వేగవంతమైన పట్టణీకరణ, వారు ఎంచుకునే సంరక్షణ విధానాలను ప్రభావితం చేసే అంశాలను ఈ అధ్యయనం పరిశీలించింది. ఇందుకోసం నిర్వహించిన చైనా హెల్త్ అండ్ లాంగిట్యూడినల్ సర్వే (సిఎల్‌హెచ్ఎల్‌ఎస్)లోని క్రాస్‌సెక్షనల్ డేటాను ఉపయోగించి, 60 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల 15,854 మంది వృద్ధులను అధ్యయనంలో భాగంగా తీసుకున్నారు. కమ్యూనిటీ సంరక్షణ అవసరాల నమూనాలు, వాటిపై ప్రభావం చూపే కారకాలను విశ్లేషించడానికి లాజిస్టిక్ రిగ్రెషన్ పద్ధతి ఉపయోగించబడింది. మొత్తం నమూనాలో 43.60 శాతం పురుషులు, 56.40 శాతం మహిళలు ఉన్నారు. రోజువారీ జీవన కార్యకలాపాల (ఎడిఎల్) మూల్యాంకనం ప్రకారం సుమారు నాలుగో వంతు వృద్ధులు వికలాంగులుగా గుర్తించబడ్డారు. పట్టణ వృద్ధులు, గ్రామీణ వృద్ధులతో పోలిస్తే, రోజువారీ సంరక్షణ, భావోద్వేగ మద్దతు, సహవాసం, ఆరోగ్య పరిజ్ఞానం, కుటుంబ, పొరుగు వివాదాల పరిష్కారం వంటి కమ్యూనిటీ సామాజిక సేవలకు ఎక్కువ డిమాండ్ వ్యక్తం చేశారు. అయితే వైద్య సంరక్షణ కోసం గృహ సందర్శనలను తప్పిస్తే, పట్టణ మరియు గ్రామీణ వృద్ధులకు వాస్తవంగా అందుతున్న కమ్యూనిటీ సేవల స్థాయి దాదాపు సమానంగా ఉండగా, పట్టణ వృద్ధులకు అందుతున్న సేవల స్థాయి మాత్రం గణనీయంగా తక్కువగా ఉంది. వయస్సు పెరుగుదల, అవివాహిత స్థితి, నివాస ప్రాంతం, సాంస్కృతిక నేపథ్యం, ఆరోగ్య స్థితి, ఆదాయ వనరులు, నివాస అభిరుచులు వృద్ధులు ఎంచుకునే సంరక్షణ విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా 70 సంవత్సరాల పైబడిన వృద్ధులు, అవివాహితులు మరియు మధ్యస్థం నుండి తీవ్రమైన వైకల్యం కలిగినవారు సామాజిక సంరక్షణ సేవలను ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంది. పట్టణాల్లో నివసిస్తున్న వృద్ధులు కూడా గ్రామీణ వృద్ధుల మాదిరిగానే ఇప్పటికీ కుటుంబ ఆధారిత సంరక్షణకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఈ అధ్యయనం స్పష్టంచేసింది. ఈ పరిస్థితి కేవలం చైనాకు మాత్రమే పరిమితమని అనుకోవడానికి వీల్లేదు. క్రమంగా భారత్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించవచ్చు.



# పోరాటాలకు ప్రతిరూపమే ఎర్రజెండా

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/చెన్నూరు :** ప్రజా శ్రేయస్సు కోసం పోరాడే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, పోరాటాలకు ప్రతిరూపం ఎర్రజెండా అని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పర్యటించారు. అనంతరం చెన్నూరు పట్టణ కేంద్రంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఘనత సిపిఐదని తెలిపారు. దున్నేవాడికే భూమి అనే నినాదంతో 4500 మంది ప్రాణ త్యాగాలు చేసి పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. శతవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మం జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగ మల్లేష్, చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, బడికెల మధునయ్య, చెన్నూరు పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు సిద్రాల నారాయణ, శంకర్, తుమ్మ బానయ్య, తిరుపతి పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాయి

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



**ప్రజాపక్షం/కేసముద్రం :** కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయ శక్తులుగా ఎదుగుతాయని, ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతారని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విజయసారథి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడానికే పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, కార్పోరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెట్టడమే లక్ష్యంగా బ్యాంక్‌ల ప్రైవేటీకరణ, విమానాశ్రయాల ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వం పూనుకుంటుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు, పోరాటాలు చేయాలన్నారు. జనవరి 18న ఖమ్మం పట్టణ కేంద్రంలో 5 లక్షల మంది కార్యకర్తలు, దేశ, విదేశీ నాయకులతో నిర్వహించే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు కేసముద్రం మండలం నుండి అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజయసారథికోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మంద భాస్కర్, పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే తత్వానికి ప్రతీక ఎర్రజెండా




### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్ నరసింహ్మా

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** బాంచన్ అనే బానిస ప్రజలను తట్టిలేపి భూమి కోసం భుక్తి కోసం పీడిత జన విముక్తి కోసం అసమానతలు లేని కొత్త సమాజం కోసం ప్రజలలో చైతన్యం నింపిన పార్టీ సిపిఐ అని, ప్రశ్నించే తత్వానికి ప్రతిక ఎర్రజెండా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా అన్నారు. 18 న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగు సిపిఐ వంద సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ పోస్టర్, స్టిక్కర్, ఇతర ప్రచార సామాగ్రిని గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్‌లో బాల నరసింహ్మా ఆవిష్కరించారు. అనంతరం ఖమ్మం సిపిఐ వందేళ్ళ సంబరాల బహిరంగ సభ విజయవంతానికి నిర్వహించిన సన్నాహక సమావేశంలో బాల్ నరసింహ్మా మాట్లాడుతూ వంద వసంతాల సుదీర్ఘ పోరబాటలో కార్మిక కర్షక మహిళ విద్యార్థి గిరిజన కవులు కళాకారులు ఉద్యోగ ప్రజా బహుల్యంతో ఎన్నో విజయాలు సాధించిందని చట్టాలకు రూపకల్పన చేసిన శ్రమజీవుల చెమట చుక్కలతో అమరవీరుల రక్తార్పణతో ఎరుపెక్కిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జాతీయస్థాయిలో 25 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రారంభమై ఏడాది కాలంగా రాష్ట్ర, జిల్లా మండల గ్రామస్థాయిలలో వందేళ్ల ఎర్రజెండా సంబరాలు జరుపుకుంటూ ఈనెల 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభతో ఎర్ర కాంతులు ఎగజిమ్ముత్తు భవిష్యత్తు పోరాటాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఖమ్మంలో జరిగే సిపిఐ భారీ బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సిపిఐ అగ్ర నాయకులు జాతీయ కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు వామపక్ష పార్టీల అగ్ర నాయకులు తరలి రానున్నాని అన్నారు. జనవరి 19న జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తూ 21వరకు ఖమ్మంలో సిపిఐ జాతీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నదన్నారు. బహిరంగ సభకు మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, కొండికంటి పద్మావతి, పట్టణ కార్యదర్శి కోటకదిర నరసింహ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, మహేష్, గంటల శ్రీను, ఖలీం, లక్ష్మణ్, శివ, ఇందిర, భార్గవి, నవదీప్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ అక్షరం ప్రజల పక్షాన...



### 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణలో కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాపక్షం దిన పత్రికలో వచ్చే ప్రతీ అక్షరం ప్రజల పక్షానా నిలబడాలని, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాపక్షం 2026 క్యాలెండర్‌ను బుధవారం రాత్రి సుజాతనగర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషాతో కలిసి ఆవిష్కరించారు. సిపిఐ శత వసంత ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రచార జాత ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈరోజుల్లో ఆ విలువలను కాపాడే నిలువుటద్దంగా, అన్యాయాన్ని ప్రశ్నించే పత్రికగా ప్రజాపక్షం నిలవాలన్నారు. పాలకులు చేసిన వాగ్దానాలు అనుక్షణం అక్షరూపంలో గుర్తు చేస్తూ ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అర్హుల దరి చేరేందుకు, అధికారుల అలసత్వాన్ని నిలదీస్తూ, వారు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండేలా అక్షర యుద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పిఎస్.ఆనంద్, సుజాతనగర్, పాల్వంచ రిపోర్టర్లు మేకల వెంకటేష్, వెంకటనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సలగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య ధస్రు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, గనిగల వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కొమారి హన్మంతరావు, ఫహీం, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలు, కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటాలు

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పేద ప్రజల, కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది సిపిఐ అని పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో బహిరంసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని దుబ్బ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిట్టర్స్ యూనియన్ ఎఐటియుసి కార్యాలయంలో ఖమ్మం సభ విజయవంతానికి సన్నాహక సమావేశంలో ఓమయ్య అధ్యక్షత నిర్వహించగా సుధాకర్ హాజరై మాట్లాడారు. వంద సంవత్సరాల సందర్భంగా ఖమ్మం పట్టణంలో 5 లక్షల మంది ప్రజలతో, పదివేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్లతో ఎర్రదండు కవాతు ఉంటుందన్నారు. బహిరంగ సభకు జిల్లా నుంచి కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అలీ ఇమ్రాన్, అనిల్, స్రవంతి, సాయమ్మ, రాధకుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




# బకాయి బిల్లులను చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బకాయి బిల్లును చెల్లించాలని ఎఐటియుసి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ గత ఆగస్టు నుండి మధ్యాహ్న భోజన కార్మికులు పిల్లలకు వంట చేసి పెట్టిన బిల్లులు జిల్లాకు దాదాపు 8 కోట్ల రూపాయలు బకాయిలున్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర ఎనిమిదిన్నర రూపాయలుంటే ప్రభుత్వం ఆరు రూపాయలకు ఇవ్వటం సరికాదని, కిందిస్థాయిలో హెడ్మాస్టర్లు ఎంఈఓలు కక్ష్య గట్టి మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కారణాలతో అకారణంగా తొలగిస్తున్నారన్నారు. సంక్రాంతి వరకైనా కార్మికులకు రావల్సిన బకాయి బిల్లులు చెల్లించాలని లేని యెడల సంక్రాంతి తర్వాత సమ్మెకు వెళుతామని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, అధ్యక్షురాలు స్రవంతి, నాయకులు సాయమ్మ, నరేష్, నాగలక్ష్మీ, గంగామణి, సుజాత, గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సిపిఐ సభ సందేశం

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఖమ్మంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు సిపిఐ కార్యాలయం వద్ద ర్యాలీని సిపిఐ నగర కార్యదర్శి ఎసెకె జానిమియా జెండా ఊపి ప్రారంభించారు. సిపిఐ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ బైపాస్ రోడ్డు మీదుగా బస్‌డిపో, మయూరిసెంటర్, పాత బస్టాండ్, జెడ్పిసెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సిపిఐ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీని ఉద్దేశించి సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే ఈ సభ సందేశాన్ని ఇంటింటికి ప్రతి వ్యక్తికి తెలిపే కార్యక్రమంలో భాగంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ర్యాలీలో సిపిఐ జిల్లా నాయకులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, గాదె లక్ష్మినారాయణ, నూనె శశిధర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, జ్వాలా నర్సింహారావు, మమత, శంకర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# అత్యంత గొప్ప పథకం 'కల్యాణ లక్ష్మి'

## నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** అత్యంత గొప్ప పథకం కల్యాణలక్ష్మి అని నిరుపేద తల్లిదండ్రులకు వరం లాంటిందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కల్యాణ లక్ష్మి , షాదీ ముబాకర్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీకి ముఖ్యఅతిథిగా మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కాగా 66 మందికి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ. 66,07,656 విలువైన చెక్కులను అందచేయగా, 22 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు రూ. 11,18,500లను లబ్ధి దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియమ మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు నెలల్లో చెక్కులు అందచేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సినవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తనకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలకు ఉచితంగా సన్న బియ్యం, నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఏకైక రాష్ట్ర తెలంగాణ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని అందుకు కారణం మన స్టేషన్ నియోజకవర్గమే అన్నారు. నియోజకవర్గంలో 93 శాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సినవసరం లేదని అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కొంత మంది హౌలా గాళ్లు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడటం వాళ్లకు అలవాటైందన్నారు. ఒకాయన నేను 100 పడకల ఆసుపత్రి తెచ్చాను అంటాడు. మళ్లీ స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ కాకుండా అడ్డుపడ్డాడని అంటాడు. ఇలా మాట్లాడే వాళ్లకు చదువు వస్తుందా.. బుద్ధి, జ్ఞానం ఏమైనా ఉన్నాయన్నారు. జనవరి 2024 తరువాత వచ్చిన జీవోల ఆధారంగానే నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనుల వివరాలను జీవో కాపీలతో సహా మీడియా ముందు, ప్రజల ముందు పెట్టానన్నారు. అయినా ఇలా మాట్లాడే వారిని ఏమనాలో నాకు అర్థం కావడం లేదన్నారు. నాకున్న ఏకైక లక్ష్యం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రగతి, ప్రజల సంక్షేమం మాత్రమమేనన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ లావణ్య బూర్ల శంకర్ రజాక్ యాదవ్, డాక్టర్ కిషన్ రాజు, గట్టు రమేశ్, సింగపురం వెంకటయ్య శిరీష్‌రెడ్డి, చింత ఎల్లయ్య, శ్రీరాముల రమేశ్, రవి, సర్పంచులు, ఉపసర్పంచులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## యూరియా క్యూలైన్లకు చెక్ పెట్టిన యాప్: కలెక్టర్



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** జిల్లాలో యూరియా కొరత లేదని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలంలోని హాకా గోపాల్ నగర్, పీఏసీఎస్, ఎంజీసీ కేంద్రాలను సందర్శించి యూరియా నిల్వలు, అమ్మకాలు సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగాలని, యూరియా బుకింగ్ యాప్ ద్వారానే అమ్మకాలు జరగాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అవసరమైన యూరియా అందేలా నిరంతర పర్యవేక్షన ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలున్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల కోసం ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటియూసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు నాయకత్వంలో డిస్ట్రిక్ట్ మార్కెట్ ఆఫీసర్ సురేఖకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా చెన్న కేశవులు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌లలో కీలకంగా పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కనీస సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం కార్మికులకు అందించాల్సిన రెండు జతల బట్టలను జనవరి 26 నాటికి అందించాలని, అలాగే నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ పర్పస్ రూముల భవనంలో హమాలి కార్మికుల కోసం ప్రత్యేక హాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిఎంఓ సురేఖ సమక్షంలో నెక్కొండ మార్కెట్ సెక్రటరీ కృష్ణ మీనన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఇలాంటి పోరాటాలు కొనసాగుతాయని ఏఐటియూసి నాయకులు స్పష్టం చేశారు.

## ఇవిఎం గోదాములను కలెక్టర్ తనిఖీ




**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జిల్లా ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎసిపి పింగిలి



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో 'ప్రజాపక్షం' దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ... ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకము అన్నారు. అదే విధంగా గంజాయి, మాదకద్రవ్యాలను నియంత్రించేందుకు పోలీసులకు సహకారం అందించాలని పత్రికా మిత్రులను కోరుతున్నట్లు తెలిపారు. సమాజ సేవకు, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. అందరి సమిష్టి కృషితోనే గ్రామాలు దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజాపక్షం పత్రిక ప్రజలలో ఎంతో ఆదరణ పొందిందని, భవిష్యత్తులో మరింత ఆదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ హరికృష్ణ, ఎస్ఐ మధు, కమలాపూర్ ప్రజాపక్షం రిపోర్టర్ వెల్ది కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడేది ప్రజాపక్షం



**ప్రజాపక్షం/రాయపర్తి:** ప్రజల పక్షాన నిలబడే పత్రిక ప్రజాపక్షం దినపత్రిక అని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్‌ను ప్రజాపక్షం రిపోర్టర్ గారె సందీప్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిర్విరామంగా ప్రజాపక్షం దినపత్రిక పోరాటం చేస్తుందని అన్నారు. ప్రజాపక్షం యాజమాన్యానికి, ప్రజాపక్షం విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్‌టి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్య సురేందర్ రాథోడ్, మండల నాయకులు లేతాకుల రంగారెడ్డి, ఐత రాంచందర్, గజవెల్లి ప్రసాద్, చిలువేరు సాయి గౌడ్, సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, గారే నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## 18న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి/వేలేరు :** ఖమ్మం పట్టణంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు సభకు ఈనెల 18న దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు హాజరై సభకు విజయవంతం చేయాలని ముల్కనూర్ లోని అంబేద్కర్ కూడలి వద్ద పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.ఈ సభలో 100 సంవత్సరాల పార్టీ ఆవిర్భావ నుండి చేసిన కార్యక్రమాలు ఉద్యమాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తులో పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా సిపిఎం వామపక్ష పార్టీల జాతీయ కార్యదర్శులు అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. అట్టి సభలు విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంచాల రమాదేవి, మండల కార్యదర్శి ఆదరి రమేష్, నాయకులు సుంచు కుమారస్వామి, మార్పు సంజీవరెడ్డి, బోడ బాలరాజు, కవంపల్లి కిషన్, చిలుక శీను, సన్నిల రవి, పిట్టల రమేష్, స్వామి, అరుణ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18 న ఖమ్మంలో జరుగు సిపిఐ జాతీయ శతజయంతి ఉత్సవాల ముగింపును జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ కోరారు.గురువారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ మండలకార్యదర్శి గడ్డమీది శంకరయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅథిధిగా హాజరై వాల్ పోస్టురు ఆవిష్కరించి మాట్లాడారు.సిపిఐ పార్టీ ఆవిర్భవించి సమకాలీన,రాజకీయ పరిస్థితులు,మతోన్మాద ప్రమాదం,పెరుగుతున్నఆర్థిక అసమానతలు,కార్మిక కర్షక,తదితర విషయాల గూర్చి అనేక పోరాటాలు చేసి చరిత్రలో నిలిచిపోయి 100 సంవత్సరాల సంధర్భంగా శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయుటకు వేలేరు మండలం నుండి అధిక సంఖ్యలో హాజరై విజవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఖమ్మంలోని ఎస్ ఆర్ ఆండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈసభకు మండలం నుండి అధ్యకంగా తరలి రావాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,సిపిఐ మండలకార్యదర్శి గడ్డమీది శంకరయ్య,సిపిఐ జిల్లాసమితి సభ్యులు మేకల శంకరయ్య పాల్గొన్నారు.

## సిపిఐ శతజయంతి సభకు భారీగా తరలిరావాలి

### ఎఐటియుసి జిల్లా డిప్యూటి సెక్రటరి గుంపెల్లి మునీశ్వర్



**ప్రజాపక్షం/నర్సంపేట :** సంఘటిత , అసంఘటిత రంగంలోనీ కార్మికులు, హమాలీలు, కూలీలంతా సిపిఐ వందేళ్ళ జయంతి సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే సభకు తరలిరావాలని ఎఐటియూసి జిల్లా డిప్యూటి సెక్రటరి గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణం నెహ్రూ నగర్ లో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం బిసి హక్కుల సాధన సమితి జిల్లా ఆఫీసు బేరర్ ఇల్లందుల సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి, రజక సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి ఆరెల్లి ప్రభాకర్ లతో కలిసి మునీశ్వర్ మాట్లాడుతూ హమాలి ఇతర కార్మికులు, మహిళా కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎఐటియూసి ఖమ్మంలో జరిగే సిపిఐ సభ జయప్రదం చేయాడనికి ఇతర సామాజిక సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సకల రంగాల్లో బిసిల వాటా బిసిలకు దక్కాలనీ సిపిఐ బిసిల రిజర్వేషన్లు ఇతర హక్కుల కోసం నిలబడిందన్నారు. అలాంటి సిపిఐ ఈ దేశంలో ఏర్పడి వందేళ్ళు పూర్తి చేసుకొన్న సందర్భంగా బిసిలంతా ఖమ్మం సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సంకరనేని బాలనర్సయ్య , అన్నం వీరాస్వామి, కందికొండ సాంబయ్య, ఇల్లందుల సాంబయ్య సీనియర్ కమ్యూనిస్టు నాయకులకు పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వేమునూరి వెంకటాచారి, జన్నారం మొగిళి, జగన్నాధుల రమేష్, ఆవుల నరేందర్, గుంటోజు పూజ, ఆవుల విజయలక్ష్మి , గువ్వా బుచ్చక్క, ఎస్ కే యాఖూబీ, ముత్యాల పద్మ, ఎడ్ల నాగులు, రమేష్, బిక్షపతి, కందికొండ సాంబయ్య, కుమారస్వామి, ఆకుల రెడ్డయ్య, చీకటి పాని తదితరులు పాల్గొన్నారు.

## రెండుపడకల గదుల ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఇందిరమ్మ రెండు పడలక గదుల నిర్మాణంలో భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్‌గా నిలిచే విధంగా అధికారులు సమన్వయం తో పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారుల ను ఆదేశించారు.గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణం పై పంచాయితి రాజ్ ఇంజనీరింగ్,గృహ నిర్మాణ,మున్సిపల్,ఎంపిడిఓలతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భూపాలపల్లి నియోజక వర్గాన్ని మొదటి స్థానంలో ఉంచే విధంగా అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇండ్ల నిర్మాణంలో ఫోటో క్యాప్చర్ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిడివోలు,గ్రామ పంచాయితి కార్యదర్శులు,గృహనిర్మాణ శాఖ అధికారులు నిరంతరం పరిశీలనచేసి వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ మాట్లాడుతూ..ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం చేపట్టేందు కు మహిళ స్వయం సహయక సంఘాల ద్వారా రుణ సదూపాయం కల్పించాలని తెలిపారు. ఇండ్లు నిర్మించుకోలేని స్థోమత లేని లబ్ధిదారులకు లక్ష రూపాయల రుణ సహాయం అందించాలని పిఆర్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కర్చులపై సమగ్ర నివేధిక అందించాలని నిదుల కొరత రాకుండా చూడాలని అదికారులను కలెక్టర్ అదేశించారు.ఈ సమావేశంలో స్థాని సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి ,గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, పిఆర్ ఈఈ వెంకటేశ్వర్లు,హౌజింగ్ డీఈ శ్రీకాంత్,ఎంపిడిఓ, భూపాలపల్లి కమిషనర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

**ప్రజాపక్షం/గూడూరు:** తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం సంక్రాతి సెలవులను ప్రకటించింది.రెపు నుంచి ఈనెల 16 వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాతి సెలవులు ఇసున్నట్లు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రకంటించిన విషయం అందరికి తెలిసిన విషయమే ఈ సెలవులు ప్రభుత్వ ప్రైవేటు వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొందిజనవరి 16వ తేదీ కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్చిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసేకుంటారు. కనుమ రోజున ఉత్యవాలు పండుగ సంబరాలు జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** శ్రీ అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతర త్వరలో ప్రారంభం జరుగుతుందని జాతర కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1978వ సంవత్సరం నుండి జాతర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాతర వ్యవస్థాపకులు, శివసత్తి, పూజారి కోదూరి రాజలింగమూర్తికి పూనకం ద్వారా అమ్మవారు కలలో పసుపు కుంకుమలతో కనబడగా దీనితో పెద్ద యెత్తున పూజారులతో అమ్మవార్లు సమ్మక్క సారలమ్మలను నిలబెట్టినట్లు తెలిపారు. ఈ జాతరకు మంత్రి కొండా సురేఖ, ఎంఎల్‌ఏ నాగరాజు ప్రత్యేక శ్రద్ధతో జాతర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు దాదాపు 5లక్షల మంది భక్తులు వస్తారని జాతర వ్యవస్థాపక చైర్మన్ కోదూరి బిక్షపతి, దాసి రాందేవ్ తెలిపారు. జాతర విజయవంతం కోసం తమ సహకారం అందించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు.

## సిపిఐ ఖమ్మం సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు భారీగా తరలి కావాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గురువారం హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ అంబేద్కర్ సెంటర్ లో వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ గ్రామం, శాఖల నుండి సీపీఐ కార్యకర్తలు,నాయకులు ఖమ్మం సభకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శ మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సబ్యులు ఎన్ రాజమౌళి, సీనియర్ నాయకులు గోపరాజు భద్రయ్య, గాజుల లింగమూర్తి, గోపు బుచ్చిరెడ్డి, ఆర్టీసీ దామోదర్, గాజుల సుదర్శన్, బుర్ర ప్రభుదాస్, భారత్ బచావో నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## పరకాల అభివృద్ధికి సహకరించాలి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.అలాగే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో లోని చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గురువారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ టీసి బస్టాండ్ చుట్టు పరిసరాల ప్రాంతాలను అధికారులుతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో లోని చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి వారి యొక్క జీవనదారం కోల్పోకుండా ప్రత్యామ్నాయంగా స్థలం ఏర్పాటుకు త్వరితగతిన కేటాయించాలని అధికారులను ఆదేశించారు. పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి, ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం,గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అన్నారు.

## చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రైతులు సాగుచేసుకున్న యాసంగి పంటలకు చిట్ట చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి మండలం భీమ్ ఘనపూర్ చెరువునుండి యాసంగి పంటలకు పంబాపూర్ చెరువులో పూలు చల్లి దిగువ గ్రామాలకు గేట్ వాల్ తిప్పి పంటలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు సాగు నీరు అందించడమే సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు యాసంగి పంటలకు చిట్ట చివరి ఆయకట్టు వ రకు సాగునీటిని అందించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు, రైతులు పాల్గోన్నారు.

## భూ భారతిలో మోసాలు.. ఇంటిలిజెన్స్ ఆరా

**ప్రజాపక్షం/జనగామ:** భూ భారతిలో జరుగుతున్న మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్రంలో పలు జిల్లాలో జరిగిన మోసాలపై ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. గురువారం జనగామ జిల్లాలోని తహశిల్దార్ కార్యాలయంలో భూ భారతి మోసాలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తోపాటు ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఈ మోసాలు జరుగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి భూ భారతి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. భూమి రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి సీజు విషయంలో ప్రభుత్వానికి చెందాల్సిన రుసుము చివరి అంకెను తీసేసి మిగతా అమౌంట్ చెల్లిస్తూ రిజిస్ట్రేషన్ దారుల వద్ద నుండి మాత్రం అధికంగానే వసూలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడవుతుంది. ఉదాహరణకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1 లక్ష 20వేలు ఉంటే చివరి సున్నాలు తీసేసి రూ.12వేలు మాత్రమే ప్రభుత్వానికి వెళ్తుండగా రిజిస్ట్రేషన్ దారులకు మాత్రం రూ.1లక్ష 20వేలు పేపర్‌పై కనిపించేలా ప్రింట్ తీసి వసూలు చేస్తున్నారు. అంటే 1లక్ష 8వేల వరకు అక్రమంగా తమ ఖాతాలలో జమచేసుకుంటున్న పరిస్థితి. ఆన్‌లైన్ ద్వారానే ఈ చెల్లింపులు జరుగుతున్న నేపథ్యంలో ఇంటర్నెట్‌లోని లొసుగుల ఆధారంగా కొందరు మీ సేవ నిర్వాహకులు ఈ తతంగానికి పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల యాదాద్రికి చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ విషయంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన నగదు తప్పుగా ఉన్నట్లుగా జనగామ రెవెన్యూ అధికారులు గుర్తించారు. నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాలలో రాకెట్ల భూ భారతి రిజిస్ట్రేషన్ ఫీజు మోసాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. రిజిస్ట్రేషన్ల నమోదు చేస్తున్న వ్యక్తి పోలీసుల అదుపులో ఉండగా ఆయనను మీడియా ముందు ఉంచితే మాత్రం ఇంకా అనేక విషయాలు తెలిసే అవకాశం ఉంది.

## విద్యార్థి యువతలో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకే సిఎం కప్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** విద్యార్థి, యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడలపట్ల ఆసక్తి కలిగించేందుకు సిఎం కప్ క్రీడలు మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిఎం కప్ టార్చ్‌ని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలంలో ఈ క్రీడా జ్యోతిని తీసుకువెళ్ళి ఆయా ప్రాంతాల్లో యువత, విద్యార్థులను క్రీడపట్ల మక్కువ పెంచేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ క్రీడా జ్యోతి జిల్లాలోని అన్ని మండలాల్లో తిరిగి శుక్రవారం మహబూబాబాద్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, బిసి ఎల్ఫేర్ అధికారి శ్రీనివాస్, డివైఎస్ఓ జ్యోతి, అంజయ్య, శంతన్ రామరాజు, శ్రీనివాస్, సురేష్, మురళీ, శ్రీను, పోతురాజు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సిపిఐ శాతాబ్ది ఉత్సవాల విజయవంతానికి బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరంలో ఈనెల 18న నిర్వహించ నున్న సిపిఐ శాతాబ్ది ఉత్సవాల విజయవంతానికి ఖమ్మంరూరల్ మండ లంలో గురువారం బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని పోలెపల్లి సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ జెండా ఊపి ప్రారంభిం చారు. ర్యాలీ పల్లెగూడెం వైపు నుంచి తీర్థాల మీదుగా పడమటితండా, కామంచికల్, దారేడులో తిరిగింది.మంగళగూడెం మీదుగా తనగంపాడు, గూడూరుపాడు మీదుగా ఎంవీ,పాలెం, కాచిరాజుగూడెం, ఆరెకోడు, ఆరె కోడుతుండా, చింతపల్లిలో కొనసాగింది. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకుడు జగన్, పాలేరుని యోజవకర్గ సిపిఐ నాయకుడు లింగా వెంకటనారాయణ పాల్గొన్నారు.

## ఖమ్మం సభ విజయవంతానికి కృషి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద వసంతాల సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ నాయకులు గురువారం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సత్తుపల్లిలోని వెంగళరా వునగర్ నుండి ప్రారంభమైన ర్యాలీ పాత సెంటర్ లోని కృష్ణ టాకీస్, రింగ్ సెంటర్, వేంసూర్ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు చేరు కుంది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారా యణ మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే సిపిఐ శత వసంతాల సభను విజయవంతం చేయాలని, అందుకోసం సిపిఐ ప్రజా సంఘాలు, శ్రేణులు విస్తృతంగా పనిచేయాలన్నారు. ర్యాలీలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సముద్రాల సుధాకర్, దారా భీమయ్య, సుధాకర్, కాగితం వెంకటేశ్వర్లు, బద్రు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు, రాజశే ఖర్, ఫుట్పాత్ వ్యాపారుల సంఘం నాయకులు కృష్ణ, శ్రీను, కృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షులు చెరుకు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల ప్రజలు తరలాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఈ నెల18న ఖమ్మంలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ వంద వసంతాల మహా బహిరంగ సభలో పెద్దఎత్తున అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ గురు వారం కొణిజర్ల మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కొణిజర్ల మల్లుపల్లి రామనరసయ్యనగర్ అన్నవరం తుమ్మలపల్లి బోడియా తండా తనికెళ్ల, అమ్మపాలెం, రాజ తండా, చిన్న గోపతి, పెద్ద గోపతి, రెడ్డిగూడెం, సీతారాంపురం, కొత్త కాసారం, పాత కాసారం, చిన్నమునగాల, పెద్దమునగాల, గోపారం, బస్వాపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంక టేశ్వర్లు, మునిగ కోటేశ్వరరావు, పాపగంటి సుదర్శన్, యాసా వెంకటే శ్వర్లు, కట్ల సంత్యం, గడల శ్రీనివాసరావు, వెంపటి పరశురాములు, దేరం గుల లక్ష్మయ్య, గుమ్మడిల్లి సైదేశ్వరరావు, వేములకొండ రమేష్, కంప సాటి వెంకన్న, ముత్తయ్య, గుడ్డుగర్ల శ్రీనివాసరావు, రాంబాబు, లాజరు, పెద్దమల రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విస్తృత పర్యటన




**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం విస్తృతంగా పర్యటించారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ పథకం కింద లబ్ధి దారులకు మంజూరైన చెక్కులు అందచేశారు. బాలరాజుగూడెం పంచా యతీ దిబ్బగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. అనంతం పట్వారిగూడెం ప్రధాన సెంటర్ నందు రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. అశ్వారావుపేట మండల కేంద్రంలో సిఎం కప్ టార్చ్ ర్యాలీను ప్రారంభించారు. అశ్వారావుపేటకు చెందిన జూజం బంగారురావు కుటుంబానికి, అదమ్మపేట మండలం రంగ వారిగూడెం గ్రామానికి చెందిన తంగేళ్ళముడి పోలయ్య కుటుంబానికి రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందచేశారు. దమ్మపేట మండలం అక్కినేపల్లి పంచాయతీ వెంకటరాజపురం గ్రామంలో నిర్వహిం చిన ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొని విద్యుత్ అధికారులతో కలిసి కరెంట్ సమస్యల పరిష్కారం, మెరుగైన సేవలు, ప్రభుత్వ రాయితీల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజాపక్షం దినపత్రిక క్యాలెం డర్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని రఘునాథపాలెం, కొర్లబోడుతండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరా భ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. గురువారం రఘునాథపాలెం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్ర మంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు, సిడిపివో వీరభద్రమ్మ, హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొని చిన్నారు లకు అక్షరాభ్యాసం చేశారు. యూనిఫాం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు ఎస్‌కె నజ్మా, పార్వతి, లక్ష్మి, ఉపవాణి, కవిత, ఉషారాణి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. కొర్లబోడుతండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి యూనిఫాం పంపిణీ చేశారు.

# క్రీడా నైపుణ్యాల వెలికితీతే లక్ష్యం

ఎమ్మెల్యే కూనంనేని




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** తెలంగాణలో ఉన్న క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయ డమే లక్ష్యంగా సిఎం కప్ క్రీడా పోటీలు నిర్వ హిస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. సిఎం కప్ టోర్నీలో భాగంగా యువజన క్రీడల ఆధ్వర్యంలో గురువారం సిఎం కప్ టార్చ్ ర్యాలీ పోస్టాఫీస్ సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అన్ని స్థాయిల్లో కలిపి మొత్తం 44 విభాగాల్లో క్రీడలు ఉంటాయని, తెలంగాణలోని క్రీడాకారులు ఒలంపిక్ స్థాయిలో పతకాలు సాధించాలనే ఉద్దే శ్యంతో సిఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ప్రతీ ప్రాంతంలో జరిగే క్రీడలను ఆయా ప్రాంతాల అధికారులు విజయవంతం చేసేం దుకు అంతా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి ఎం పరం దామ రెడ్డి, యుగేందర్‌రెడ్డి, మహేందర్, వెంక టేశ్వరరావు, ఖాసీం హుస్సేన్, స్వాతిముత్యం, బాబ్జి, జాన్సన్, శ్రీధర్, మొగిలి, రఘు, కోచ్‌లు డానియేల్, కళ్యాణ్, మల్లిఖార్జున్, నాగేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితానికి పత్రికలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పత్రికలు సమాజ హితానికి పాటుపడే ఆయుధాలుగా ఉండాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ప్రజాపక్షం దినప త్రిక 2026 క్యాలెండర్, డైరీని ఆయన గురువారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడాతూ ప్రస్తుతం యువత సమాజానికి ఎంతో అసరమని, అలాంటి యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, పెను ప్రమాదంగా మారిన ఈ అంశంపై పత్రికలు విధిగా వార్తా కథనాలు రాయాలని, డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు పోలీసులు చేస్తున్న కృషిలో భాగస్వాములై అక్షర చైతన్యా నికి మరో అడుగు ముందుకేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పిఎస్ ఆనంద్, పినపాక నియోజకవర్గ ఇంచార్జ్ వంగూరి నాగేశ్వ రరావు, చంద్రుగొండ, బూర్గంపాడు విలేకరులు వెలగల మదన్ మోహన్, బర్ల జోషి తదితరులు పాల్గొన్నారు.



## తలసేమియా రహిత సమాజమే లక్ష్యం

సంకల్ప సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ గార్గె



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** తలసేమియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు రాజేష్ గార్గె తెలిపారు. గురు వారం ఖమ్మంలో సంస్థ కార్యాలయంలో తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ గార్గె మాట్లాడుతూ రక్త దాతలు తలసేమియా చిన్నారుల కోసం ముందుకు వచ్చి రక్తం దానం చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులకు ఏదో రకంగా సేవ చేస్తున్న ప్రతిఒక్కరికి సంకల్ప సంస్థ తరుపున ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈనెల 12న తలసేమియా జాతీయ సొసైటీ బాధ్యు లు డాక్టర్ ఆరోరా బృందం ఖమ్మం వస్తున్నారని సంకల్ప సంస్థతో కలిసి వ్యాధిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం తలసేమియా చి న్నారుల కోసం సేవలు అందించేందుకు ముందుకు వస్తున్న దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి ఎన్. నర్సయ్య, వైద్యులు నారాయణమూర్తి, లక్ష్మి దీప, సంస్థ ఫౌండర్ పి. అనిత, ఉపాధ్యక్షురాలు పావని, కోశాధికారి పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్, ఉపేందర్, అనురాధ, షివెన్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 15 నాటికి ఆధునీకరణ పనులు పూర్తి

మిర్చి మార్కెట్ యార్డు ఆధునీకరణకు రూ. 155.30 కోట్లు మంజూరు

పనులు పరిశీలించిన రాష్ట్ర వ్యవ- సాయ కార్యదర్శి సురేంద్రమోహన్,



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** మిర్చి మార్కెట్ యార్డు మొదటి దశ ఆధునీకరణ పనులు ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు. ఖమ్మంలోని మిర్చి మార్కెట్ యార్డులో చేపట్టిన ఆధునీకరణ పనులను గురువారం వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ కలె క్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ మిర్చి మార్కెట్ యార్డు ఆధునీకరణలో భాగంగా రాబోయే మార్కెట్ సీజన్ లోపు మిర్చి తరలిం పుకు అనుకూలంగా ఉండేందుకు అవసరమైన మార్కెట్ షెడ్స్, ఇతర నిర్మాణ పనులు ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలన్నారు. రైతులు మార్కెట్ లోకి రాగానే మంచి అనుభూతి పొందాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అన్ని వసతులు కల్పించా లన్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఆ రోజు ధర ఎల్ఈడి స్క్రీన్లలో ప్రదర్శించాలన్నారు. ఏజెంట్, ట్రేడర్, రైతులకు లాభసాటిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవేశం వద్దనే ఏ లాట్‌కు వెళ్లాలి, ఎంత టైం పడుతుంది, స్లాట్ బుకింగ్, రష్ గురించి రైతుకు పూర్తి సమాచారం ఉండాలన్నారు. మార్కెట్‌లో సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలని, రైతులు రాత్రి బసచేస్తే అందు కు తగినట్లు వసతులు కల్పించాలన్నారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం, క్యాంటిన్, సోలార్ పవర్, వేయింగ్ బ్రిడ్జి ఏర్పాట్లు ఉండాలన్నారు. నీడ నిచ్చే మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ మిర్చియార్డు ఆధునీకరణకు ప్రభుత్వం రూ.155.30 కోట్లు కేటాయించిందని ఆధునీకర ణ పనులు రెండుదశల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశలో రూ.114.96 కోట్లు పనులు జరు గుతున్నాయన్నారు. ఆధునీకరణలో భాగంగా ఏడు నిర్మాణ పనులు ప్రారంభించి ఐదు షెడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంక్, ఆర్‌వోప్లాంట్, ప్రహారీగోడ, సంపు, పంపు రూము, అగ్నిప్రమాదాల నియంత్రణకు ఫైర్‌ఫైటింగ్ పైప్స్‌పనులు జరుగుతున్నాయన్నా రు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యర గర్ల హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా ఉద్యాన వన అధికారి మధుసూదన్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. అనం తరం మార్కెట్ కార్యాలయంలో సమావేశం నిర్వ హించి పలు అంశాలపై చర్చించారు.

# దివ్యాంగుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో దివ్యాం గుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్స వాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరే ట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమా ల అమలులో ఖమ్మంజిల్లా యంత్రాంగం ముం దంజలో ఉంటుందన్నారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకంనకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగ జంటలకు సం బంధిత వివాహ ప్రోత్సాహకం త్వరగా అందేలా చూడాలన్నారు. స్కాలర్‌షిప్, దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన దివ్యాంగులందరికీ పారదర్శ కంగా సదరం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో కంటి చూపు సమస్య ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని దీనిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. వీధి వ్యాపారాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వాలని ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపాలిటీలకు ఆదే శాలు జారీచేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారుల్లో ఐదుశాతం దివ్యాంగులకు అమలయ్యే లా చర్యలు చేపట్టామన్నారు. ఖమ్మం జిల్లాలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు త్వరలో చర్యలు తీసు కుంటామన్నారు. దివ్యాంగ క్రీడాపోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి ఆటల పోటీ ల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు బహుమ తులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విజేత, డిప్యూటీ డిఎం హెచ్ఓ వేణుమాధవ్, డిహెచ్ఇడబ్ల్యూ సమీన్, దివ్యాంగ సంఘ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రైవేటీకరిస్తే నష్టపోయేది సామాన్యులే

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరిస్తే నష్టపోయేది సామాన్య, మధ్యతరగతి ప్రజలేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రభుత్వ బ్యాంకుల పరిరక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపిటి బిఇఎఫ్) తలపెట్టిన జన జాగృతి యాత్ర ఖమ్మం నగరానికి చేరుకుంది ఈ సందర్భంగా బాగం హేమంతరావు, ఏఐయుబిఈఏ ప్రెసిడెంట్ రవీంద్ర నాథ్ లు మాట్లాడుతూ జన జాగృతి యాత్ర కెనరా బ్యాంకు ఉద్యోగి ఉమా మహేష్ హైదరాబాద్‌లో మొదలుపెట్టారన్నారు. ఈ సైకిల్ యాత్ర ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాన్ని నిలిపివేయడమేన న్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో అవసరమైన మేర నియమాకాలను వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలన్నారు. ప్రైవేటీకరణతో ఎక్కువగా నష్టపోయేది సామాన్య ప్రజలేన న్నారు. కేంద్ర ప్రభుత్వం బడా బాబులకు రుణమాఫీలను వెంటనే నిలిపివే యాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏపి టిబిఈఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమద్‌ఖాన్, ఖమ్మంజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి రాజేష్, ఉపాధ్య క్షులు శ్రీకాంత్, కుమార్, ఏఐటియుసి నాయకులు శివరామకృష్ణ, లక్ష్మి నా రాయణ తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులో వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సోషల్ మీడియాలో చిన్న పిల్లల అశ్లీల (చైల్డ్ పోర్నోగ్రఫీ) వీడియోలను చూసి షేర్ చేస్తున్న వ్యక్తిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంకు చెందిన వి.నిరంజన్ నేషనల్ సెంటర్‌ఫర్‌మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో జరిగే మానిటరింగ్‌లో భాగంగా ఫెస్‌బుక్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ చూసి షేర్ చేస్తు న్నాడు. చైల్డ్ సెక్స్‌వల్ ఎక్స్‌ప్లోయితతిన్ అండ్ అబ్యూస్ మెటీరియల్ కం టెంట్ ఆధారంగా గుర్తించిన సైబర్ పోలీసులు అతనిపై కేసునమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలిపారు. ఇందులో భాగంగా ఎవరైనా ఇంటర్‌నెట్, ఆన్‌లైన్, సోషల్‌మీడియాలో చైల్డ్ పోర్నో గ్రఫీ గురించి సెర్చ్ చేసినా, చూసినా, షేర్‌చేసినా చట్టప్రకారం నేరస్తులవు తారని తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసి చేధించిన సైబర్ క్రైం డిఎస్‌పి ఫణిందర్, సిఐ కె నరేష్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయకుమార్, స్టేషన్ సిబ్బందిని సిపి సునిల్‌దత్ ఈ సందర్భంగా అభినందించారు.

# ఈ బాధలు తీరెదెన్నడో?

రేషన్ బియ్యం కోసం వృద్ధులు, మహిళల ఇక్కట్లు

తాత్కాలిక షాపుతో తూతూమంత్రంగా సరాఫరా

సంవత్సరాలుగా లబ్దిదారుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** దారిద్య్ర రేఖకు దిగువ నున్న వారికి రెండు పూటల కడుపు నింపేందుకు ప్రభు త్వాలు చౌక దుకాణాల ద్వారా బియ్యం అందిస్తుంది. రెక్కల కష్టంపై జీవిస్తున్న వారు నెలలో 1నుంచి 15రో జులలో ఏదో ఒక సమయంలో బియ్యం తీసుకునేం దుకు అవకాశం కల్పించాయి. కానీ ఖమ్మం జిల్లా ఏదు లాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ లోని ప్రజల రేషన్ సమస్య దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని చందంగా మారింది. గురువారం రేషన్ కోసం మహిళలు, వృద్దులు గంటల తరబడి పడిగాపు లు కాసిన తీరు వ్యవస్థనే వెక్కిరించింది. తాత్కాలిక షాపు కావడంతో డీలర్ ఉదాసీన వైఖరితో ఈ ఇబ్బం దులు ఎదురవుతున్నాతయి. ఈ నేపథ్యంలో తక్కువ మోతాదులో బియ్యాన్ని తీసుకొచ్చి ఖాళీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈవ్యవహారానికి కారణం లేక పోలేదని, పెద్దతండాలోని తన షాపుకు రావాలనే నెపంతో చేస్తున్నారని కార్డుదారులు ఆరోపిస్తున్నారు.

**ఏండ్లు కావొస్తున్న నో రేషన్‌షాప్...**

అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది వరంగల్ క్రాస్‌రోడ్ రేషన్ షాపు ఏర్పాటు వ్యవహారం. ఎందుకంటే రేషన్‌షాప్ ఏర్పాటుకు మోక్షం కుదిరినప్ప టికీ ప్రస్తుతం రేషన్ ఇస్తున్న డీలర్ కోర్టుకి వెళ్లి తనకే కావాలని స్టే తెచ్చుకున్నాడు. అలా రేషన్‌షాప్ రావాల్సి ఉన్నప్పటికీ రాకుండా ఆగిపోయింది. అది ఖాళీ అయి న తర్వాత గత ప్రభుత్వం హయంలో నూతన రేషన్ షాపులు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే వరంగల్ క్రాస్‌రోడ్డుకి రేషన్‌షాప్ మంజూరవుతుందని అందరూ అనుకున్నారు. కానీ తప్పుడు నోటిఫికేషన్‌తో ఆ షాపు ఇతర ప్రాంతానికి వెళ్లి మరోసారి నిరాష మిగిలింది. ఇది తప్పుడుగా వెళ్లిందా? లేకుంటే ఏదైన శక్తులు పని చేశాయా? అనేది తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. 400కు పైగా కార్డులున్నప్పటికీ ప్రజలు పొరుగు ప్రాంతానికి వెళ్లి బియ్యం తెచ్చు కోలేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఉచిత బియ్యం కోసం డబ్బులు ఖర్చు చేసుకో వాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూడుసార్లు వచ్చాను**

**పద్మ, బాధితురాలు**



రేషన్ కోసం మా ఇంటి దగ్గర నుంచి మూడుసార్లు నడుచుకుం టూ వచ్చాను. గంటల తరబడి కూర్చున్నప్పటికీ డీలర్ షాపు తీయలేదు. బియ్యం కోసం తమను ఇలా ఇబ్బందిపెట్టడం సరికాదు.

**ఒక్కరోజే ఇస్తున్నాడు**

**వాణి, బాధితురాలు**



గతంలో పెద్దతండాకు వెళ్లి బియ్యం తెచ్చుకునేవాళ్లం. ఇప్పు డు ఇక్కడ తాత్కాలికంగా ఇస్తున్న ప్పటికీ అది కూడా సరిగ్గా ఇవ్వండం లేదు. తూతూ మంత్రంగా ఒక్కరోజే ఇస్తున్నాడు.

**రెగ్యూలర్ షాపులో ఇవ్వాల్సిందే**

**సివిల్ సప్లైస్ డిటి విజయ్‌బాబు**

తాత్కాలిక షాపుగా ఏర్పాటు చేసినప్పటికీ ప్రతీనెల 1నుంచి15వరకు బియ్యం ఇవ్వాల్సిందే. షాపును తనిఖీ చేస్తాం. కార్డు లబ్దిదారులకు ఇబ్బందులు రాకుండా, లోటుపాట్లు ఉంటే సరి చేసి ప్రజలకు రేషన్ క్రమంతప్పకుండా ఇచ్చే ఏర్పాటు చేస్తాం.

"మహాత్మ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా 'ఫూలే'. ఈ చిత్రంలో ప్రతీక్ గాంధీ, పత్రలేఖ పాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. అనంత్ మహదేవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా హిందీలో గతేడాది విడుదలై ఘన విజయం సాధించింది. ప్రముఖ జర్నలిస్ట్ పొన్నం రవిచంద్ర 'ఫూలే' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు."

రీల్



# సంక్రాంతి మొత్తం పరిశ్రమదవ్వాలి

- చిరంజీవి

ఏ ఒంటి వెంకీ సంగతి అంటే అదిరిపోద్ది సంక్రాంతి .... ఏండీ బస్సు సంగతి అంటే ఇరగదీద్దాం సంక్రాంతి . కేవలం మన శంకర వరప్రసాద్ గారికే కాదు ఈ సంక్రాంతి మొత్తం మన తెలుగు పరిశ్రమదవ్వాలని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను. ప్రభాస్ రాజాసాబ్ గాని, అన్నయ్య అంటూ ఆప్యాంగా పిలిచే నా తమ్ముడు రవితేజ సినిమా, అలాగే శర్వానంద్ నారి నారి నడుమ మురారి కానీ, గురువుగారు నన్ను భవిష్యా నా శిష్యుడూ అన్న నవీన్ పొలిశెట్టి వీళ్లందరి సినిమాలు కూడాను ఈ సంక్రాంతికి సూపర్ హిట్ అవ్వాలని, తెలుగు సినిమా పరిశ్రమకు, నిర్మాతలకు, బయ్యర్లకు వీళ్ళందరూ సుఖీక్షంగా ఉన్నప్పుడే అదే నిజమైన సంక్రాంతి అని' మెగాస్టార్ చిరంజీవి అన్నారు. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ప్రీ రిలీజ్ ఈ వెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో పాటలకు వెంకటేష్ , చిరంజీవి సైతం స్టెప్పులేసి ఫ్యాన్స్‌కు పండుగ తెచ్చారు. ఈ సినిమా చాలా వినోదాత్మకంగా ఉంటుందని ఈ సందర్భంగా మాట్లాడిన చిరంజీవి చెప్పారు. అనిల్ రావిపూడి తన వద్దకు వచ్చి కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చిందని అన్నారు. అయితే గతంలో చేసిన చంటబ్బాయ్, ఘరానా మొగుడు, వంటి పలు సినిమాల్లో అభిమానులు చూసి ఎంత ఎంజాయ్ చేశారో ఇప్పుడు ఇప్పటి తరం వారు కూడా ఆయా పాత్రలతో ఎంజాయ్ చేస్తారని చెప్పారు. ఈ సినిమా ఆల్ రెడీ హిట్ అయిందని అన్నారు. అనుకున్న సమయంలో, అనుకున్న బడ్జెట్‌తో సినిమా పూర్తి చెయ్యడ మే ఈ రోజుల్లో మొదటి సక్సెస్ అని చెప్పారు. అనిల్ రావిపూడి ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో చక్కగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తప్పకుండా ఈ సినిమాను పెద్ద హిట్ చెయ్యడానికి మీరంతా సిద్ధంగా ఉన్నారని చిరంజీవి ఆకాంక్షను వ్యక్తం చేశారు. నయనతారకు ఎం చెప్పి ఒప్పించారో కానీ ప్రమోషన్స్‌కు కూడా అనిల్ రావిపూడి ఆమెను తీసుకువచ్చారని అన్నారు. గతంలో రెండు సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమాతో మాత్రం ఒక ఫ్యామిలీ ఫ్రెండ్ లాగా ఉండిపోయిన నయనతారను కొనియాడారు. ఈ సినిమాలో చిరంజీవితో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందని హీరో వెంకటేష్ అన్నారు. చాలా సరదాగా షూటింగ్ పూర్తి చేశామన్నారు. సినిమా నడిచినంత సేపు నవ్వులే నవ్వులని చెప్పారు. అనిల్‌తో పని చెయ్యడం ఎప్పటికి రెడీ అని అన్నారు. ఎలాంటి దర్శకులు పరిశ్రమకు అవసరమని చెప్పారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ నిజానికి వెంకటేష్ తో తనకిది నాలుగో చిత్రమని చెప్పారు. చిరంజీవి తో ఈ సినిమా చెయ్యడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. ప్రతి సన్నివేశం చాలా కొత్తగా ఉంటుందని చెప్పారు. భీమ్స్ చాలా మంచి సంగీతం అందించారని, మీసాల పిల్ల వంటి పాటలు ఇప్పటికే హిట్ అయ్యాయని చెప్పారు. అయితే ఓ వర్జీన్స్ కు పంపాల్సిన పని ఉండటం వల్ల ఈ ఈవెంట్ కు భీమ్స్ రాలేకపోతాయని అనిల్ చెప్పారు. నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి ఈ ఈవెంట్ లో మాట్లాడారు.

# భర్త మహాశయులకు విజ్ఞప్తితో గోలగోల చేద్దాం



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్ర బృందం ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసింది. ట్రైలర్ రవితేజ యాక్షన్ సినిమాలు చాలు అనే ఆకట్టుకునే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఇది ప్రేక్షకులు చాలా కాలంగా మిస్ అవుతున్న ఫ్యామిలీ జోన్‌కు అతను తిరిగి వస్తున్నాడనే ఫన్ ఇండికేషన్. ఫారిన్ టూర్ లో ఆషిక రంగన్నా ప్రేమ కలగడంతో, డింపుల్ హయతితో అతని వైవాహిక జీవితం ఊహించని విధంగా మారడంతో కథ మొదలవుతుంది. ఇద్దరు మహిళల, రెండు విభిన్న ప్రశ్నల మధ్య నలిగిపోతున్న అతని ప్రయాణం హిలేరియస్ గా అదే సమయంలో ఎమోషనల్‌గా సాగుతుంది.ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ ఈసారి పండక్కి సరదా సరదాగా గోల గోల చేద్దాం. ఇదొక్కటే కాదు.వస్తున్న అన్ని సినిమాలు ఫుల్ ఎంటర్టైన్మెంట్. ఈసారి ఫుల్ ఎంటర్టైన్మెంట్ సంక్రాంతి అవుతుందని నా ప్రగాఢ నమ్మకం ఉంది అన్నారు. ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ ఇది అద్భుతమైన జర్నీ. పాటలు టీజర్ కి సూపర్ రెస్పాన్స్ ఇచ్చారు. సినిమా అద్భుతంగా ఉంటుంది. జనవరి 13న సినిమా రిలీజ్ అవుతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ చూడాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ ఇది అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఫన్ ఫిల్మ్. ఖచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలు సూపర్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డింపుల్ హయతి మాట్లాడుతూ రవితేజతో ఇది నా రెండో సినిమా. ఇది నా మొదటి సంక్రాంతి సినిమా. అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ జనవరి 13న సినిమా రిలీజ్ అవుతుంది. మంచి ఎంటర్టైన్మెంట్ సినిమా. చూసి ఆనందిస్తారని కోరుకుంటున్నాను.



# అనగనగా ఒక రాజు ట్రైలర్ రిలీజ్

హీరో నవీన్ పొలిశెట్టి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. 'అనగనగా ఒక రాజు' చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో నవీన్ పొలిశెట్టి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, దర్శకుడు మారి, నిర్మాత సూర్యదేవర నాగవంశీతో పాటు చిత్ర బృందం హాజరైంది. అసలు సిసలైన పండగ చిత్రంగా 2026, జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దాదాపు మూడు నిమిషాల నిడివితో రూపొందిన 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. కింగ్ నాగార్జున అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'అనగనగా ఒక రాజు.. ఆ రాజుకి చాలా పెద్ద మనసు. ఆ మనసులోకి ధగధగా మెరిసిపోయే నగలు వేసుకొని యువరాణి దిగింది' అంటూ నాగార్జున వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. ఊరి పెద్దమనిషిలా బుల్లెట్ బండి మీద నవీన్ పొలిశెట్టి పాత్రను పరిచయం చేసిన తీరు బాగుంది. నోట్ల కట్టను గుడిలోని హుండీలో వేయబోతూ 'కన్నాన్ని పెద్దది చేయండి' అని పూజారితో చెప్పడం భలే ఉంది. ట్రైలర్‌లోని ప్రతి సంభాషణ గిలిగింతలు పెడుతోంది. మంత్రాన్ని తిరిగి చెప్పమని పూజారి అంటే.. మీనాక్షి చౌదరి గుండ్రంగా తిరగడం నవ్వులు పూయించింది. నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పాత్రలను మలిచిన తీరు, ఆ పాత్రల నుంచి హాస్యాన్ని పుట్టించిన తీరు కట్టిపడేసింది. నవీన్, మీనాక్షి ప్రేమకథకు వచ్చిన సమస్య ఏంటి? ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారు? అనే ఆసక్తిని కలిగిస్తూ ట్రైలర్‌ను రూపొందించారు. 'పండగకు అల్లుడు వస్తున్నాడు' అంటూ ఎద్దులబండిపై నవీన్‌ను చూపిస్తూ సంక్రాంతికి పండుగను ముందుగానే తీసుకొచ్చారు. నవీన్ పొలిశెట్టి తన కామెడీ టైమింగ్‌తో మరోసారి మెప్పించారు. నవీన్, మీనాక్షి మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. యువరాజు కెమెరా పనితనం, మిక్కీ జె మేయర్ నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ట్రైలర్‌తో అంచనాలు తారస్థాయికి చేరాయి అనడంలో సందేహం లేదు.'అనగనగా ఒక రాజు' చిత్రం సంక్రాంతి కానుకగా 2026, జనవరి 14న భారీ స్థాయిలో విడుదల కానుంది.

# ఆహా ఓహో... అందం నీదే అంటాడు



మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతున్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో నటించగా.. నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా నుంచి అస్సలు సినిమా అనే సాంగ్ రిలీజ్ చేశారు. ఆహా ఓహో అంటాడు.. అందం నీదే అంటాడు అనే పదాలతో మొదలైన ఈ సాంగ్ ఆకట్టుకుంటోంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను శ్రీయ ఘోషల్ పాడారు. ఈ పాటలో ఐశ్వర్య అర్జున్ అందాలు ఆరబోసింది. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. జి బాలమురుగన్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు యాక్షన్ కింగ్ అర్జున్ కొరియోగ్రఫీ అందించగా, నృత్యాలకు శాస్త్రి కొరియోగ్రఫీ అందించారు.

# 23న ప్రైమ్ వీడియోలో.. చీకటిలో

చంద్ర పెమ్మరాజు రచనా సహకారంతో శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'చీకటిలో' . సురేష్ ప్రొడక్షన్ ప్రై.లి. బ్యానర్‌పై డి. సురేష్ బాబు నిర్మించగా ప్రైమ్ ఒరిజినల్ సినిమాగా రానుంది. ఈ సినిమా జనవరి 23ను ప్రీమియర్ చేయనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ నేపథ్యములో చిత్రీకరించబడిన ఈ క్రైమ్ సస్పెన్స్ సినిమా, సంధ్య అనే ఒక ట్రూ క్రైమ్ పాడ్కాస్టర్ చుట్టూ తిరుగుతుంది. సంధ్య పాత్రను శోభిత ధూళిపాల పోషించారు. ఆమె నగరములో జరిగే కొన్ని దారుణమైన చీకటి రహస్యాలను వెలికితీస్తుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలలో శోభిత ధూళిపాలతో పాటు విశ్వదేవ్ రాచకొండ కనిపించనున్నారు. వెంట చైతన్య విశాలక్ష్మి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని, వడ్లమాని శ్రీనివాస్ ఇతరులు కీలక పాత్రలు పోషించారు. ఈ తెలుగు ఒరిజినల్ సినిమా ప్రైమ్ వీడియో భారతదేశములో అలాగే ప్రపంచవ్యాప్తంగా 240 పైగా దేశాలలో జనవరి 23న ప్రీమియర్ అవుతుంది. ఈ సందర్భంగా నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ 'చీకటిలో ఒక భావోద్వేగాలు నిండిన సస్పెన్స్ డ్రామా. చీకటిని ఎదుర్కోవడానికి, నిజాలు మాట్లాడటానికి కావలసిన ధైర్యాన్ని ఇది అన్వేషిస్తుంది. ఈనాటి సమాజములో ఇది మనకెంతో అవసరం. ఈ అమెజాన్ ఒరిజినల్ కోసం ప్రైమ్ వీడియోతో కలిసి పనిచేయడం ఒక అద్భుతమైన అనుభవాన్ని ఇచ్చింది. ఈ సినిమా దీర్ఘకాలంగా కొనసాగుతున్న మా భాగస్వామ్యములో మరొక మైలురాయి. తన ఉత్కంఠభరితమైన కథ, శక్తివంతమైన నటనతో చీకటిలో ఒక మరపురాని ఉత్తేజకరమైన ప్రయాణాన్ని అందిస్తుంది. భారతదేశముతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు జనవరి 23న ప్రైమ్ వీడియో పై చీకటిలో ప్రీమియర్ గా ప్రసారం అవుతుంది అని అన్నారు.




# ఫోన్ ట్యాపింగ్ కేసులో జైపాల్ యాదవ్ విచారణ ముగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రాన్ని కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై జరిగిన విచారణను సిట్ అధికారులు ముగించారు. ఇదే సమయంలో ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ అడిషనల్ ఎస్‌పి తిరుపతన్నను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి విచారించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి కీలక అంశాలపై స్పష్టత కోసం సిట్ అధికారులు తిరుపతన్నతో పాటు జైపాల్ యాదవ్ ను ఒకేసారి కలిపి విచారించారు. ట్యాపింగ్ ఆదేశాలు, సమాచార మార్పిడి, రాజకీయ నేతల పాత్రపై సిట్ లోతుగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. సిట్ విచారణ కొనసాగుతోంది.

# రూ.10 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 మున్సిపాలిటీలకు పలు దఫాలుగా నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం, తాజాగా 2025–26 బడ్జెట్ అంచనాల (బిఇ) కింద ఈ నిధులను విడుదల చేసింది. ఆర్థిక శాఖ జారీ చేసిన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బిఆర్ఓ) ఆధారంగా ఈ మొత్తాన్ని మున్సిపాలిటీలకు కేటాయించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రస్తుతం విడుదల చేసిన నిధులను మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి, అత్యవసర మరమ్మతులు, మురుగునీటి కాలువల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల మరమ్మతుల కోసం వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదలకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అవసరమైన సర్దుబాట్లు చేయనుండగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఖర్చుల వివరాలు, వినియోగ ధ్రువపత్రాలను అకౌంటెంట్ జనరల్‌కు సమర్పించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వాటా నిధులను ప్రభుత్వం నేరుగా మున్సిపాలిటీలకు మళ్లిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ జిఓతో పట్టణ స్థానిక సంస్థల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊపొస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 'ఎఐ'లో హైదరాబాద్ పరుగులు

మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కృత్రిమ మేథ సాంకేతికత రంగంలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని రాష్ట్ర ఐటి పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎయిడెన్ ఎఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా, వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఎయిడెన్ ఎఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ప్రస్తుతం తెలంగాణా వైపు చూస్తున్నాయన్నారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని వివరించారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఒ కిరణ్ వెంట్రప్రగడ, సిఒఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి నియామకంపై గందరగోళం

యుపిఎస్‌సి నుంచి తిరిగి వచ్చిన జాబిత
సుప్రీంకోర్టు అనుమతి తప్పనిసరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి పూర్తిస్థాయి డిజిపి నియామకం అంశంలో స్పష్టత లేకపోవడంతో వ్యవహారం మరో మలుపు తిరిగింది. డిజిపి నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ సంస్థ యూపీఎస్సీ (యుపిఎస్‌సి) తిరిగి రాష్ట్రానికి పంపించింది. ఈ నియామకానికి సుప్రీంకోర్టు అనుమతి తప్పనిసరిగా అవసరమని యుపిఎస్‌సి స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాలో ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డితో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, ఆప్టే, సౌమ్య మిశ్రా, షికా గోయల్ పేర్లు ఉన్నాయి. అయితే ఈ జాబితా ఆలస్యంగా పంపబడినందున, సుప్రీం కోర్టు నుంచి ప్రత్యేక అనుమతి తీసుకురావాల్సి ఉంటుందని యుపిఎస్‌సి తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ, తొలిసారి తొమ్మిది నెలల క్రితమే డిజిపి ప్యానెల్ జాబితాను యుపిఎస్‌సికి పంపామని, తాజాగా గత నెల 31న రెండోసారి అదే జాబితాను పంపినట్లు పేర్కొంది. అయినప్పటికీ యుపిఎస్‌సి నుంచి సుప్రీం కోర్టు అనుమతి అవసరమన్న సమాధానం రావడంతో నియామక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిజిపి నియామకంపై కొనసాగుతున్న ఈ అనిశ్చితి పోలీసు శాఖలోనూ, పరిపాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.



# స్వాగతిస్తాం (మొదటి పేజీ తరువాయి)

దిగుతున్నారని, ఇలాంటి విమర్శలు మానుకోవాలని చెప్పారు. ఎవరి సత్తా వారికి ఉంటుందని, తమ సత్తా ఏంటో పంచాయతీ ఎన్నికల్లో చూపించామని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఏవైనా సిపిఐదే హవా అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల సమరభేరి సభ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కూనంనేని మాట్లాడారు. కొద్దిరోజుల్లో కార్పోరేషన్ ఎన్నికలు జరగనున్నాయని, త్వరలో షెడ్యూల్ విడుదల కానుందని చెప్పారు. కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని చెప్పారు. 60 డివిజన్లలో పోటీ చేసేందుకు సిపిఐ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గడిచిన స్థానిక ఎన్నికల్లో మేజర్ గ్రామ పంచాయితీలను సిపిఐ కైవసం చేసుకుందని, అవాకులు చెవాకులు పేలే వారికి ఇది గుణపాఠం కాదా అన్నారు. కార్పోరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వాన్ని ఒప్పించామని, ఆ నాటి నుండి నేటి వరకు కోట్లాది రూపాయ నిధుల తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడుతన్నామని అన్నారు. గత 20 సం.లుగా మున్సిపల్ ఎన్నికలు జరగకుండా కొందరు రాజకీయ నాయకులు అడ్డుకున్నారని, వారి స్వలాభం కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అభివృద్ధిని అడ్డుకున్నారని మండిపడ్డారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలని, అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు పాటుపడాలని సూచించారు. ఇందు కోసం ఇప్పటి నుండే ప్రణాళికలు రచించి డివిజన్లలో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, వి పూర్ణ చంద్రరావు, సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, రాహుల్, ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు, డివిజన్ల కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

# వైదొలగిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాన్ని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉపసంహరించుకున్నారు. వీటిల్లో శాంతి, ప్రజాస్వామ్యం, తల్లీ పిల్లల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, వివిధ సంఘర్షణల్లో లైంగిక హింస నియంత్రణ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో, ఈ సంస్థలకు నిధులు ఇవ్వడంవ ల్ల అమెరికా పౌరులు చెల్లించే డాలర్లు వృథా అవుతాయని నిర్ణయానికి వచ్చిన తర్వాత ఈ ఉత్తర్వుపై ఆయన సంతకం చేశారు. ఇప్పటివరకూ విడుదల చే సిన నిధులద్వారా అమెరికా వ్యతిరేక సైద్ధాంతిక భావాల విస్తరణకు, అమెరి కా సార్వభౌమాధికార, ఆర్థికశక్తికి విరుద్ధమైన ఆలోచనల ప్రోత్సాహానికి ఉపయోగపడ్డాయని ఉత్తర్వు పేర్కొంది. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, భద్రతకు, ఆర్థిక పురోగతికి, సార్వభౌమత్వానికి భిన్నంగా నడిచే సంస్థలు ఇందులో ఉన్నాయని ఉత్తర్వు పేర్కొంది. ఈ 66 సంస్థలలో సగానికి సగం అంటే దా దాపు 33 సంస్థలు ప్రపంచ వాతావరణ సంరక్షణకోసం పాటుపడి వాతావర ణ నియంత్రణ చర్యలకోసం పాటుపడే సంస్థలే ఉన్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణవేత్తలు, పర్యావరణ పరిరక్షణకోసం పాటుపడే అనేక సంస లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిని పూర్తిగా స్వార్థపూరిత చర్యగా అభివర్ణించాయి. ఇప్పుడు యుఎన్ఎఫ్‌సిసిసి నుండి వైదొలగి బయటకు వెళ్ళిపోయిన ఏకైకదేశంగా అమెరికా తన బాధ్యతారాహిత్యాన్ని నిరూపించుకుందని పర్యావరణవేత్తలు విమర్శించారు. అమెరికా వినాశకరమైన నిర్ణయం తీసుకుందని పర్యావరణవేత్తలు, స్వచ్ఛందసంస్థల అధిపతులు విమర్శించారు. భూగోళాన్ని సంరక్షించేందుకు, కర్బన విషవాయువుల బారినుండి భూగోళా న్ని రక్షించేందుకు తీవ్రమైన కృషి జరుగుతోంది. గత ఏడాదిలో ప్రకృతివైపరీత్యాలు పరాకాష్టకు చేరి జాగ్రత్తగా ఉండాలని ప్రపంచదేశాలకు హెచ్చరిక కూ డా జారీచేశాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణ నియంత్రణ చర్యలు అమలు చే యడానికి అంతర్జాతీయ సంస్థలు,ప్రపంచదేశాలు తీవ్ర నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. ప్రపంచానికి ఎన్నో ఉమ్మడి సవాళ్ళు ఉన్నాయని, వీటన్నింటినీ సమష్టిగా ప్రతిఘటించి పరిష్కరించుకోవాల్సిన తరుణంలో ప్రపంచంలో నే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా అంతర్జాతీయ సంస్థల నుండి వైదొలగడం పూర్తి బాధ్యతరాహిత్య చర్య అని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఏకపక్ష దాడులకు, వనరుల ఆక్రమణ కు, ఏకపక్ష చర్యలకు పూనుకుంటూ,తన రక్షణ బడ్జెట్‌ను 50 శాతానికి పెం చుకుంటూ మరోవైపు తన ఉమ్మడి కర్తవ్యాలను విస్మరిస్తోందని పలు వార్తా సంస్థల ద్వారా విశ్లేషకులు విమర్శించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వ చ్చిన కొద్దివారాల్లోనే ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి కార్యకలాపాలలో పాల్గొనబోమని ప్రకటించారు. యునెస్కో, యుఎన్‌ఆర్‌డబ్ల్యు సంస్థలలో భాగస్వామ్యాన్ని కూడా సమీక్షిస్తామని ప్రకటించారు. 2015లో పారిస్ ఒ ప్పందం తర్వాత ఐఎస్ఏ (ఇంటర్నేషనల్ సోలార్ ఎలయెన్స్) కేంద్ర కార్యాలయాన్ని భారత్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఐఎస్ఎలో ప్రస్తుతం 100 దేశాలు స భ్యులుగా సంతకం చేశాయి. వీటిల్లో 90 దేశాలు శాశ్వత సభ్యత్వానికి అంగీకరించాయి. 2030 నాటికి సోలార్ పెట్టుబడులపై సాంకేతిక ఖర్చులు తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇప్పుడు దీనికి కూడా బ్రేకులు పడతాయి.

# సమస్యల్లో యూనివర్సిటీలు

(మొదటి పేజీ తరువాయి)

అట్టహాసంగా ఎఐఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ 10వ మహాసభ బొజ్జ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జీ రెహమాన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్ఎ స్టాలిన్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని దానిలో కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం2020 పేరుతో విద్య కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. దానిలో భాగంగానే ఇటీవల పార్లమెంట్ లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఏ) బిల్లును తీసుకురావడం జరిగిందని, ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసే విధంగా ఈ బిల్లు ఉందని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని, విబిఎస్ఏ బిల్లు ప్రతిపాదిస్తుందని, దాని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వంచే నియంత్రించబడే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని, ఈ విధానం ద్వారా సిలబస్ పూర్తిగా రాజకీయ, మతపర, విద్య ఉద్యోగ నియామకాల్లో పూర్తిగా రాజకీయ జోక్యం పెరుగుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయడంతో పాటు విబిఎస్ఏ బిల్లుని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓయూ అభివృద్ధికి 1000 కోట్ల నిధులు కేటాయించడం మంచి పరిణామమే కానీ ఇతర విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల సవతి తల్లి ప్రేమను చూపటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఓయూ మాదిరిగానే ఒక్కోక్క యూనివర్సిటీకి 1000 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులంతా సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జీ రెహమాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓయూకు కేటాయించిన మాదిరిగానే ఒక్కోక్క యూనివర్సిటీ కి 1000 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించాలని, యూనివర్సిటీ విద్యార్థుల మెస్ బకాయిలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కూడా మాట్లాడారు. ఈ మహాసభలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాను ప్రసాద్, జిల్లా నాయకులు సిపతి వినయ్, యూనివర్సిటీ కన్వీనర్ కొమ్ము సాయికృష్ణ, నాయకులు తాంద్ర రాజేష్, సిహెచ్ వంశీ, ఎస్ నవీన్, బండి లావణ్య, సారిక, మమత, అనూష, నీరజ, ధరణి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షునిగా కొమ్ము సాయికృష్ణ, కార్యదర్శిగా బొజ్జ జ్యోతి, ఉపాధ్యక్షులుగా తాంద్ర రాజేష్, బండి లావణ్య, సహాయ కార్యదర్శులుగా సిహెచ్ వంశీ, సారిక, కోశాధికారిగా తేజ లతో పాటు 21 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com